
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66 సంచిక : 229 | శుక్రవారం 09-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కపిల్ చిట్స్ తోడుంటే
కనక మహాలక్ష్మి మీ వెంటే
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
sricharanamedia.com

ఎక్కడి బస్సులు అక్కడే..





మేము సైతం

- స్తంభించిన జనజీవనం
- విద్య, ఉద్యోగ, వ్యాపార వర్గాల పూర్తి సహకారం
- వాడవాడలా ధర్నాలు, ర్యాలీలు
- డిపోల్లోనే నిలిచిన బస్సులు
- నిధుల కోసం నిరంతర పోరు
- రాష్ట్ర ప్రజలకు సీపీఐ అభినందనలు

కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న రామకృష్ణ తదితరులు



బడ్జెట్‌లో అన్యాయంపై సంపూర్ణ బంద్

జనాగ్రహం

రాష్ట్రాన్ని అడ్డగోలుగా చీల్చి ఒక పార్టీ దుర్మార్గానికి ఒడిగడితే, ఆ హామీలను నెరవేర్చాల్సిన పాలక పార్టీ బీజేపీ గాలికి వదిలేసి నిధులు ఇవ్వకుండా నానా అగచాట్లకు గురిచేస్తోంది. మిత్రధర్మాన్ని సైతం అభాసుపాలు చేసింది. బడ్జెట్‌పై పెట్టుకున్న ఆశలన్నీ వమ్ము కావడంతో ఆంధ్ర ప్రజానీకం జ్వలించింది. వామపక్షాల స్ఫూర్తితో, పిలుపుతో అన్ని పార్టీలు ఐక్యగళంతో ప్రతిపల్లె, ప్రతి పట్నం ఏకమై సంపూర్ణ బంద్ రూపేణా ఆగ్రహావేశాలు వెళ్లగక్కాయి. పాడిందే పాడరా పాచిపళ్ల దాసరి అంటూ పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రుల పేలవ గారడీ ప్రసంగాలపై ఎలుగెత్తి నిరసన చాటారు. మభ్యపెడుతున్న ఇటువంటి డ్రామాలను తాము నమ్మబోమని హెచ్చరించారు. ఇది ఆరంభమేనని, భవిష్యత్తు రణరంగమేనంటూ నినదించారు.

మరిన్ని బంద్ వార్తలు లోపలి పేజీల్లో

బంద్ చిత్రాలు జిల్లా టాబ్లాయిడ్‌లో

11లో



విజయవాడలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు మధు, బాబూరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు



నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం దుండిగం వద్ద బంద్‌కు సంఘీభావం తెలిపిన జగన్



గుంటూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ముప్పాళ్ల, జంగాల అజయ్, లక్ష్మణరావు తదితరులు



విశాఖపట్నం జగదాంబ జంక్షన్‌లో జేవీఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ



విజయవాడ లెనిన్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న చలసాని శ్రీనివాస్, విద్యార్థి సంఘాలు

గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం

రైతులకు వరం

- వివరాలు 2 లో

ఇదీ లోకం!



అది ఎన్నికల ప్రసంగం

- పార్లమెంటును దుర్వినియోగం చేశారు
- మోడీ వ్యవహారసరళిపై సీపీఐ విమర్శ

న్యూఢిల్లీ : పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ చేసిన ప్రసంగం ఒక బీజేపీ నాయకుడు రోజువారీగా చేసే ఎన్నికల ప్రసంగంవలే ఉందనీ ప్రధానమంత్రి మాట్లాడినట్లుగా లేదని సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటనలో విమర్శించింది. ప్రధానమంత్రి రాజ్యాంగ పదవిని నిర్వహిస్తున్నారు. ఆయన ప్రసంగం గౌరవనీయంగా, హుందాగా ఉంటుందని ఆశిస్తాం. అయితే ఆయన పార్లమెంటు వేదికను దుర్వినియోగంచేసి రాజకీయ ప్రత్యర్థులపై విషం కక్కారు. సగం సత్యాలతో కూడిన ఆరోపణలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పార్లమెంటులో బీజేపీ పూర్తి మద్దతు తెలియజేసింది. మోడీ దీనికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను, భారతదేశాన్ని కాంగ్రెస్ విభజించిందని ఆయన నిందించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా ఇస్తామని ఆ తరువాత ప్రత్యేక ప్యాకేజి అమలుచేస్తామని పార్లమెంటులోనే వాగ్దానాలు చేశారు. ఆ అంశంపై ఒక్క మాటకూడా మాట్లాడలేదు. రఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై భద్రత పేరుతో పారదర్శకత లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ ఒప్పందంపై ప్రధాని ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

గోరక్షకుల పేరుతో మైనారిటీలు, దళితులపై దాడులు, మేధావులను వెంటాడటం, సాంస్కృతిక విలువలు దిగజారడంపై దేశం ఆందోళన చెందుతున్నది. ఉద్యోగాలకోసం యువత ఆందోళన పడుతున్నది. గిట్టుబాటు ధరలు రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. ఆహారవస్తువుల ధరల పెరుగుదలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు తమ హక్కులు హరిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. దేశం ఇన్ని సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రధాని వీటిపై ఒక్కమాటకూడా మాట్లాడలేదు. బీజేపీ ప్రభావం రోజురోజుకీ దిగజారిపోవడం దేశ

- మిగతా 2 లో

జైట్లీ నోట అదే మాట

ఏపీకి నిధులు ఇచ్చాం.. ఇస్తాం

- జాతీయ సంస్థలు కేటాయించాం.. పోలవరానికి నిధులు ఇస్తున్నాం
- రెవెన్యూ లోటుపై లెక్కలేస్తున్నాం
- రైల్వేజోన్, పెట్రో కారిడార్‌పై చర్చిస్తున్నాం
- సానుభూతి ఉంది.. ఓపిక పట్టండి



విశాలాంధ్ర-న్యూఢిల్లీ బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మళ్లీ పాతపాటే పాడారు. ఎంపీల ఆందోళనపై స్పందించిన ఆయన ఏపీకి సాయం చేసే విషయానికి సంబంధించి ఎటువంటి నిర్దిష్ట ప్రకటన చేయలేదు. గురువారం లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో జైట్లీ మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఇస్తున్నాం.. ఇస్తామని తెలిపారు. ఏపీకి ఇచ్చిన హామీలను ఇప్పటికే కొన్ని అమలు చేశామని, మరికొన్ని అమలు దశలో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు తాము మద్దతిచ్చినా ఏపీ హక్కుల కోసం తాము పోరాడామన్నారు. రాష్ట్రానికి పలు జాతీయ సంస్థలు కేటాయించామని, వాటికి నిధులు ఇస్తున్నామని, ఇంకా ఇస్తామని చెప్పారు. రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలకు కూడా

- మిగతా 2 లో

పోలవరానికి రూ.414 కోట్లు విడుదల 2లో

Dwaraka

ఎండుతున్న ఆరుతడి పంటలు

- నీరు ఇవ్వకుండా తెలంగాణ దొంగాట
- కేఆర్‌ఎంబీ ఆదేశాలు బేఖాతరు
- మళ్లీ వినతి పత్రం అందచేసిన సాగునీటి సంఘాలు



వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఏపీ సాగునీటి సంఘాల సారథులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కృష్ణానదీ జలాల వినియోగంలో రెండు తెలుగు రాష్ట్రాలు గొడవలు పడుతూ రైతుల పొట్టగొడుతున్నాయి. గత మూడేళ్లుగా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు ఎగువ నుంచి నీరు రాకపోవడంతో సాగు,తాగునీటి కోసం రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయడంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోంది. హైదరాబాద్‌కు తాగునీరు సహా తెలంగాణా జిల్లాలకు నీటిని వదులుతూ, ఏపీకి అన్యాయం చేస్తోంది. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు

- మిగతా 2 లో

గాజాలో ఇంధన సంక్షోభం



గాజా : పాలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతంలో ఇంధనం, విద్యుత్ సరఫరా సంక్షోభం ఏర్పడింది. ఫలితంగా పలు ఆసుపత్రులు పనిచేయడంలేదు. కొన్ని ఆసుపత్రులలో తక్కువగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఇంధనం కొరత తీవ్రంగా ఉంది. బుధవారం విస్తృత ప్రాంతాల్లో పెట్రోలు, డీజిలు లభించలేదని ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలియజేసింది. అలాగే 19 ఆరోగ్య కేంద్రాలు, 16 క్లినిక్‌లు, మూడు పెద్ద ఆసుపత్రులలో ఇంధనంలేక జనరేటర్లు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆరోగ్యశాఖ ప్రతినిధి అంబునిమాహ్ తెలిపారు. ఆయా ఆసుపత్రులలో జనరేటర్ల పైన ఆధారపడి విద్యుత్ సరఫరా జరుగుతున్నదని తెలిపారు. ఎక్కువ ప్రాంతాలలో కొన్ని గంటలు మాత్రమే విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. హమాస్ మిలిటెంట్లు తమ సంస్థకు చెందిన మొహమ్మద్ అల్ బషిత్ ఇజ్రాయిల్ జైలునుంచి విడుదల కావడంతో ఆయుధాలు ధరించి వేడుకలు చేసుకుంటున్నారు.

సిల్క్‌రోడ్డుపై చైనా డచ్ సహకారం



బీజింగ్ : బెల్ట్ & రోడ్ ఇనీషియేటివ్ 2018 ప్రాజెక్టు (సిల్క్‌రోడ్) నిర్మాణంలో చైనా నెదర్లాండ్స్ (డచ్) కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ డచ్‌రాజు విలియం అలెగ్జాండర్‌ను బీజింగ్‌లో కలుసుకుని మాట్లాడారు. డచ్ రాజదంపతులు ఈనెల 7,8 తేదీలలో చైనాలో పర్యటించారు. వారికి జిన్‌పింగ్ ఘనస్వాగతం పలికారు. 2014లో తాను నెదర్లాండ్స్‌లో పర్యటించిన అంశాన్ని ఈ సందర్భంగా జిన్‌పింగ్ గుర్తుచేశారు.రెండు దేశాల మధ్య సమ్మిళిత సహకార భాగస్వామ్యం ఉంటుందని జిన్‌పింగ్ చెప్పారు. చరిత్రలో ఏనాడు లేనంతగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ప్రస్తుతం నెలకొని ఉన్నాయని అన్నారు. రాజకీయంగా పరస్పర విశ్వాసం ఒకరిపట్ల మరొకరికి గౌరవం కీలకమైన అంశాలలో పరస్పరం ప్రయోజనం కలిగించే రంగాలలో సహకరించుకుంటామని చెప్పారు. నెదర్లాండ్స్ కూడా చైనాతో సంబంధాలను మరింతగా పెంపొందించుకుంటుందని సిల్క్‌రోడ్ నిర్మాణంలోను పాల్గొంటామని డచ్ రాజు విలియం అలెగ్జాండర్ తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

మాల్దీవుల్లో సంక్షోభంపై

హక్కుల గ్రూపుల ఆందోళన



మాలె : మాల్దీవుల్లో ఏర్పడిన సంక్షోభంపైన హక్కుల గ్రూపులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 9 మంది ప్రతిపక్ష నేతలను జైలునుంచి విడుదల చేయాలని, బహిష్కృతులైన 12 మంది ఎంపీలపై నిషేధాన్ని రద్దు చేయాలని మాల్దీవుల సుప్రీంకోర్టు ఈనెల 1వ తేదీన తీర్పు చెప్పిన తరువాత సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశాధ్యక్షుడు అబ్దుల్‌యమీన్ కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకపోగా దేశంలో అత్యవసర పరిస్థితిని విధించడమేగాక, సుప్రీంకోర్టు న్యాయమూర్తు లను అరెస్టు చేయించారు. ప్రతిపక్షాలు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి అత్యవసర పరిస్థితి విధింపు అప్రజా స్వామికమని వ్యాఖ్యానించింది. చట్టాలకు అను గుణంగా వ్యవహరించాలని అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వస్తున్నాయి. దేశంలోని పరిస్థితులను వివరించేందుకు ప్రభుత్వం తన దూతలను చైనా, పాకిస్తాన్, సౌదీ అరేబియాలకు పంపింది. రెండురోజుల క్రితం భారతదేశం జోక్యం చేసుకుని పరిస్థితులు చక్కదిద్దాలని మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్ భారత దేశానికి విజ్ఞప్తి చేశారు. దక్షిణాసియా ప్రాంత మానవ హక్కుల గ్రూపులు మాల్దీవుల్లో పరిస్థి తులపైన ఆందోళన వ్యక్తం చేస్తూ ఎమీన్ ప్రభుత్వం నియంతృత్వ ప్రజాస్వామ్య విరుద్ధ మైన చర్యలను తీసుకుంటున్నదని వ్యాఖ్యానిం చాయి. ఎమీన్‌పైన అనేక అవినీతి మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలున్నాయి. అయితే వాటిని ఆయన తిరస్కరించారు. రాజకీయంగా ఆయన ఇప్పుడు ఒంటరి అయిపోయారు. ప్రాథమిక స్వేచ్ఛలను, హక్కులను పునరుద్ధ రించాలని మానవ హక్కుల అభివృద్ధి ఆసియా ఫోరం మాల్దీవుల ప్రభుత్వాన్ని కోరింది. సుప్రీంకోర్టు న్యాయ మూర్తులను విడుదల చేయా లని కోర్టు తీర్పును సిరసా వహించాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. దేశంలో 15 రోజులపాటు అత్యవసర పరిస్థితి అమలులో ఉంటుం దని ఎమిన్ ప్రభుత్వం ప్రక టించింది. మాజీ అధ్యక్షుడు అబ్దుల్‌గయూమ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. 2017లో చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని మాల్దీవులు కుదుర్చుకున్న తరువాత భారతదేశంతో సంబంధాలు దెబ్బతిన్నాయి. భారత రాయబారిని అనుమతిలేకుండా స్థానిక సంస్థలకు చెందిన ముగ్గురు సభ్యులు కలుసుకున్నారని ఆరోపిస్తూ వారిని మాల్దీవుల ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీంతో 2017 డిసెంబర్ నుంచి భారత మాల్దీవుల ద్వైపాక్షిక సంబంధాలు మరింత దిగజారాయి.

హవానాలో పుస్తక ప్రదర్శన



హవానా : క్యూబా రాజధాని హవానాలో 27వ అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభమయ్యింది. ఈ ప్రదర్శనలో స్పెయిన్ సాహితీవేత్త, జర్నలిస్టు పాస్కుల్‌సెర్రనో పాల్గొన్నారు. ఆయన ఇటీవల రచించిన రెండు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఆయన ఈ సందర్భంగా ప్రెన్సాలాటినాతో మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో పాల్గొనడంవల్ల స్థానిక పాఠకులను కలుసుకుని మాట్లాడే అవకాశం ఏర్పడిందని అన్నారు. మరో 5గురు ప్రముఖ జర్నలిస్టులు, రచయితలు అయిన వారిని కలుసుకుని చర్చించే అవకాశం ఏర్పడిందని కూడా ఆయన తెలిపారు. పుస్తక రచనకంటే తనకు జర్నలిస్టుగా పనిచేయడం ఎక్కువ ఇష్టమని అన్నారు.

వెనిజులా సంధి చర్చలలో ప్రతిష్టంభన



కారకాస్ : వెనిజులా సోషలిస్టు ప్రభుత్వానికి, మితవాద ప్రతిపక్ష గ్రూపుకు మధ్య సయోధ్య కోసం జరుగుతున్న చర్చలలో ప్రతిష్టంభన ఏర్పడిందని ఇరువైపులా వారు ఒక ఒప్పందానికి రాలేకపోయారని డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షుడు దనిలొమెడిన తెలిపారు. ఈ చర్చలకు నిరవధికంగా అంతరాయం కలిగినట్లేనని ఆయన అన్నారు. రెండు పక్షాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు డొమినికల్ రిపబ్లిక్ ప్రయత్నిస్తున్నది. తమ దేశంలోనే ఇరుపక్షాల మధ్య చర్చలను నిర్వహిం చింది. డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటొ డొమింగొ నగరంలో జరిగిన విలేకరుల సమావే శంలో మిడిన పై విషయం తెలిపారు. గతంలో జరిగిన చర్చలలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఒప్పందంపైన సంతకం చేసేందుకు దేశాధ్యక్షుడు నికొలస్‌మదురొ సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు మరో భిన్నమైన ప్రతిపాదన తీసుకువచ్చాయని మెడిన చెప్పారు. జనవరి 31వ తేదీన ఇరుపక్షాల మధ్య ప్రాథమిక ఒప్పందం కుదిరిందని దాని ప్రకారం శాంతియుతంగా కలిసి పనిచేయాలని సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. అయితే ప్రతిపక్ష ప్రతినిధి జులియోబోర్జెస్ దీనిని ప్రాథమిక ఒప్పందంగా పేర్కొనడానికి తిరస్కరించారు. ప్రతిపక్షం తమకు అందజేసిన ప్రతిపాదనలను వెనిజులా ప్రభుత్వానికి పంపుతామని మెడిన చెప్పారు.

మార్చిలో మదురొ భారత్ పర్యటన : వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురొ మార్చినెలలో భారతదేశంలో పర్యటించనున్నారు. అంతర్జాతీయ సోలార్ అలయెన్స్ సమ్మిట్ మార్చిలో ఢిల్లీలో జరగనున్నది. ఈ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రావలసిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి మదురొను ఆహ్వానించారు. సమ్మిట్‌లో పాల్గొనడమేగాక మదురొ నరేంద్ర మోడీతోను విడిగా సమావేశమవుతారని వెనిజులా దౌత్యవర్గాలు తెలిపాయి. మదురొ గత సంవత్సరమే భారతదేశంలో పర్యటించవలసి ఉన్నప్పటికీ అది వాయిదా పడింది.

రష్యా, టర్కీల సైనిక సహకారం

మాస్కో : రష్యా, టర్కీలు సైనిక, ఇంటిలిజెన్స్ విభాగాలలో పరస్పరం సహకరించుకునేందుకు అంగీకరించాయి. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, టర్కీ అధ్యక్షుడు రిసెప్‌తయిప్ ఎర్డొగన్‌లు ఫోన్‌లో మాట్లాడుకుని ఈమేరకు అంగీకారానికి వచ్చారు. సాయుధ దళాల కార్యకలాపాలను పటిష్టం చేసుకు నేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు క్రెమ్లిన్ ఒక ప్రకటనలో తెలియజేసింది. టెర్రరిస్టు గ్రూపులను అణచివేసేందుకు రష్యా, టర్కీల ప్రత్యేక దళాలు కలిసి పనిచేస్తాయి. సిరియాలో రష్యా సైనిక విమా నం పైలెట్ రోమన్ ఫిలిపోవ్ మరణానికి ఎర్డొగన్ సంతాపం తెలియజేశారు. సిరియాలో ఉద్రిక్తరహిత జోన్ల ఏర్పాటుకు ఆస్థానంలో కుదిరిన ఒప్పందాలను తప్పనిసరిగా అనుసరించాలని రెండు దేశాలు భావిం చాయి. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చేసిన తీర్మానానికి కట్టుబడి ఉండాలని, అలాగే రాజకీయ దౌత్య పరిష్కారాన్ని తప్పనిసరిగా పాటించాలని నిర్ణయించినట్లు క్రెమ్లిన్ ప్రకటన తెలిపింది. జనవరి 30వ తేదీన సోచీలో జరిగిన సిరియా జాతీయ చర్చలలో చేసిన నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలని కూడా ఇరుదేశాలు అంగీకరించాయి.

ఉత్తరకొరియాలో సైనిక పెరేడ్





పోంగ్‌యాంగ్ : ఉత్తరకొరియా రాజధాని పోంగ్‌యాంగ్‌లోని కిమ్‌టుసంగ్‌స్క్వేర్‌లో గురువారం సైనిక పెరేడ్ జరిగింది. దాదాపు 10వేలమందికిపైగా సుశిక్షితులైన సైన్యం ఈ పెరేడ్‌లో పాల్గొన్నది. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు పూలబుకేలు తీసుకుని వచ్చి సైనికులకు అందించి వారికి అనుకూలంగా నినాదాలు చేశారు. గురువారం ఉదయమే ఈ పెరేడ్ జరిగిందని దక్షిణ కొరియా ప్రభుత్వ అధికారులు తెలియజేశారు. అయితే పెరేడ్ నుద్దేశించి ఆదేశాధ్యక్షుడు కిమ్‌జాన్‌ఉంగ్ మాట్లాడారా లేదా అనేది స్పష్టతకాలేదని ఆయన తెలియజేశారు. అలాగే వ్యూహాత్మక ఆయుధాలను అంటే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ప్రదర్శించారా? లేదా అన్న అంశం కూడా తెలియదని దక్షిణకొరియా అధికారులు చెప్పారు. 70వ సైనిక వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ పెరేడ్‌ను నిర్వహించినట్లు ఉత్తరకొరియా తెలిపింది. సాధారణంగా ఇంత భారీగా సైనిక పెరేడ్ జరగదు.అయితే 7 దశాబ్దాల క్రితం రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఆ సందర్భంగా ఈ పెరేడ్ నిర్వహించామని ఉత్తరకొరియా పేర్కొన్నది. దక్షిణకొరియాలో శుక్రవారం నుంచి జరగనున్న శీతాకాల ఒలింపిక్స్‌కి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కిమ్‌జాంగ్‌ఉన్ గతంలోనే చెప్పారు. ఉత్తరకొరియానుంచి 22 మంది క్రీడాకారులతో పాటు 400 మంది సంగీత కళాకారులు, గాయకులు, మార్షల్ ఆర్ట్స్ ప్రవీణులు తదితరులు ఇప్పటికే సియోల్‌కు చేరుకున్నారు. రెండు కొరియాలకు చెందిన క్రీడాకారులు, కళాకారులు ఒకే పతాకం కింద క్రీడామార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. కిమ్‌జాంగ్‌ఉన్ చెల్లెలు కిమ్‌యోజాంగ్ కూడా ఒలింపిక్స్‌కు హాజరవుతున్నారు.

పోలవరానికి రూ.414 కోట్లు విడుదల

- 2019 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామన్న గడ్కరీ

న్యూఢిల్లీ-విశాలాంధ్ర బ్యూరో : పార్లమెంటు ఉభయ సభల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలో కేంద్రం ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు రూ.414.44 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయటం తన బాధ్యతగా కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. బీజేపీ ఎంపీలు కంభం పాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ గురువారం నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు నిధులు, జాతీయ రహదారులు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. దీనికి ముందు బీజేపీ ఎంపీలు, ఏపీ మంత్రి కామినేని కొల్లేరు సమస్యలపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుని కలిసి విన్నవించారు.

మోడీ... చెత్తమాటలు కట్టిపెట్టు

ఏపీకి న్యాయం జరిగే వరకు పోరాటం

బంద్‌కు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో చెత్త ఉపన్యాసం చేస్తున్నారు. చెత్తమాటలు కట్టిపెట్టి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేయడంపై నిరసనగా సీపీఐ, వామపక్ష పార్టీలు ఇచ్చిన బంద్‌కు సహకరించిన రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలు, వర్తక వాణిజ్య వ్యాపారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని రామకృష్ణ అన్నారు. గురువారం కర్నూలులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.జె.చంద్రశేఖర్‌రావు, పి.హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, భీమలింగప్ప, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ నాయకుడు మనోహర్‌మాణిక్యం, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ఎస్.ఎన్.రసూల్‌లతో కలసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ 13 జిల్లాల్లో బంద్ సంపూర్ణంగా జరిగిందన్నారు. ప్రతిపక్ష వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు విరామం ప్రకటించి నెల్లూరులో బంద్‌లో పాల్గొన్నారన్నారు. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి బంద్‌లో పాల్గొన్నారని తెలిపారు. జనసేన కూడా బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియచేసిందన్నారు. ప్రజాసంఘాలు, వర్తక వాణిజ్యసంఘాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ తదితరులు

సెలవు ప్రకటించిందని, బస్సులు డిపో నుండి బయటకు పోకుండా సహకరించారన్నారు. టీడీపీ వారు కూడా పార్లమెంట్‌లో ఎంపీలు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం పేరుతో ఆందోళనకు దిగారన్నారు. ఈ విషయంలో రాజకీయం చేయదల్చుకోలేదని మేము స్పష్టంగా ముందు నుంచే చెబుతున్నామని, రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజల సమస్యకు సంబంధించి అన్ని పార్టీలు కలసి కేంద్రంపై వత్తిడి తేవాలని కోరుతున్నామన్నారు. సీపీఐ నేత డి.రాజా, కె.వి.పి.రామచంద్రరావుతో మాట్లాడానని ఆయన వివరించారు.

రాజ్యసభను ఉప రాష్ట్రపతి వాయిదా వేశారని, వాయిదా వలన సమస్య పరిష్కారం అవుతుందా అని రామకృష్ణ ప్రశ్నించారు. 44 నెలల్లో రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు.

విభజన చట్టంలో నాడు పార్లమెంట్‌లో ఆమోదించినవి అమలు చేయలేదన్నారు. మోడీ చెత్త ఉపన్యాసాలు కట్టిపెట్టి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఏపీకి మీరు ఇచ్చే బడ్జెట్ నిధులు బాహుబలి కలెక్షన్ అంతా కూడా లేదన్నారు. నేడు 5 కోట్ల మంది స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారంటే ఇది ప్రభుత్వానికి చెంపపెట్టు, త్వరలోనే వామపక్ష పార్టీలు సమావేశమై నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్ని పార్టీలతో మాట్లాడతాం, అవసరమైతే అధికార టీడీపీతో మాట్లాతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించాలని, రాష్ట్రానికి న్యాయం జరగాలని, అంతవరకు వదిలిపెట్టమని రామకృష్ణ స్పష్టం చేశారు. బంద్‌కు సహకరించిన వారందరిని పేరుపేరున హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు.

అది ఎన్నికల ప్రసంగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు చేసిన వాగ్దానాల అమలులో వైఫల్యంవల్ల నిరాశావాదాన్ని ఆయన ప్రసంగం ప్రతిబింబిస్తుంది. దేశ ప్రజలను ఒప్పించేవిధంగా ప్రసంగించవలసిన మోడీ ఆ పని చేయలేదు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలనుండి వారి దృష్టిని మళ్లించేందుకు ప్రధాని ప్రయత్నించడంపై సీపీఐ పూర్తిగా అసంతృప్తిని, విచారాన్ని వ్యక్తం చేస్తున్నది. మోడీ నాయకత్వంలో ఎన్‌డీఏ అనుసరిస్తున్న విధానాలు దివాలాకోరువని సీపీఐ విమర్శించింది.

జైట్లీ నోట అదే మాట

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నిధులను కేటాయించామని తెలిపారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా తీసుకుని నిధులు ఇస్తున్నామన్నారు. గత నెలలో నాబార్డ్ ద్వారా నిధులు ఇవ్వాలని ఏపీ సీఎం లేఖ రాస్తే అలానే చేస్తున్నామని ఆయన వివరించారు. రెవెన్యూ లోటుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అధికారులతో కలిసి లెక్కలు వేస్తున్నామని, రైల్వే జోన్, పెట్రో కారిడార్‌కు సంబంధించి చర్చలు జరుపుతున్నాని వివరించారు. అయితే అదనపు నిధులుగానీ, ఈఏపీలపై గానీ స్పష్టత ఇవ్వలేదు. విద్యాసంస్థలు, పోలవరం, రాజధానిపై కచ్చితమైన హామీ ఇవ్వలేదు. దీంతో టీడీపీ ఎంపీలు మరోసారి జైట్లీ ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆ గందరగోళం నడుమ సభ రేపటికి వాయిదా పడింది. అయితే తమ ఆందోళనలకు కేంద్రం నుంచి నిర్దిష్ట ప్రకటన వస్తుందని ఆశించిన తెలుగుదేశం ఎంపీలు నిరాశ చెందారు. ఏపీకి చేశాం, చేస్తామంటూ జైట్లీ ప్రసంగం సాగడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

జీడీపీ వృద్ధి రేటులో నెంబర్‌వన్

యూపీఏ హయాంలో ఆర్థికవృద్ధి మందగించిందన్నారు. తొలి మూడేళ్లలో జీడీపీ వృద్ధిరేటులో ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఏడాది కాస్త వెనుకబడ్డామని, వచ్చే ఏడాది అగ్రస్థానంలో ఉంటామని స్పష్టం చేశారు. విమర్శలపై కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని జైట్లీ సూచించారు. ప్రస్తుతం సంస్కరణలు కఠినంగా ఉన్నా ముమ్ముందు సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

ఆరుతడి పంటలు

(మొదటిపేజీ తరువాయి)

కింద పశ్చిమ కృష్ణాలో ఎక్కువశాతం, పశ్చిమగోదావరిజిల్లాలో కొంతమేర కలిపి మొత్తం 3.60 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో మిర్చి, పొగాకు, పత్తి, పసుపు వంటి వాణిజ్య పంటలతోపాటు మొక్కజొన్న, మినుమును ఆరుతడి పంటలుగా వేసారు. పలు ప్రాంతాల్లోని మామిడి తోటలు కూడా ఈ కాలువపైనే ఆధారపడి ఉన్నాయి. సాగర్ నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసే బాధ్యతలు తెలంగాణ ప్రభుత్వం చేతిలో ఉండడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతాంగం జీవితాలతో ఆటలాడుతోంది. ఆరుతడి పంటలను సాగు చేసేందుకు గత ఏడాది నవంబరు నుంచి జనవరి వరకూ 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)ని కోరింది. దీంతో 12 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్‌ఎంబీ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే నవంబరులో మొదటి విడతగా 2,3 జోన్లకు 3.78 టీఎంసీలు, రెండో విడతగా జనవరిలో 2.37 టీఎంసీలను మాత్రమే తెలంగాణ విడుదల చేసింది. అయితే 3వ జోన్‌కు నీరు చేరకపోవడంతో ఏపీకి చెందిన సాగునీటి సంఘాల ప్రతినిధులు కేఆర్‌ఎంబీ సభ్య కార్యదర్శి పరమేశంతోపాటు తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులను కలసి వినతి పత్రాలను అందచేశారు. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు 20 రోజులపాటు రోజుకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

దీనిపై స్పందించిన పరమేశం అంతరాయం లేకుండా నీటిని విడుదల చేయాలని తెలంగాణ అధికారులకు ఆదేశించారు. దీంతో జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ మాత్రమే నీటిని వదిలి, తర్వాత నిలుపుదల చేశారు. ఈ క్రమంలో నీరు అందక దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి కోటాగా ఏపీలోని 2,3 జోన్లకు 4.25 టీఎంసీల నీటిని కేటాయించాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి ఇండెంట్ పంపింది. అలాగే నీటి విడుదల షెడ్యూలు కూడా ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సాగర్ డ్యామ్ హెడ్ రెగ్యులేటర్ కూడా కనీసం 15 రోజులపాటు విడుదల చేయాలని ఇండెంట్‌లో పేర్కొంది.

నేటి నుంచి మళ్లీ నీరు విడుదల

తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎడమ కాల్వకు నీటిని నిలిపివేయడాన్ని నిరసన వ్యక్తం చేస్తూ ఏపీ సాగునీటి సంఘాల ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లోని కేఆర్‌ఎంబీ కార్యాలయానికి వెళ్లి సభ్య కార్యదర్శి పరమేశంతో భేటీ అయ్యారు.

అలాగే తెలంగాణ జలసౌధ కార్యాలయానికి కూడా వెళ్లి చీఫ్ ఇంజనీర్ ఎస్ సునీల్‌ను కలసి 3వ జోన్‌లో నీటి ఎద్దడిని వివరించారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి శుక్రవారం నుంచి నిర్దేశించిన నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఏపీ జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ వెళ్లిన బృందంలో తనతోపాటు ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల చెన్న కేశవరావు, ఏపీ సాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎస్ఏ జబ్బార్, ఎస్ఈ ఎం వెంకట రమణ, ఈఈ ఆర్ శ్యాంప్రసాద్, డీఈఈ జి శ్రీనివాసరావు, ఏఈఈ సీహెచ్ కిరణ్ తదితరులున్నారని ఆయన పేర్కొన్నారు.

వర్మకు సీసీఎస్ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : వివాదాలకు కేంద్ర బిందువు, సంచలనాలకు మారుపేరైన దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు షాక్ ఇచ్చారు. 'గాడ్ సెక్స్ అండ్ ట్రుత్' (జీఎస్టీ)పై కేసు విచారణకు హాజరుకావాలని వర్మకు నోటీసులందజేశారు. ఈ కేసులో వర్మ గురువారం సీసీఎస్ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉండగా, వర్మ హాజరుకాలేనంటూ న్యాయవాది ద్వారా పోలీసులకు తెలియజేశారు.

ముంబైలో నాగార్జున సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, వచ్చే వారంలో మళ్లీ నోటీసు ఇస్తే వస్తానని వర్మ తెలిపినట్లు సమాచారం. దీంతో రాంగోపాల్ వర్మకి పోలీసులు మళ్లీ నోటీసు ఇవ్వనున్నారు. వర్మ దర్శకత్వం వహించిన జీఎస్టీ వెబ్‌సిరీస్ విడుదల కాకుండా చూడాలని కోరుతూ సామాజిక కార్యకర్త, మహిళా సంఘం నాయకులు దేవి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు, అశ్లీల సినిమాలు తీస్తానన్నందుకే వర్మకు నోటీసు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం

రైతులకు వరం

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం రైతులకు ఓ వరంగా నిలుస్తోంది. ఘనజీవామృతం, వర్మీకంపోస్ట్ తయారు చేయడానికి సహకరించడంతోపాటు విత్తనాలు పంపిణీ చేస్తోంది.సేంద్రీయ ఎరువులు, పోషక విలువలున్న మొక్కల పెంపకం, కోళ్ల ఫారాలు, రూరల్ రిటైల్ చైన్ మార్ట్స్ వంటి విషయాలలో రైతులకు సహాయపడుతుంది. వివిధ పంటలు పండించే రైతులతోపాటు కూరగాయలు, మామిడితోటలు, జీడిమామిడి తోటలు, చింతపండు, వేరుశనగ, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పెంపకం, డెయిరీ, అన్న సంజీవనీ జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతుంది. ఈ పథకాన్ని సెర్ఫ్ సమర్థమంతంగా అమలు చేస్తోంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 150 మండలాల్లో నిరుపేదలు, షెడ్యూల్ కులాలు, గిరిజన కుటుంబాలు మానవాభివృద్ధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాల్లో వెనుకబడి ఉన్నట్లు తేలింది. దాంతో సెర్ఫ్ ఆ మండలాల్లో గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం అమలుచేస్తోంది. 13 జిల్లాల్లో 664 మండల సమాఖ్యలు, 27,813 గ్రామ సంఘాలు, 6,96,302 స్వయం సహాయక సంఘాల ద్వారా 89 లక్షల మంది నిరుపేద, పేద మహిళల ఆర్థిక, ఆర్థికేతర అవసరాల కోసం వెలుగు ప్రాజెక్ట్ పని చేసింది. వ్యవసాయ రంగంలో చిన్న, సన్నకారు రైతులు అభివృద్ధి అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సెర్ఫ్ ప్రపంచ బ్యాంకు సహాయంతో స్వయం సహాయక సంఘాల ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సంఘాల్లో 90 వరకు పేద కుటుంబాల సభ్యులే ఉంటారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకాన్ని సమర్థమంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం రూ.643.88 కోట్లు కేటాయించింది. విలువల గొలుసు, మానవాభివృద్ధి కార్యక్రమాలకు, సామాజిక రక్షణ, హక్కులు పొందడానికి ఈ నిధులు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్ట్ కాలపరిమితి ఐదేళ్లు. అంటే జూన్ 2019 లోపల [illegible]లి. ఈ నిధులను విలువల గొలుసు కార్యక్రమాలకు రూ.232.4కోట్లు, రిటైల్ చైన్స్‌కు రూ.36.5కోట్లు, మానవాభివృద్ధికి రూ.119.5కోట్లు, ఒన్‌స్టాప్ షాప్ కు రూ.67.39 కోట్లు, ఐసీటీకి రూ.117 కోట్లు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కు రూ. 71.09కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 150 మండలాల్లో నిరుపేదలు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల శారీరక, సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేందుకు, పౌష్టికాహారం అందించడానికి, ఆ కుటుంబాలకు చెందిన స్త్రీల అక్షరాస్యత పెంచడం, మాతా, శిశు మరణాల రేటు తగ్గించడం వంటి మానవాభివృద్ధి కార్యక్రమాలకు, చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాల కోసం వెచ్చిస్తారు. ఆ విధంగా రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎక్కువగా ఉండి, స్త్రీల అక్షరాస్యత తక్కువ, నీటి పారుదలలేని వ్యవసాయ భూములు ఎక్కువగా ఉన్న 150 మండలాలను గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి పథకం కింద ఎంపిక చేశారు. ఈ మండలాల్లోని 2.50 లక్షల పేద కుటుంబాలు వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా 50 శాతం అధికంగా ఆదాయం పొందడం, మానవాభివృద్ధి సేవలు ఎక్కువగా అందుబాటులోకి తేవడంతో పాటు వారు సామాజిక, సాంఘిక హక్కులు పొందడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులే 70శాతం భాగస్వాములుగా ఉంటారు.

Dwaraka



బీజేపీతో పొత్తు మాకొద్దు

మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్ర విభజన హామీలను అమలుచేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష ధోరణి అవలంభిస్తుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు విశాఖలో గురువారం మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తమకు బీజేపీ ముఖ్యం కాదని, రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని, రాష్ట్ర ప్రయెజనాలకు భంగం కలిగించే బీజేపీతో పొత్తు మాకొద్దని తేల్చి చెప్పారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బీజేపీతో కొనసాగడం ఇక కష్టతరమేనన్నారు. ఎన్‌డిఎలో కొనసాగుతున్న రాజకీయ పార్టీలన్నీ బీజేపీ విధానాలను విభేధిస్తున్నాయన్నారు. ఇకనైనా బీజేపీ వైఖరి మార్చుకోవాలని అన్నారు. బంద్‌కు రాష్ట్ర ప్రజలు స్వచ్చంధ్ధంగా మద్ధతిచ్చి పాల్గొన్నారన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేశామన్నారు. ఎక్కడా అరెస్టులు లేకుండా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ విపక్షాలు చేపట్టిన బంద్‌కు పరోక్షంగా ప్రభుత్వమే మద్ధతిచ్చిందన్నారు. జగన్ కేసులకు భయపడి బీజేపీకు సరెండర్ అయ్యారా అని ప్రశ్నించారు. టీడీపీకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తమ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళనలకు మద్ధతుగా రాష్ట్రంలో కూడా టీడీపీ ఆందోళనలు చేస్తుందన్నారు.

విభజన హామీలు అమలు చేయండి

- పార్లమెంటు ఉభయ సభల్లో ఏపీ ఎంపీల నిరసన
- ఏపీ పునర్విభజన చట్టం హడావుడి ఆమోదమే
- ఆ రెండు జాతీయ పార్టీలదే బాధ్యత : కేంద్ర మంత్రి సుజనాచౌదరి
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి సమాధానం ఇస్తారు : గోయెల్



విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా మంజూరు అంశంపై గురువారం మూడు రోజు కూడా పార్లమెంటు ఉభయసభలూ ఏపీ సభ్యుల ఆందోళనతో దద్దరిల్లాయి. రాజ్యసభలో ప్రత్యేక హోదా అంశంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన నిర్వహించారు. దీంతో ఛైర్మన్ ఎం.వెంకయ్యానాయుడు సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం నిబంధనలు అమలు చేయాలంటూ కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి వై.ఎస్.చౌదరి ఈ అంశాన్ని లేవనెత్తారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని హడావుడిగా ఆమోదించేశాయని చౌదరి ఆరోపించారు. ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో విభజన హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏపీ పునర్విభజన చట్టాన్ని అశాస్త్రీయంగా, అన్యాయంగా ఏవిధంగా ఆమోదించబడిందో సభకు పూర్తిగా తెలుసని, ఇందుకు రెండు జాతీయ పార్టీలు బాధ్యత వహించాలన్నారు. గత మూడున్నరేళ్లుగా తమ ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపరిచిన కొన్ని హామీలను పరిపూర్తి చేయలేదన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ వంటి కొన్ని అంశాలను నెరవేర్చాలన్నారు. ప్రస్తుత అనిశ్చితి పరిస్థితిలో పాక్షిక సహకారం గురించి కాకుండా సహకార సమాఖ్య గురించి మాట్లాడాలని ఆయన పేర్కొన్నారు. 'ప్రభుత్వం తరఫున, నా అభ్యర్థన, నా సలహా ఏమిటంటే, ఈ సమస్యలపై 15 రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయెల్ సమాధానమిస్తూ, 'బడ్జెట్ ప్రసంగ సమయంలో దీనిపై సమాధానమిస్తారని నేను హామీ ఇస్తున్నా. ఆర్థిక మంత్రి ఈ సమస్యను పరిష్కరిస్తారు' అని తెలిపారు. అయితే సభ్యులు మంత్రి వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపారు. ఈ సమయంలో రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సమస్యపై ప్రతిష్టంభన కాకుండా మంత్రి ఒక పరిష్కారాన్ని సూచించాలన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతూ రాజ్యాంగ నిబంధనల ప్రకారం, కేంద్ర మంత్రులకు సమష్టి బాధ్యత వహించాలన్నారు. కేబినెట్ నిర్ణయం మంత్రి సుజనాచౌదరికి ఆమోదం కానపుడు ఆయన రాజీనామా చేయాలని డిమాండు చేశారు. దీనిపై సభలో పరస్పరం ఆరోపణలు చోటు చేసుకున్నాయి. దీంతో విజయసాయి రెడ్డిని కూర్చోవాల్సిందిగా ఛైర్మన్ కోరారు. అయితే

కాంగ్రెస్ సభ్యుడు కె.వి.పి.రామచంద్రరావు మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయటం లేదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవాలని కోరారు. హామీలు అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత సభకు ఉందన్నారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తొలుత ఛైర్మన్ వెంకయ్య నాయుడు ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టడానికి అనుమతి ఇచ్చారు. బడ్జెట్‌పై చర్చ చేపట్టాలని సభ్యులందరినీ కోరారు. ఇదిలాఉండగా అంతకుముందు జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరిపై ప్రధాన మంత్రి చేసిన వ్యాఖ్యలతో సభ వాయిదా పడింది.

లోక్‌సభలో టీడీపీ, వైసీపీ ఎంపీల నిరసన

ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై లోక్‌సభలో గురువారం మూడో రోజు కూడా నిరసనలు చోటుచేసుకున్నాయి. ఏపీ సభ్యుల ఆందోళనల మధ్య స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ సంస్మరణ సూచనలు చేసిన వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులతోపాటు ఎన్‌డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ సభ్యులు ఏపీకి ఆర్థిక, ఇతర సహాయాల డిమాండ్లతో కూడిన నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. సెక్రటరీ జనరల్ ముందున్న టేబుల్ ముందుకు టీడీపీ సభ్యులు చేరుకుని నినాదాలు చేశారు. విభిన్నరీతులలో నిరసనలు తెలిపే టీడీపీ సభ్యుడు ఎన్.శివప్రసాద్ అక్కడి టేబుల్‌పై పుస్తకాల సెట్‌ను తీసుకుని ముందుకు వెళ్లడం ప్రారంభించారు. వెంటనే స్పీకర్ మహాజన్ సభను ఉదయం 11.45 నిమిషాల వరకు 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. వైసీపీ, టీడీపీలకు చెందిన దాదాపు 15 మంది ఎంపీలు సభలోని వెల్‌లోకి దూసుకెళ్లారు. అయితే టీడీపీ నాయకుడు, పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు కూర్చోనే ఉన్నారు. సభ వాయిదాకు కొన్ని నిమిషాల ముందు, నిరసన తెలుపుతున్న సభ్యులు టేబుల్ వద్ద నుంచి దూరంగా ఉండాలని, వారు లోక్‌సభ సిబ్బంది అని గుర్తుంచుకోవాలని కోరారు. 'వారు(సిబ్బంది) మీకోసం పని చేస్తున్నారు' అని సభ్యులతో అన్నారు. కొంతసేపటికి టీడీపీ సభ్యుడు శివప్రసాద్ కంజరతో సభలోకి ప్రవేశించి దానిని వాయించేందుకు ప్రయత్నించాడు. అయితే సిబ్బంది ఆయనను నిలువరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతర సదుపాయాల విషయమై టీడీపీ, వైసీపీ సభ్యులు డిమాండు చేశారు.

నిరసనలు విరమించుకోండి : కేంద్రం

లోక్‌సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ ఎంపీలు తమ నిరసనలను కొనసాగిస్తుండటంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ మాట్లాడుతూ మరుసటి రోజు ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో ఈ అంశాలను ప్రస్తావిస్తారని, సభ్యులు తమతమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. అయినప్పటికీ ఏపీ సభ్యులు వెల్‌లోనే నినాదాలు చేస్తూ తమ ఆందోళనను కొనసాగించారు.

మార్చి 5వ తేదీ నుంచి

ఏపీ అసెంబ్లీ సమావేశాలు, 8న బడ్జెట్

విశాలాంధ్ర-అమరావతి : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 5 నుంచి 28 వరకు జరపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లో 8న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఉగాది పండుగ రెండో శనివారం వచ్చినందున ఆరోజు సెలవు. ఆదివారాలు పోను మిగిలన 16 రోజులు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. 28న ద్రవ్య వినిమయ బిల్లుతో అసెంబ్లీ సమావేశాలు ముగుస్తాయి. అయితే ఈసారి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు హాజరవుతారో లేదో అన్నదానిపై స్పష్టత లేదు. ఆ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పేరుతో రాష్ట్రంలో పాదయాత్ర చేస్తున్నారు. గడిచిన శీతాకాల అసెంబ్లీ సమావేశాలను వైసీపీ సభ్యులు బహిష్కరించారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు లేకుండా అసెంబ్లీ చరిత్రలో శీతాకాల సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం మిత్రపక్షాలుగా ఉన్న తెలుగుదేశం, బీజేపీల మధ్య కేంద్ర బడ్జెట్ చిచ్చు రగిలి పార్లమెంట్‌లో టీడీపీ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత ఐదురోజులుగా పోరాటం చేస్తున్నారు. అయితే కేంద్రం ఇప్పటివరకు దిగిరాలేదు. కేంద్రం ఏపీకి న్యాయం చేయకపోతే మిత్రపక్షంగా కొనసాగేందుకు టీడీపీ అధినాయకత్వం సుముఖంగా లేనట్టు ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెలాఖరుకు ముగుస్తాయి. కేంద్రం ఏపీ విషయంలో చేసే మేలును గురించి స్పష్టమైన వివరణతో పాటు కాలపరిమితిని నిర్ణయించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. పోరాటంలో వెనక్కు తగ్గవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన పార్టీ ఎంపీలకు చెప్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే బీజేపీతో టీడీపీ కటీఫ్ అవుతుంది. అదే జరిగితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీజేపీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుంది. ఏమి జరుగుతుందో అసెంబ్లీ సమావేశాల నాటికి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

జూడా సమ్మె నోటీసుపై

ప్రభుత్వంలో కదలిక

- స్టైఫండ్ పెంపునకు కమిటీ
- ఐదుగురు సభ్యుల నియామకం
- నాలుగు డిమాండ్లలో ఒక్కదానిపైనే ప్రభుత్వం సుముఖత
- అన్ని పరిష్కరించకుంటే సమ్మె యథాతథం: జూడా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జూనియర్ డాక్టర్ల(జూడా) సమ్మె నోటీసుపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. జూడాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీ నుంచి సమ్మె చేపట్టాలని కోరుతూ డీఎంఈ, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఏపీ జూడా అసోసియేషన్ రాష్ట్ర నేతలు నోటీసు ఇచ్చారు.ఇందులో 2016-17లో 50శాతం మిగిలిన స్టైఫండ్ బకాయి చెల్లించాలని, 2018 ధరలకు అనుగుణంగా స్టైయిఫండ్‌ను పెంపుదల చేయాలని, ఎంబీబీఎస్ డిగ్రీ పూర్తిచేసిన వారికి సత్వరమే డిగ్రీలు ఇవ్వాలని, పీజీ పూర్తయిన అభ్యర్థులకు ముందస్తుగా రిజిస్ట్రేషన్లు చేయాలని సమ్మె నోటీసులో నాలుగు డిమాండ్లను ప్రస్తావించారు.ఇందులో రెండో డిమాండుపై సమీక్షించేందుకుగాను వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించారు.2018 నుంచి హౌస్‌సర్జన్లు, పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమో, సూపర్ స్పెషాల్టీ అభ్యర్థుల స్టైఫండు పెంపుదలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. దీంతో ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తూ వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.మాలకొండయ్య గురువారం జీవో జారీ చేశారు.దీనికి ఛైర్మన్‌గా వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కన్వీనర్‌గా డీఎండీ డైరెక్టర్, మెంబర్లుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్, ఏపీవీవీపీ కమిషనర్, ఏపీ జూడా ప్రెసిడెంట్/సెక్రటరీలు వుంటారు.స్టైఫండ్ పెంపుదలపై కమిటీ అధ్యయనం చేసి మూడు నెలల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని జీవోలో సూచించారు.జూడాలు నాలుగు డిమాండ్లపై ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వగా, ఒకదానిపైనే ప్రభుత్వం చర్చకు ముందుకొచ్చింది.దీనిపై ఏపీ జూడా అసోసియేషన్ నేతలు అసంతృప్తిగా వున్నారు. మొదటి డిమాండు బిల్లు చీఫ్ సెక్రటరీ దగ్గర వుంది.మిగిలిన 3, 4 డిమాండ్లను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడతామని అధికారులు జూడాలకు సూచించినట్లు తెలిసింది. ప్రభుత్వ వైఖరిపై జూడాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

14లోగా అన్ని డిమాండ్లు పరిష్కరించాలి..లేకుంటే సమ్మె యథాతథం: జూడా

ఈ నెల 14లోగా జూడాలు సూచించిన అన్ని సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను యథాతథంగా కొనసాగిస్తామని ఏపీ జూడా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకట రమణ తెలిపారు.తాము సూచించిన డిమాండ్లన్నీ న్యాయబద్ధమైనవేనని వివరించారు. నాలుగు డిమాండ్లను పరిష్కరించి జూడాలకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

జనన,మరణాల రిజిస్టర్లను

సక్రమంగా నిర్వహించాలి



విశాలాంధ్ర- అమరావతి : రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో జనన, మరణ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో మెటర్నిటీ బెనిఫిట్ స్కీం, జనన, మరణ సర్టిఫికెట్లు జారీ, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

మాతా,శిశు మరణాలకు సంబంధిం చిన సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అథారిటీకి ఆ వివరాలను తెలియజేయాలని వాటిపై సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో జనన, మరణ సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేయడంతో పాటు అందుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. మెటర్నిటీ స్కీంను ఆయా మహిళలకు పూర్తిగా వర్తింపచేసేందుకు వీలుగా 2016లో రాష్ట్రంలో జరిగిన ఆసుపత్రి ప్రసవాలకు సంబంధించిన వివరాలన్నిటినీ ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్య దర్శి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ, గత ఏడాది రాష్ట్రంలో 4లక్షల 25వేల ప్రసవాలు జరిగాయని ఆ డేటా అంతటినీ ఈనెల 15లోగా సిద్ధం చేస్తామని చెప్పారు. స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, స్వధార్ కింద డెస్టిట్యూట్ మహిళలకు ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో స్త్రీ,శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, మున్సిపల్ శాఖ సంచాలకులు కె.కన్నబాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు ప్రత్యేక విభాగం

- రాష్ట్ర, జిల్లాస్థాయిలో లీడ్ ఏజెన్సీలు
- స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన ప్రభుత్వం
- ఇతర బాధ్యతలు అప్పగించకూడదని నిర్ణయం
- పోలీసు, రవాణా, ఆర్ అండ్ బీ నుంచి సిబ్బంది
- సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టటంతోపాటు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు కొత్తగా రోడ్డు భద్రత లీడ్ ఏజెన్సీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర, జిల్లాస్థాయిలోనూ ఈ విభాగాలను ఏర్పాటు చేయాలంటూ రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు గతేడాది నవంబర్ 30న ఇచ్చిన తీర్పు మేరకు రోడ్డు భద్రత కోసమే ఈ ప్రత్యేక విభాగాలు పని చేసేలా చర్యలు చేపడుతున్నారు. రవాణాశాఖలో ప్రత్యేకంగా హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేయను న్నారు. రవాణా, అర్ అండ్ బీ, పోలీసుశాఖల నుంచి అధికారులు, సిబ్బందిని ఈ కొత్త విభాగానికి బదిలీ చేసి పకడ్బందీగా రోడ్డు భద్రతను అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ విభాగానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించటమే కాకుండా ప్రభుత్వం చేపట్టే ఇతర కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితిలోనూ అధికారుల, సిబ్బంది సేవలను వినియోగించు కోకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ ఎస్ రాజశేఖరన్ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 2012 సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్‌ను దాఖలు చేశారు. అఖిల భారత ఆర్థోపెడిక్ వైద్యుల సంఘం అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఆయన రోడ్డు ప్రమాదాలలో ఏటా లక్ష మంది మృత్యువాత పడుతున్నారని, దేశంలో రోడ్డు భద్రతకు అంతగా ప్రాధాన్యం ఇవ్వటంలేదని తన పిటీషన్‌లో పేర్కొన్నారు. అప్పటి నుంచి కొనసాగిన ఈ కేసుపై గత ఏడాది నవంబర్ 30న మదన్ బీ లోకూర్, దీపక్ గుప్తాతో కూడిన బెంచి రాష్ట్రాల్లో విధిగా రోడ్డు భద్రతా లీడ్ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని, వాటికి అనుబంధంగా జిల్లాల్లోనూ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలంటూ తీర్పునిచ్చింది. అంతేగాకుండా రోడ్డు భద్రత లీడ్ ఏజెన్సీల ఏర్పాటుపై సుప్రీంకోర్టుకు నివేదికను అందజేయాలని కూడా సూచించింది. రాష్ట్రంలోనూ ఏటా వేలాది మంది రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి మృతి చెందుతున్నారు. దీంతో రవాణాశాఖలోనే ప్రత్యేక హెడ్‌గా రోడ్డు భద్రత లీడ్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే 13 జిల్లాల్లోనూ లీడ్ ఏజెన్సీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

రోడ్డు భద్రతకు ప్రత్యేక అధికారి

ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల మేరకు రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులు రానున్నారు. ఇప్పటి వరకు రవాణాశాఖలో జిల్లా ఉప రవాణాశాఖ అధికారులే (డీటీసీ) రోడ్డు భద్రత అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు పోలీసు, ఆర్ అండ్ బీ, రవాణాశాఖ నుంచి కొంతమంది అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా రోడ్డు భద్రతా లీడ్ ఏజెన్సీలను ఏర్పాటు చేయనున్నారు. ఇక నుంచి రాష్ట్ర, జిల్లాస్థాయిలో రోడ్డు భద్రతపై ఈ విభాగాలు పూర్తిస్థాయిలో పని చేసే అవకాశం ఉంటుందని విజయవాడ డీటీసీ మీరా ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక విభాగం ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, మరణాల సంఖ్యను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేసే అవకాశం ఉంటుందన్నారు.

రండి బాబూ రండి !

సకల సౌకర్యాలు, సత్వర అనుమతులు

ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి..పెట్టుబడులతో వస్తే అన్ని రకాల అనుమతులు సత్వరమే ఇవ్వడంతోపాటు, సకల సౌకర్యాలు కల్పిస్తామని సీఎం చంద్రబాబు దుబాయ్‌లో పెట్టుబడిదారులను ఆహ్వానించారు. భారత ప్రభుత్వం ఆహార శుద్ధి రంగంలో సరైన విధానం ప్రకటిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధంగా వున్నామని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు చంద్రబాబుకి తెలిపారు.లాజిస్టిక్స్ వ్యవహారాలలో భారత ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం తమకు అంత సానుకూలంగా, తమ అవసరాలకు తగ్గట్టుగా లేదని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, ఈ రంగంలో అత్యుత్తమ విధానం కోసం ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి బదులిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో పాటు ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించిన లాజిస్టిక్స్ పైనా దృష్టి సారించినట్టు షరాఫ్ గ్రూపు ప్రతినిధులు చెప్పారు. ఎలాంటి అనుమతులైనా సత్వరమే ఇవ్వడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు. అనేక అంశాల్లో ఏపీ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని షరాఫ్ గ్రూపు వైస్ ఛైర్మన్ షరాఫుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్ ప్రశంసించారు. త్వరలో తమ సంస్థ అత్యున్నతస్థాయి బృందాన్ని ఏపీకి పంపిస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. దుబాయ్‌లో తమ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాపారవేత్తల సదస్సుకు హాజరుకావాలని హుస్సేన్ షరాఫ్ ఆహ్వానించారు.భారత్‌లో ఇప్పటికే 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిన షరాఫ్ గ్రూపు, పునే, లుధియానాలో వ్యాపారాన్ని కేంద్రీకరించింది.

ఫోనిక్స్ ఆధ్వర్యాన సామర్లకోటలో అతిపెద్ద రైస్‌మిల్

ప్రపంచంలోనే అతిపెద్ద రైస్‌మిల్లును ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పేందుకు దుబాయ్‌కు చెందిన ఫోనిక్స్ సంస్థ సన్నద్ధమైంది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో మెగా ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్ ప్రాజెక్టును ఏర్పాటుచేస్తామని, ఇందుకు సంబంధించి పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెడతామని ఫోనిక్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈవో గౌరవ్ థావన్ సీఎం చంద్రబాబుతో చెప్పారు.సామర్లకోటలో నెలకొల్పే రైస్ మిల్ ప్రాజెక్టు ఏడాదికి 3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే ప్రపంచంలోని అతిపెద్ద రైస్ మిల్ ప్రాజెక్టులో ఒకటిగా నిలుస్తుంది. ఇందులో లక్ష మెట్రిక్ టన్నులను దేశీయ మార్కెట్‌లో, మిగిలిన 2 లక్షల మెట్రిక్ టన్నులను విదేశాలకు ఎగుమతి చేయాలని ఫోనిక్స్ సంస్థ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 200 నుంచి 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ఏపీపీఎస్సీ హిందీ, తమిళ జేఎల్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో హిందీ, తమిళ జూనియర్ లెక్చరర్ల(జేఎల్) పోస్టుల ఎంపిక ఫలితాలను ఏపీపీఎస్సీ వెల్లడించింది.ఈ పోస్టుల కోసం 19/2008లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీపీఎస్సీ ఆధ్వర్యాన హిందీ, తమిళ్ పోస్టులకు 3 డిసెంబరు 2011న రాత పరీక్షలను నిర్వహించారు.హిందీ, తమిల్‌కు ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలున్నాయి. పూర్తి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపర్చారు.

దశ తిరగనున్న ఏపీ విమానరంగం

ఏపీకి దుబాయ్ ఎమిరేట్స్, ఎయిరో స్పేస్ గ్రూపులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీ విమానయాన రంగం దశ తిరగనుంది. దుబాయ్‌కు చెందిన ఎమిరేట్స్, ఎయిరోస్పేస్ సంస్థలు రాష్ట్రంలో అడుగుపెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఎయిర్ క్రాఫ్ట్ తయారీ, విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఎమిరేట్స్ గ్రూపు ముందుకొచ్చింది. ఏవియేషన్ శిక్షణ కోసం ఒక అకాడమీని సైతం నెలకొల్పనుంది. దీంతో పాటు మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎమ్ఆర్ఆర్) సదుపాయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో ఏపీఈడీబీతో ఎమిరేట్స్ గ్రూపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం ఎమిరేట్స్ గ్రూపు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి కలిసి వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేస్తాయి. ఏరోస్పేస్ సంబంధిత మౌలిక సదుపాయాలు, తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటిల్లో 'ఎమిరేట్స్' పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ వర్కింగ్ గ్రూపులు పరిశీలిస్తాయి. అలాగే ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఏపీలో నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం పెంపులోనూ 'ఎమిరేట్స్', ఏపీఈడీబీ సంయుక్తంగా కలిసి పనిచేస్తాయి. ఈ ఒప్పందం వాస్తవరూపం దాల్చితే రాష్ట్రానికి కొత్తగా రూ. 30 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం లభిస్తుంది.విమానయాన రంగంలో ఏపీ ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్ ప్రారంభించాలని గురువారం దుబాయ్‌లోని ఎమిరేట్స్ హెడ్‌క్వార్టర్స్‌లో తనతో సమావేశమైన ఎమిరేట్స్, దుబాయ్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌ఛైర్మన్ షేక్ అహ్మద్ బిన్ సయీద్ అల్ మక్తూమ్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు తమ విమాన సర్వీసులను ఆరంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని, కానీ భారత ప్రభుత్వ నియమ నిబంధనలు ఇందుకు అడ్డంకిగా వున్నాయని మక్తూమ్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. భారత ప్రభుత్వం నిబంధనలు సరళీకరిస్తే వెంటనే తమ సర్వీసులు నడిపేందుకు ఎలాంటి ఆలస్యం వుండదని వివరించారు. భారత్ నుంచి దుబాయ్ రావడానికి ఇప్పుడు కేటాయిస్తున్న సీట్ల సంఖ్య పరిమితంగా [illegible]ందని, పాత ఒప్పందాన్ని భారత ప్రభుత్వం సవరించాలని చెప్పారు. [illegible] ఎయిర్‌లైన్స్, ఎమిరేట్స్ సంస్థలు రెండూ దీనిపై చర్చించి ఒక నిర్ణయానికి రావాల్సి వుందన్నారు. విమానరంగం అభివృద్ధి చెందాలంటే వాటిలో ప్రయాణించేవారు సేద తీరేందుకు తగిన వసతి, షాపింగ్ చేసేందుకు మాల్స్, సమావేశాలు జరిపేందుకు వీలుగా విశాలమైన మందిరాలు వుండాలి. పర్యాటకాభివృద్ధి అనేది ఎక్కడైనా కీలకం. అదే ముఖ్యం' అని మక్తూమ్ తన అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి వెల్లడించారు. దుబాయ్‌లోని హోటళ్లలో లక్షకు పైగా గదులు అందుబాటులో వున్నాయని, జోర్డాన్ వంటి దేశంలో 14 వేలకు పైగా హోటల్ గదులు వున్నాయని తెలిపిన మక్తూమ్, 2020 నాటికి లక్షా 50 వేల హోటల్ గదులకు చేరుకోనున్నట్లు చెప్పారు.దుబాయ్ ఎయిర్‌పోర్టు ఫ్రీ జోన్ అథారిటీ డైరెక్టర్ జనరల్, దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ అథారిటీ వైస్ ఛైర్మన్, దుబాయ్ ఎయిరో స్పేస్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అహ్మద్ అల్ ఝురూనీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వైపాక్షికంగా సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి ఎయిరోసిటీ ఏర్పాటు సన్నాహాల్లో వున్నామని, ఇందుకోసం సౌదీ అరేబియా ఫైనాన్షియర్స్‌తో కలిసి పనిచేస్తున్నామని ఝురానీ ముఖ్యమంత్రికి వెల్లడించారు. కేపీఎంజీ సహకారంతో మరో మూడు నెలల్లో దీనిపై సవివర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్, మౌలికవసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ [illegible] సీఈవో జాస్తి కృష్ణ కిషోర్ వున్నారు.



Dwaraka

సంపాదకీయం

బంద్ సక్సెస్ ప్రజాగ్రహానికి దర్పణం

గురువారం జరిగిన రాష్ట్రబంద్‌కు అపూర్వ స్పందన లభించింది. వర్తక, వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ బస్సులు సాయంత్రం నాలుగు గంటల వరకు డిపోలకే పరిమితమయ్యాయి. మోడీ నేతృత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకపోగా, 2018-19 బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేసినందుకు ఆంధ్రా ప్రజల్లో రగులుతున్న అసంతృప్తి, అసమ్మతికి రాష్ట్ర బంద్ సక్సెస్ దర్పణం పట్టింది. వామపక్ష పార్టీలు ఇచ్చిన బంద్ పిలుపునకు కాంగ్రెస్, వైసీపీ, జనసేన, ప్రజా, కార్మిక, పాత్రికేయ సంఘాలు కూడా మద్దతిచ్చాయి. ఉత్తరాంధ్ర చర్చా ఐక్యవేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ, రాయలసీమ ప్రజాసమితి, ముస్లిం ఐక్యవేదిక బంద్‌కు సహక రించాయి. నాలుగేళ్లుగా విభజన హామీలను నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం మాయమాటలతో కాలం వెళ్లబుచ్చింది. బీజేపీ- టీడీపీ కూటమి నయవంచన, నమ్మకద్రోహానికి పాల్పడింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం రూపొందించే సందర్భంలో రాజ్యసభలో నాటి ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ప్రత్యేకహోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఇతర హామీలను ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ సమర్థించింది. ప్రత్యేకహోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు ఉండాలని బీజేపీ అంటే, కాదుకాదు పదిహేనేళ్లు కావాలని టీడీపీ డిమాండ్ చేసింది. తీరా అధికారంలోకి వచ్చాక ప్రత్యేకహోదా ఇచ్చేందుకుకు మోడీ ప్రభుత్వం నిరాకరించి, ఎట్టి విధానాలను నిర్ణయించకుండానే ప్రత్యేక ప్యాకేజీతో సరిపెట్టుకొమ్మని మోడీ చెప్పడం.. అందుకు ఏపీ ముఖ్యమంత్రి తలాడించడం జరిగిపోయింది. ప్రత్యేకహోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీయే మేలని ఏపీ ముఖ్యమంత్రి పల్లవి లంకించుకొన్నారు. ప్రత్యేకహోదా వస్తుంది... పరిశ్రమలు వస్తాయి.. ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయి.. రాష్ట్రం ప్రగతిబాటన పరు గులు తీస్తుందని భావించిన ఆంధ్రా జనం ఆశల్ని అడియాసలు చేసిన మోడీ ప్రభుత్వంపై వారు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

కేంద్రపాలకుల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్న కనీస ఇంగితం కనపడకపోవడం శోచనీయం. న్యాయపరమైన ఇబ్బందులున్నందున ప్రత్యేకహోదా సాధ్యంకాదని, ప్రత్యేక ప్యాకేజీతో సరిపెట్టుకోవాలని 2015, ఆగస్టులో బీజేపీ ఎంపీల బృందానికి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెగేసి చెప్పారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేకహోదాకు ససేమిరా అంటున్నదని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ హోదాను కోరుతున్నాయని, అందుచేత ఆంధ్రాకు ప్రత్యేక హోదా సాధ్యం కాదని కేంద్ర పాలకులు వాదించారు. ఆంధ్రాకు ఐదేళ్లు కాదు, పదేళ్లు కావాలని రాష్ట్ర పునర్విభజన చట్టం రూపకల్పన సమయంలో డిమాండ్ చేసిన సమయంలో న్యాయపరమైన ఇబ్బందుల గురించి తెలియదా? తెలిసే ప్రజలను మభ్యపెట్టి నాడు ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించి లబ్ది పొందేందుకు పన్నాగం పన్నారా? సమాధానం చెప్పవలసిన బాధ్యత కేంద్రపాలకులదే. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రత్యేక హోదా కల్పిస్తామంటూ రాజ్యసభలో పునర్విభజన బిల్లు ఆమోదం సందర్భంలో స్పష్టం చేశారు. అది బిల్లులో లేకపోయినా నాటి ప్రధాని పార్లమెంటుకు ఇచ్చిన హామీకి విలువలేదా? పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలకే విలువ ఇవ్వని, అమలుపరిచేందుకు పూనుకోని మోడీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఎందుకుండాలి? ఇప్పటికే ప్రజా విశ్వాసం కోల్పోయింది కూడా.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం లోక్‌సభలో మోడీ మాట్లాడుతూ ఏపీకి మరోసారి మొండిచెయ్యి చూపించి, నిరాశే మిగిల్చారు. ప్రత్యేక తెలంగాణ ఇవ్వడానికి బీజేపీ మద్దతు పలికిన విషయాన్ని మరిచి, ఏపీ విభజనను తొందరపాటుతో చేసిందని, రాజకీయ స్వార్థంతోనే విభజించిందని కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తిపోశారు. ప్రధాని ప్రసంగంలో ఏమీ పసలేదని, న్యాయం జరిగే వరకు పోరాడాలని, సస్పెండ్ చేసినా వెనక్కి తగ్గొదని టీడీపీ పార్లమెంటు సభ్యులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బుధవారం లోక్‌సభలో టీడీపీఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు. అందరినీ అన్నిసార్లు మోసం చేయలేరని, ఆంధ్రులు ఫూల్స్‌కాదని తెలుసుకోవాలని, బీజేపీతో బంధంపై ఆలోచించక తప్పదని హెచ్చరిక స్వరంతో జయదేవ్ అన్నారు. కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగడంతో కాక తగిలి, పార్టీ అధినేత సూచన మేరకు టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ఆందోళనకు దిగారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టీడీపీ ఎంపీలు ఇప్పటికైనా నిరసన గళం వినిపించడం మంచిదే అయినప్పటికీ ఈ పని రెండేళ్లముందే చేసి ఉన్నట్లయితే మోడీ సర్కారు దారిలోకి వచ్చి ఉండేది. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని ప్రధానమంత్రిని ఒత్తిడి చేసేందుకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని సీపీఐ పదేపదే డిమాండు చేసినప్పటికీ టీడీపీ అధినేత పెడచెవిన పెట్టారు. మోడీ ప్రభుత్వం కేంద్రబడ్జెట్‌లో మొండి చెయ్యి చూపడంతో, రానున్నది ఎన్నికల సంవత్సరం కనుక ఎక్కడ ప్రజాగ్రహానికి గురికావలసి వస్తుందోననే ఉద్దేశంతో పార్లమెంటులో నిరసనగళం వినిపించాలని ఇప్పుడు టీడీపీ ఎంపీలకు సూచించారు. నాలుగు రోజులుగా వారు పార్లమెంటులో నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పష్టమైన ప్రకటన లేదు. ఏపీకి నిధులు ఇచ్చాం... ఇస్తామని గురువారం అరుణ్‌జైట్లీ పాతపాటే పాడారు. కేవలం నిరసనాందోళనతో సరిపెట్టుకోకుండా, టీడీపీ పార్లమెంటు సభ్యులతో రాజీనామా చేయించి, బీజేపీతో బంధాన్ని తెంచుకున్నప్పుడే రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రం దిగొస్తుంది. ఆ దిశగా, ఏపీ సీఎం అడుగు ముందుకు వేసి చర్య తీసుకోవాలి.

చురక

కాంగ్రెసు రద్దు నాటి
గాంధీగారి కోరిక
తీర్చునంట మోడీగారు
తిట్ల కత్తి నూరిక

గాడ్సే వారసత్వంలో
గంతులేసే రామచిలక
వలకబోస్తూ గాంధీ స్మరణ
వాలుతుంది శాంతి చిలుక

- వేల్పుల నారాయణ

సందర్భం

రాజకీయ ప్రయోజనాలతో రాష్ట్రానికి అన్యాయం!

కేంద్రంతో ఒంటరిగా పోరాటం చేయడానికి ఏమైనా సమస్యలు ఉంటే, వామపక్షాలు, ప్రజాసంఘాలను ముందువరుసలో పెట్టి పోరాటానికి మద్దతు ఇవ్వవచ్చు. రాష్ట్రప్రయోజనాల కోసంచేసే పోరాటాలను ప్రోత్సహించినందువల్ల కేంద్రం దిగివచ్చే అవకాశం ఉంటుంది. అఖిలపక్ష సమావేశాన్ని అయిన ఏర్పాటు చేసి రాష్ట్రప్రయోజనాల కోసం కేంద్రంపై వత్తిడితీసుకొచ్చేయత్నాలుకూడా చేయవచ్చు. ఇపుడు వైసీపీ మినహా మిగిలిన అన్నిపార్టీలూ పోరాటానికి సిద్ధం అయ్యాయి. ఈనెల 8వతేదీన వామపక్షాలు, ప్రజాసంఘాలు బంద్ పాటించాయి. కాంగ్రెస్‌కూడా దీనికి మద్దతు తెలిపింది. ఆఖరునిమిషయంలో వైసీపీ కూడా బంద్‌కు మద్దతుప్రకటించింది. ఇపుడు రాజకీయాలు మానేసి, పార్టీ, వ్యక్తిగతమైన అజెండాలను పక్కన పెట్టి రాష్ట్రప్రయోజనమే ఏకైక అజెండాగా తీసుకొని పోరాటం చేస్తే కేంద్రం తప్పకుండా కదలివస్తుంది. దీనికి ముఖ్యమంత్రి చొరవచూపిస్తే సరిపోతుంది.



కంచల జయరాజ్

రాష్ట్రప్రయోజనాల కంటేకూడా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని మన నేతలు తలపోస్తున్నారు. రాష్ట్ర విభజన అంశం దగ్గర నుంచి కూడా ఇదే ధోరణి అవలం భించడం వల్ల ఆంధ్రరాష్ట్రం అంటే ఢిల్లీ నేతలకూ అలుసయి పోయింది. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించే ఎంపీలు,మంత్రులు సైతం రాష్ట్రానికి జరుగుతోన్న అన్యాయాన్ని చూసి కనీసం చలించడం లేదంటే,వారికి రాష్ట్ర ప్రయోజనాలు ఏమాత్రం పట్టడం లేదని అర్థం చేసుకోవాలి. ఒక ఓటు రెండు రాష్ట్రాల అన్న బిజెపి, రాష్ట్ర విభజనకు సిద్ధమే అని లేఖ ఇచ్చిన తెలుగుదేశం పార్టీలు ఇపుడు కాంగ్రెస్‌పై విభజన నెపం అంతానెట్టేస్తున్నాయి. రాష్ట్రవిభజన గతించిన అధ్యాయమే అయినా ఇంకా దాన్నే పుచ్చుకొని వేళ్లాడటం రాజకీయం చేయడానికే. విభజనచట్టంలో పొందుపరచిన అంశాలను సాధించుకునే దిశగా బిజెపితో మిత్రపక్షంగా ఉన్నా తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ అడుగు ముందుకు వేయలేదు. మూడున్నరేళ్ల యినా సరే మౌనంగానే వ్యవహరిస్తోంది.కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఆరంభం నుంచీ కేంద్రంపై వత్తిడి తెచ్చి మరీ విభజన చట్టంలోని అంశాలను సాధించుకోవాల్సిన హక్కుఅధి కారం ఉన్నాయి. కానీ ఆరంభం నుంచీ ఈవిషయంలో తెలుగుదేశం పార్టీ అధినేత,రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అనుకున్నస్థాయిలో సముచిత మైన పాత్ర పోషించలేదు. ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉన్నందువల్ల తమ పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రి పదవులు రావడం మినహా రాష్ట్రానికి ఒనగూరిందిఏమీ లేదు. కొత్త రాష్ట్రం,అనేక సమస్యలు. ముఖ్యంగా ఆర్థికంగా కేంద్రంనుంచి కావాల్సిన సహకారం ఎక్కువ. అందుకే వైరంతో ఇవన్నీ సాధించుకోలేము. సావధానంగా ఉండే సాధించుకుందాం..అని ముఖ్యమంత్రిపలు సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ కేంద్రంఇప్పటికి నాలుగు బడ్జెట్లను ప్రవేశపెట్టింది. దేనిలోనూ సముచితమైన ప్రాముఖ్యత ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వలేదు. 24లక్షల కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన కూడా లేకపోవడం ఐదున్నరకోట్ల మంది ఆంధ్రుల ఆత్మాభిమానంపై దెబ్బతీయడమే. 28సార్లు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లారు. బడ్జెట్ తయారుచేసే ముందుకూడా ప్రధానిని కలిసి వచ్చారు. రాష్ట్ర సమస్యలు విన్నవించారు. అయినా సరే అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు,విశాఖరైల్వే జోన్ వంటి ప్రధానమైన అంశాలను ఎక్కడా ప్రస్తావించనుకూడా లేదు.విభజన హామీలు, పెండింగ్ ప్రాజెక్టుల గురించి కనీస ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదు. మెట్రో రైలు,రైల్వే జోన్,పెట్రోకారిడార్, అమరావతి-అనంతపురం హైవే వంటిప్రాజెక్టులకు కేంద్రబడ్జెట్‌లో స్థానం లభిస్తుందని అందరూ ఆశించారు. కానీ వీటి గురించి ఎక్కడా ప్రస్తావించిన దాఖలాలు లేవు. అభివ ృద్ధి చెందిన రాష్ట్రాలకు చేసిన కేటాయింపులు ఆశాజనకంగా ఉంటే, కొత్త రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం మొండి చేయిచూపించారు. అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది. రాష్ట్రం అనేక అంశాలపై కేంద్రంతో సంప్రదింపులు చేసింది. ప్రతిపాదనలుపంపింది.రాష్ట్రం అడిగిన సహాయానికి,కేంద్రం ఇచ్చిన దానికి ఎక్కడా పొంతన లేకుండా పోయింది. దీనితో రాష్ట్రప్రజలు ఆగ్రహావేశాలతో ఉన్నారు.దీనిపై వామపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అధికార పక్షం కూడా అసహనం వ్యక్తం చేసింది. ప్రతిపక్షంగా ఉన్న వైసిపి మాత్రం ఇంకా ఆచితూచి వ్యవహరిస్తోంది. మరో వైపు బిజెపి మాత్రం బడ్జెట్ బాగుంది అని పేర్కొంటోంది. తెలుగుదేశం, బిజెపి, వైసిపినేతలు కూడికలు,తీసివేతలతో కాలం గడుపుతు న్నారు. ఎవరి వ్యూహాలు వారికి ఉన్నాయి. జెండాల్లాగే అజెండాలూ భిన్నంగా ఉన్నాయి.దీంతో రాష్ట్ర అవకాశవాద రాజకీయం!

ఇపుడు అధికార, ప్రతిపక్ష పార్టీలు అవకాశవాద రాజకీయం నెరపుతున్నాయి. ఆరంభం నుంచీ కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై సవతితల్లి ప్రేమే చూపుతోంది. విభజన సమయంలో బిజెపి,టీడీపీలు ప్రత్యేక హెూదాను ప్రజల ముందుకు తీసుకొచ్చి ఐదు,పది,పదిహేనుఏళ్లు ఇస్తామని ప్రకటించారు. నరేంద్రమోడీ, వెంకయ్య నాయుడు, చంద్రబాబునాయుడులు పోటీ పడి మరీ ప్రత్యేక హెూదాపై ప్రచారం చేశారు. ఎన్నికలు ముగిసి, అధికారంచేపట్టిన తర్వాత ప్రత్యేకహెూదా ముగిన అధ్యాయం అన్నారు.రాష్ట్రవిభజన సమయంలో సమైక్య గళం వినిపించిన ప్రజలు,పార్టీలు,ఉద్యోగ సంఘాలు తర్వాతి కాలంలో ఎక్కడా నోరుమెదపలేదు. ఎవరూ ముందుకొచ్చిప్రశ్నించలేదు. రాష్ట్రానికి జరిగే అన్యాయంపై ఎవరు మాట్లాడినా తప్పే అన్నట్లుగా పరిస్థితుల్ని స ృష్టించారు. అన్నీతానై అధికారపక్షమే వ్యవహరించింది. కేంద్రం కఠినంగా వ్యవహరిస్తున్నాపన్నెత్తి మాట అనే సాహసం తెలుగుదేశం ప్రభుత్వంచేయలేదు. ప్రత్యేక హెూదా గతించిన అధ్యాయం అన్నపుడు రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తే దాన్ని పోలీసులతో అణచివేశారు. రైల్వేజోన్ విషయంలో మాట తప్పుతుంటే కదిలిని ప్రజలు, వామ పక్షాలు, ప్రజాసంఘాల కార్యకర్తలను అరెస్టులు చేశారు. రాజధాని శంకుస్థాపనకు వచ్చినమోడీ వరాల జల్లు కురిపిస్తారని ఎదురు చూసిన చంద్రబాబుకు గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లే దక్కాయి. అపుడే ప్రశ్నించి ఉంటే విభజనచట్టంలోని అన్నిఅంశాలు ఇప్పటికే అమలుకు నోచుకునేవి. కానీ ఆరంభం నుంచీ తెలుగుదేశం పార్టీ అధినేత,ముఖ్యమంత్రి మాట్లాడలేదు. ఎవరినీ మాట్లాడనీయలేదు. పోనీ అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రంపై వత్తిడి తెచ్చేయత్నం కూడా ఏమీ చేయలేదు.దీన్ని కేంద్రం సాకుగాతీసుకుంది. తెలుగుదేశం పార్టీ తమపై వత్తిడి తేలేదనేనిర్ణ యానికి వచ్చింది. విభజించూ,పాలించు విధానాన్ని అమలు చేసే బిజెపి ప్రభుత్వం తెలుగుదేశం విషయంలోనూ అదే సూత్రాన్ని అమలు చేసింది. అందుకే పుణ్యకాలం కాస్తపూర్తయింది. ఇపుడు కూడా ఉన్నవకాశాన్ని విడుచుకునే పనిలోనే చంద్రబాబు ఉన్నారు.ఇప్పటికే ఎన్డీయే నుంచి బయటకు వచ్చే ఆలోచన చేయడం లేదు. కేంద్రంపై వత్తిడితెద్దాం,పార్లమెంటులో నిరసన తెలుపుదాం అనే అంటున్నారు. ఇవన్నీనరేంద్రమోడీ ముందు పనికిరావు. మిత్రపక్షం నుంచి బయటకు వెళతానన్నా ప్రధానిమోడీ మారుమాట్లాడకుండా అంగీకరించే పరిస్థితిలోనే ఉన్నారు. ఆ భయంతోనే తెలుగుదేశం వెనకాడుతోంది.ఈవిషయం తెలిసే చంద్రబాబు ఎన్డీయే నుంచి బయటకు వచ్చే విషయంలో వెనకాడుతున్నారు.

మరో వైపు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇంతవరకూ బడ్జెట్‌పై మాట్లాడలేదు.ఆపార్టీ ఎంపీ మాత్రం బడ్జెట్ బాగుందని కితాబిచ్చారు. బిజెపి నుంచి తెలుగుదేశం పార్టీ తెగదెంపులు చేసుకుంటే, ఆస్థానాన్ని తాము భర్తీ చేసుకోవచ్చనే ఆశతో వైసిపి ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు బిజెపితో వైసిపికి తెరవెనుక సన్నిహిత సంబంధాలే కొనసాగుతున్నాయి.రాష్ట్రపతి ఎన్నికల్లో అడగకుండానే మద్దతు ఇచ్చినపుడే అందరికీ ఈవిషయం అర్థం అయింది. రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రధాని అప్పాయింట్ మెంటుకు 16నెలల సమయం పడితే వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి ఎపుడంటే అపుడు ప్రధానిని కలిసే వెసులుబాటు ఉందంటే బిజెపితో వైసిపికి ఎంత సాన్నిహిత్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేక హెూదా కోసం రాష్ట్రబంద్‌కుపిలుపునిచ్చని వైసిపి అనంతరం అనేక కార్యక్రమాలు చేసింది. ప్రత్యేకహెూదా ఇవ్వకపోతే తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని ప్రకటించి కూడా ఇప్పటికీ మౌనంగానే ఉన్నారు. బిజెపితో సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత పన్నెత్తు మాట బిజెపినీ,ప్రధానినరేంద్రమోడీని అనే సాహసం జగన్ చేయడం లేదు. ఇపుడు బడ్జెట్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. బడ్జెట్‌పై ముఖ్యమంత్రిని తెగనాడటం మినహా కేటాయింపులు చేయని కేంద్రాన్ని ఏమీ అనలేకపోతున్నారు. ఇవన్నీ సొంత అజెండాగానే పరిగణించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలు కంటే కూడా స్వప్రయోజనాలు ముందువరుసలో ఉకేంద్రం వదిలేసిన హామీలివీ..! విభజనచట్టంలోని స్పష్టంగా పొందుపరచిన హామీలపై కేంద్రం ఇప్పటివరకూ పట్టించుకోలేదు. పలుసార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాననికలిసి చేసని విజ్ఞాపనలకుకూడా ప్రధాని స్పందించలేదు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు చేసిన విన్నపాల్నికూడా కేంద్రం పట్టించుకోలేదు.విభజనచట్టంలో పేర్కొన్న హామీలను కేంద్రబడ్జెట్‌లో పొందుపరిచాలన్న అభ్యర్థనసుకూడా కేంద్రం తీసిపారేసింది. రాజధాని నిర్మాణానికి 2018-19 బడ్జెట్‌లో తగినన్నినిధులు కేటాయించాలని కోరినా స్పందించలేదు. విభజనచట్టంలోని సెక్షన్ 50,51 లో వాణిజ్య పన్నుల బకాయిలు, రీఫండ్స్ కు సంబంధించిన అంశాలున్నాయి. రాష్ట్రవిభజన తర్వాత ఆయా కంపెనీలు తమ తమ పన్ను బకాయిలు ఎవరికిచెల్లించాలనే విషయంలో సందిగ్ధత నెలకొంది. కొన్ని కంపెనీలు ఏపీలో ఉండగా,వాటి ప్రధానకార్యాలయాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. పన్ను బకాలు తమకే చెల్లించాలని తెలంగాణా ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోంది. పలు కంపెనీలు ఇప్పటికే కోర్టును ఆశ్రయిం చాయి. విభజనచట్టాన్ని సవరించాలని టీడీపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఇలా చేయకపోతే రూ.3000 కోట్ల నష్టం వస్తుందని కూడా పేర్కొంది. ఈవిషయంలో కూడా కేంద్రంస్పందంచలేదు. కేంద్రంనుంచి ప్రత్యేక హోయం కింద రాష్ట్రానికి రూ.16,447 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది. దీనిగురించికూడా బడ్జెట్‌లో ఎక్కడా పేర్కొనలేదు. నవ్యాంధ్రలోటు రూ.16,079.76 కోట్లు. అయితే దీన్ని రూ.7,500 కోట్లకు కేంద్రం తగ్గించింది. అందులోనూరూ.3,979 కోట్లు మాత్రమే ఇప్పటి వరకూ చెల్లించారు. ఇంకా రూ.3,500 కోట్లు రావాల్సి ఉంది. కేంద్రం మాత్రం రూ.138.39 కోట్లు మాత్రం చెల్లించాల్సి ఉంటుందని చెపుతోంది. దీని గురించికూడా బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. గడవులోగా పోలవరం పూర్తయ్యేలా నిధులు విడుదల చేయాలి. సవరించిన అంచనాల ప్రకారం 58,319.60 కోట్లు ఖర్చవుతుంది. ఈమేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. పునరావాసమే రూ.33,858కోట్లు అవుతుంది. దీన్ని 100శాతం కేంద్రమే ఇవ్వాలి. కానీ నిధుల విషయంలో కేంద్రం నామమాత్రంగానేస్పందిస్తోంది. పోలవరం ఇప్పటికే 53శాతం పూర్తయిందని, రాష్ట్రప్రభుత్వం చేసిన ఖర్చులో ఇంకా కేంద్రం 3,451 కోట్లరూపాయలు చెల్లించాల్సి ఉందని పేర్కొంటోంది. ఇలాంటివే అనేక అంశాలకు కేంద్రం నుంచి నిధులు వస్తాయని, కొత్త బడ్జెట్ లో కేటాయిస్తారని ఆశించారు. కానీ నిరాశేమిగిలింది.

పోరాటమే శరణ్యం!

కేంద్రంతో వైరం ఎందుకని ఇప్పటివకూ సానుకూల ధోరణితో వ్యవహరించారు. అయినా కేంద్రంకరుణించడం లేదు. ఇపుడు పోరాటమేఏకైక మార్గంగా తీసుకోవాల్సి ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇపుడు అందరూ కలసి రావడానికి సిద్ధంగా ఉన్నారు. కేంద్రంతో ఒంటరిగా పోరాటం చేయడానికి ఏమైనా సమస్యలు ఉంటే, వామపక్షాలు, ప్రజాసంఘాలను ముందువరుసలో పెట్టి పోరాటానికి మద్దతు ఇవ్వవచ్చు. రాష్ట్రప్రయోజనాల కోసంచేసే పోరాటాలనుప్రోత్సహించినందువల్ల కేంద్రం దిగివచ్చే అవకాశం ఉంటుంది. అఖిలపక్ష సమావేశాన్ని అయిన ఏర్పాటు చేసి రాష్ట్రప్రయోజనాల కోసం కేంద్రంపై వత్తిడితీసుకొచ్చేయత్నాలుకూడా చేయవచ్చు. ఇపుడు వైసీపీ మినహా మిగిలిన అన్నిపార్టీలూ పోరాటానికి సిద్ధం అయ్యాయి. ఈనెల 8వతేదీన వామపక్షాలు, ప్రజాసంఘాలు బంద్ పాటించాయి. కాంగ్రెస్‌కూడా దీనికి మద్దతు తెలిపింది. ఆఖరునిమిషయంలో వైసీపీ కూడా బంద్‌కు మద్దతుప్రకటించింది. ఇపుడు రాజకీయాలు మానేసి, పార్టీ, వ్యక్తిగతమైన అజెండాలను పక్కన పెట్టి రాష్ట్రప్రయోజనమే ఏకైక అజెండాగా తీసుకొని పోరాటం చేస్తే కేంద్రం తప్పకుండా కదలివస్తుంది. దీనికి ముఖ్యమంత్రి చొరవచూపిస్తే సరిపోతుంది. లేదంటే మరో ఏడాది కూడా గడిచి పోయి,రాష్ట్రానికి ఏమీ చేయకుండానే పాలన ముగించాల్సివస్తుంది.

వ్యాసరచయిత : అధ్యక్షులు, విజయవాడ ప్రెస్‌క్లబ్
సెల్ : 9848992299

దేశవ్యాప్తంగా సుమారు ఆరున్నర లక్షలమంది ఉపాధ్యాయులకు సరైన బోధన శిక్షణ లేదు. అయిదు లక్షల బోధన సిబ్బంది ఖాళీల్ని భర్తీ చేయాల్సి ఉంది. పాఠ్యాంశాల్లో సహేతుక మార్పులు, ఖాళీల భర్తీ, ప్రమాణాల ఉన్నతి, విస్తృతావసరాలకు అనుగుణ మైన బడ్జెట్ కేటాయింపులు, సకల విధాల పాఠశా లల పటిష్ఠీకరణ... ఇదీ, సమగ్ర అజెండా కావాలి. పకడ్బందీ కార్యాచరణకు పూనుకొంటే- తరగతిలో ప్రతి విద్యార్థీ ఆణిముత్యమే. బడికి దిద్దవల్సిన ఒరవడి అదీ!

బడికి ఒరవడి ఏదీ!

బడి, గుడి లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి లేదు. గుడి కన్నా బడికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. జాతిని తీర్చిదిద్దే నిజమైన ఆలయం బడి. కానీ నేడు బడికి మన పాలకుల పుణ్యమా అంటూ ఓ ఒరవడి లేకుండా పోయింది. పిల్లల్లో బుద్ధిని వికసింపచేయడంలో, వారి సృజనాత్మక ఊహలకు రెక్కలు తొడగడంలో కీలకపాత్ర పోషించేది బడి. మన విద్యావ్యవస్థ కేవలం పరీక్షలు, మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరుగుతున్నదే తప్ప పిల్లల్లో ఆలోచన, అవగాహన, పరిశీలన, పరిశోధన నైపుణ్యాలను పెంపొందించే దిశగా సాగడకపోవడం వల్ల ఖట్టీయం చదువులు పెద్దపీట వేసుకున్నాయి. అంతేకాదు, పరీక్షలు గట్టెక్కినా లేకున్నా, పాఠాలు ఒంటపట్టినా రాకున్నా పైతరగతికి పంపించే (నో డిటెన్షన్) విధానం కొనసాగుతోంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర మంత్రిమండలి నిరుడు నిర్ణయించింది. దేశంలో 2010 ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన విద్యాహక్కు చట్టంలోని ముఖ్యాంశాల్లో- ఎనిమిదో తరగతి వరకు కల్పించిన వెసులుబాటు అది. ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా పైతరగతికి వెళ్లే సౌలభ్యం క్షీణ ప్రమాణాలకు ప్రబల హేతువవుతున్నదంటూ కొందరు ఆరోపిస్తున్నారు. నో డిటెన్షన్ విధానం రద్దుకు కేంద్ర విద్యా సలహా మండలి (సీఏబీఈ) కూడా రెండేళ్ల కిందటే ఓటేసింది. అయితే నో డిటెన్షన్ విధానం రద్దుతో చదువులో నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని గ్యారంటీ ఉందా? 35మార్కులు సాధించిన విద్యార్థిని ప్రతిభావంతుడిగా పరిగణించడం సాధ్యమేనా? అసలే అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న దేశంలో, పైగా పేదరికం తాండవించే జాతికి ఈ మార్పు వల్ల ఒనగూరే ప్రయోజనం ఏముంటుంది? ఇప్పటికే సగంమంది విద్యార్థులు మధ్యలోనే బడి మానివేస్తున్నారని కేంద్ర ప్రభుత్వమే స్పష్టం చేసింది. ఉత్తీర్ణత సాధిస్తేనే పైతరగతికి పంపించే పద్ధతికి మళ్ళడం ద్వారా పునాది చదువులు అమాంతం తేటపడి, ప్రమాణాల మెరుగుదల సుసాధ్యమైపోతుందా? కానే కాదు. కాబట్టి నో డిటెన్షన్ ఆలోచన నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పక్కకు వచ్చి ప్రమాణాల బాగుసేతను లక్షించి సత్వరమే మరిన్ని అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది.

లోచనం

ఒకటో తరగతిలో చేరింది మొదలు ఎనిమిదో తరగతి వరకు విద్యార్థి గ్రహణ శక్తి, మార్కులతో నిమిత్తం లేకుండా మెట్లు ఎక్కనివ్వాలన్న విధానం తాలూకు పర్యవసానాలు కళ్లకు కడుతూనే ఉన్నాయి. అసర్ నివేదికలు, రాష్ట్రాల విద్యా పరిశోధన శిక్షణ మండళ్ల (ఎస్‌సీఈఆర్‌టీల) అధ్యయనాలు ఎప్పటికప్పుడు ప్రమాణాల పతనానికి అద్దం పడుతూనే ఉన్నాయి. దీనికి ఆ విధానమే కారణంగా లెక్కించడం సరికాదు. పాఠశాల విద్య పటిష్ఠతపై యంత్రాంగానికి సరైన దృక్పథం లేకపోవడమే అసలు లోపం. ఏనాడో 1975లోనే ఆరో తరగతి వరకు ఆ పద్ధతి ప్రవేశపెట్టిన తెలుగుగడ్డపై, అనంతర కాలంలో తొమ్మిదో తరగతి దాకా అనుత్తీర్ణత లేకుండా చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ- డిటెన్షన్‌కు మళ్లితే అర్ధాంతరంగా చదువు మానేసేవారి సంఖ్య పెరుగుతుందనీ, కాపీయింగ్ జోరెత్తుతుందనీ కొందరు చేస్తున్న వాదనలో నిజం ఉంది. ఈనేపథ్యంలో మధ్యేమార్గంగా, అమలు స్వేచ్ఛను రాష్ట్రాలకే వదిలిపెట్టాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రకటించడమంటే సమస్య నుంచి తప్పుకోవడమే. 'నో డిటెన్షన్'పై ఏకీభావానికి రాలేకపోయిన రాష్ట్రాలన్నీ ఉమ్మడి గళంతో ప్రస్తావిస్తున్న సమస్యల పరిష్కరణలో కేంద్రం నిర్ణాయక భూమిక వహించాల్సి ఉంది. తరతమ భేదాలతో అన్నిచోట్లా విద్యాప్రమాణాల పతనం, బోధన సిబ్బంది ఖాళీలు- మౌలిక లోటుపాట్లు ఒకేలా ఉన్నాయి. నియామకాలు, శిక్షణ ఏర్పాట్లు, బడుల్లో ప్రాథమిక సదుపాయాలు... ఎటుచూసినా వడివడిగా పూడ్చాల్సిన కంతలెన్నో కనిపిస్తున్నాయి. అందులో సుస్థిర పురోగతే- వ్యవస్థాగతంగా సాధించాల్సిన ఉత్తీర్ణత!

మానవ వనరులకు పదునుపెట్టి వారి శక్తియుక్తుల్ని జాతి శ్రేయస్సుకి ఉపయుక్తంగా మలచుకోవడంలో ప్రాథమిక చదువుల ప్రాశస్త్యం ఎనలేనిది. అందుకే దక్షిణ కొరియా, ఫిన్‌లాండ్, తైవాన్, హాంకాంగ్ తదితర దేశాలు బోధకుల నిరంతర శిక్షణకు పెద్దపీట వేస్తున్నాయి. చిన్న తరగతుల ఉపాధ్యాయులకు ఆకర్షణీయ వేతనాలు ఇస్తూ, వారు విద్యార్థుల్లో దాగి ఉండే సహజసిద్ధ ప్రతిభకు మెరుగులద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. విద్యపై స్థూల దేశీయోత్పత్తిలో వ్యయశాతం ప్రాతిపదికన న్యూజిలాండ్ (21.6), మెక్సికో (20.5), బ్రెజిల్ (19.2), దక్షిణ కొరియా (16.5) వంటివి భారత్ (ఒకటిన్నర శాతం లోపు) కన్నా యోజనాల దూరం ముందున్నాయి. 'ఆక్స్‌ఫామ్' నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు ఆరున్నర లక్షలమంది ఉపాధ్యాయులకు సరైన బోధన శిక్షణ లేదు. అయిదు లక్షల బోధన సిబ్బంది ఖాళీల్ని భర్తీ చేయాల్సి ఉంది. పాఠ్యాంశాల్లో సహేతుక మార్పులు, ఖాళీల భర్తీ, ప్రమాణాల ఉన్నతి, విస్తృతావసరాలకు అనుగుణమైన బడ్జెట్ కేటాయింపులు, సకల విధాల పాఠశాలల పటిష్ఠీకరణ... ఇదీ, సమగ్ర అజెండా కావాలి. పకడ్బందీ కార్యాచరణకు పూనుకొంటే- తరగతిలో ప్రతి విద్యార్థీ ఆణిముత్యమే. బడికి దిద్దవల్సిన ఒరవడి అదీ!

- జ్యోతి

ప్రజల ప్రాణాలను హరించే అశాస్త్రీయ వైద్యాలను అరికట్టాలి

వి-మెయిల్స్

ఈ మధ్య వీరమాచినేని రామకృష్ణ అనేవ్యక్తి కొవ్వుపట్టినవారు కొవ్వుతీసుకుంటే లావుతగ్గుతారని ,రోగాలుతగ్గుతాయని ప్రచారంచేస్తున్నాడు.ఇది శాస్త్రీయమాకాదా అని పరిశీలించవలచిన భాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎవరంటేవారు ఈ రకంగా ప్రచారం చేసుకోవచ్చా! అలా చేసుకుంటూపోతే ఇక ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఎందుకున్నట్లు? రామకృష్ణగారు చెప్పినది శాస్త్రీయమా కాదా అన్నది ముందుగా నిగ్గుతేల్చాలి. సికింద్రాబాద్‌లోని తారనాకలో ఉన్న జాతీయపోషకాహారసంస్థ వారికి రామక ృష్ణ తనవద్దవున్న పూర్తి వివరాలు ఇచ్చి వారిఅనుమతి పొందవలసిన అవసరంఉంది.ఈయనచెప్పిన లక్షణాలు ఆ ఆహారానికి వున్నదా లేదా అని వారు సర్టిఫికెట్ ఇస్తారు. అది శాస్త్రీయము. ఏమీ లేకుండా కొవ్వును తగ్గిస్తుందంటే ప్రజలు నమ్మాలా! ఏదైనా రుజువు పూర్వకంగా ప్రయోగశాలలో తేలాలి. రుజువు ఐన తర్వాతనే ఆ ఫలితము ప్రజలకు అందచెయ్యాలి.అది సైన్సు పద్ధతి. సైన్సులో రహస్యం ఉండదు .

ఆకువక్క సున్నము కలిపితే ప్రపంచంలో ఎక్కడైనా ఎర్రని రంగు వస్తుంది అని 2500 సంవత్సరాల క్రితమే చార్వాకులు ఎలుగెత్తి చాటారు .రకరకాల అశాస్త్రీయ వైద్య విధానాలు ఈ రోజు ప్రజలను మోసగిస్తున్నాయి. మూత్రం తాగితే రోగాలు పోతాయని మూత్రవైద్యం, ప్రాణిక్ హీలింగ్ పేరుతో కొంతమంది, రంగురాళ్ల పేరుతో కొంతమంది, పిరమిడ్వైద్యం, సంఖ్యాశాస్త్రం, ఆయిల్ పుల్లింగ్, ప్రకృతివైద్యం,యోగా సర్వరోగనివారిని, దేవుణ్ణి నమ్ముకుంటే రోగాలుపోతాయని,ప్రార్థనలు చెస్తేరోగాలు తగ్గుతాయని,రకరకాలవైద్యాలపేరుతో ప్రజలు వంచింపబడుతున్నారు.వీటిని అరికట్టి ప్రజలప్రాణాలను రక్షించవలచిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది .

- నార్నె వెంకటసుబ్బయ్య,
అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం

Dwaraka

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
09 ఫిబ్రవరి 2018

ఆరుబయటే...!

భారత్, పాక్ సరిహద్దు ప్రాంతాల్లోని పిల్లల కష్టాలకు దర్పణం ఈ చిత్రం. పాకిస్తాన్ తరచుగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తుండడంతో సరిహద్దుల్లోని చాలా పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తరగతి గదుల్లోనే విద్యార్థులు చదువుకుంటున్న ఈ దృశ్యం నౌషెరా ప్రాంతంలోది.



పైసా లేకుండా పర్యటన!



పైసా లేకుండా ప్రపంచాన్ని చుట్టి వచ్చేయగలరా? ఏం జోక్ చేస్తున్నారా? పైసాయే పరమాత్మ అనే ఈ రోజుల్లో డబ్బులు లేకుండా ప్రపంచ పర్యటన ఎలా? అంటారా! ఇది సాధ్యమేనంటున్నాడు ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌కు చెందిన అన్ష్ మిశ్రా. అవును మీరు చదివింది నిజమే. మొత్తం ప్రపంచం కాదుగానీ భారతదేశం అంతా చుట్టి వచ్చే ప్రయత్నంలో ఉన్నాడు అన్ష్‌మిశ్రా (28). రూపాయి కూడా లేకుండా దేశమంతా పర్యటించాలన్న అతని ఆంతర్యం వెనక బలమైన కారణమే ఉంది. అదే మానవత్వం, అసలైన ఆనందాన్ని వెతుక్కోవడం. ఇదెలా సాధ్యం అంటారా? ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పర్యటన పూర్తి చేసిన అతని అనుభవాలు, ఆలోచనల గురించి ఇంకొంచెం వివరంగా తెలుసుకుందాం!

కొంతమందికి ప్రయాణాలు చేయడం ఇష్టం. మరికొంతమందికి ప్రపంచ దేశాలను చుట్టి రావాలన్నది ఒక కల. ఇంకొంతమంది సాహసాలు చేయడంలో భాగంగా పర్యటనలు చేస్తుంటారు. అన్ష్‌మిశ్రా మాత్రం తన జీవితాన్ని మార్చుకునేందుకు ఈ యాత్రను ప్రారంభించానని చెబుతాడు. సగటు భారతీయుడు ఎవరికైనా కొన్ని కోరికలు, కలలు ఉంటాయి. కానీ అవి నెరవేర్చుకునేందుకు డబ్బులే ఉండవు. పెట్టుకున్న లక్ష్యాలను ఇష్టంగా సాధించాలనుకుంటే ఎవ్వరూ మిమ్మల్ని ఆపలేరు అంటాడు అన్ష్‌మిశ్రా. ఈ విషయాన్ని రుజువు చేసేందుకే తాను దేశపర్యటనను ప్రారంభించాననీ చెబుతాడు. జీవితంలో డబ్బును మించింది చాలా ఉంది. అదే మానవత్వం, అసలైన ఆనందం. వీటిని కోట్లు కుమ్మరించినా కొనలేము. జ్ఞాపకాలు, బంధాలు, అనుభవాలు, సంతోషాల మాదిరిగానే



మానవత్వాన్నీ డబ్బుతో తూచలేం, కొనలేం, దీనిని స్వయంగా తెలుసుకునే ప్రయత్నమే ఈ యాత్ర అని వివరిస్తాడు ఈ 28 ఏళ్ళ యువకుడు. అన్ష్‌మిశ్రా ఇంతకు ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గానూ పనిచేశాడు. ప్రస్తుతం అలహాబాద్ టెక్నికల్ కాలేజ్ నుంచి ఎంబిఏ పూర్తి చేస్తున్నాడు. జీవితంలో చదువుతో పాటు మంచి అనుభవాలు, అనుభూ తులు పోగు చేసుకోవడమూ అవసరమేనంటాడు అతను.

మొత్తం 24 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలను ఖాళీ జేబులతోనే చుట్టేసే ప్రయత్నం ప్రారంభించాడు. గత ఏడాది ఫిబ్రవరిలో అలహాబాద్ రైల్వేస్టేషన్ నుంచి అతని పర్యటన మొదలైంది. ఇక్కడ విపుల్ శుక్లా అనే తోటి ప్రయాణికుడి సాహచర్యంతో ప్రారంభమైన ఈ పర్యటనలో ఇంకెంతోమంది అపరిచితులను కలుసుకున్నాడు, వారి సాయాన్ని అందుకున్నాడు అన్ష్‌మిశ్రా. ఈ రైలులో రైల్వే పోస్ట్‌గార్డు సిబ్బంది శ్రీనివాస్‌తో పరిచడం అతడిని తనకు మంచి స్నేహితుడిని చేసిందని, అతను ఇంటి దగ్గరనుంచి తెచ్చుకున్న పరాటాలతో పాటు బిస్కట్లు మంచి టీ కూడా ఇచ్చాడని చెప్పాడు అన్ష్. సాయం చేసే మనస్తత్వం ఉన్న శ్రీనివాస్ లాంటివాళ్ళు మనదేశంలో చాలామంది ఉన్నారని, ఆ నమ్మకమే తనను ఈ పర్యటనకు పురికొల్పిందని అంటాడు అన్ష్. నెలరోజుల్లో మూడు రాష్ట్రాల పర్యటనను పూర్తి చేశాడు కూడా. తాను అనుకున్నట్టుగానే జేబులో రూపాయి లేకుండానే పర్యటనను కొనసాగిస్తున్నాడు. జాతీయ రహదారుల మీద వెళ్ళే బైక్‌లు, బళ్ళు, కార్లు, ట్రక్కులు తదితర వాహనాల్లో లిఫ్ట్ అడగడం ద్వారా అతను ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు తనకు కావలసిన కొన్ని జతల బట్టలు, సెల్‌ఫోన్, లాప్‌టాప్, కెమేరా తప్ప అతని దగ్గర ఇంకేమీ లేవు. తన అవసరాల కోసం అంటే తినడానికి తిండి, నిద్ర లాంటికోసం తన చుట్టూ ఉన్నవారి సహకారాన్ని తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇప్పటికే అతను 1800 మంది ట్రక్కు డ్రైవర్ల సాయం తీసుకున్నాడు. వారితోపాటే వాహనంలో లేదా రోడ్డు పక్కన వండుకోవడం, తినడం పూర్తి చేస్తున్నాడు. రాత్రిపూట చర్చిలు, మసీదులు, గుడులు, గురుద్వారాల్లో నిద్రపోతున్నాడు. ఒంటరిగా వెళుతున్న సహ ప్రయాణికుల నుంచి తనకు మంచి ప్రోత్సాహం లభిస్తోందని చెబుతున్నాడు అతను. ఖాళీ జేబులతో, పైసా కూడా లేకుండా సుదీర్ఘ ప్రయాణాన్ని ఒక సవాల్‌గా ప్రారంభించిన తనకు తోటివారి నుంచి గొప్ప సహకారం లభిస్తోందని అంటున్నాడు. మానవతావాదులతో తన అనుభూతులను పంచుకుంటున్నాడు. కొత్త జ్ఞాపకాలను పదిలపర్చుకుంటున్నాడు.

ఈ ప్రయాణంలో దారిపొడవునా అపరిచితులనే తన స్నేహితులుగా మార్చుకుంటున్నాడు తనకు ఏమైనా ఇస్తే తీసుకుని తినడం లేదంటే అలాగే ప్రయాణం కొనసాగించడం ఇదే ప్రస్తుతం తన దినచ్యగా చెప్పుకొచ్చాడు. తానున్న దారిలో వెళ్ళే ట్రక్కు లేదా కారు కోసం నిరీక్షిస్తూ రెండురోజులు అసలు ఏమీ తినకుండానే గడిపేసానని వివరించాడు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి జైసల్మీర్‌కి వెళ్ళేటప్పుడు అన్ష్‌మిశ్రాకి ఈ అనుభవం ఎదురైందట. దాదాపుగా 46 కిలోమీటర్ల దూరంలో





ఉన్న ఇవి రెండూ ఎడారి తోవలోనే ఉన్నాయి. ఈ సమయంలో తినడానికి ఏమీ దొరక్క కేవలం బాటిల్ నీళ్ళు తాగి ఉన్నారు. రెండోరోజు సంధ్యా సమయానికి తీవ్రమైన అలసటతో కుప్పకూలిపోయాను. "ఇంక ఏమీ చేయలేను" అని ప్రయాణం ప్రారంభించిన తర్వాత మొదటిసారి అనిపించింది. రాత్రి ఎనిమిది గంటల సమయంలో టోక్యో హోటల్‌కి చెందిన కారు డ్రైవర్ అటుగా వచ్చాడు. జైసల్మీర్‌కు తన ట్రక్కులో ఎక్కించుకు వెళతాను రమ్మన్నాడు. ఆ రోజు రాత్రి హోటల్‌లో జరుగుతున్న పార్టీకి తనతోపాటు రావల్సిందిగా కోరాడు.

ఆ సమయంలో అతను ఎడారిలో పరిమళించిన మానవత్వంలా కనిపించాడు అతను అంటాడు అన్ష్‌మిశ్రా. నెలకు కేవలం రూ. 3500లు మాత్రమే సంపాదించే అతను సహృదయతలో మిలియనీర్‌గా కనిపించాడు నా కంటికి అంటాడు అన్ష్. జీవితంలో తనకు ఆఖరి రోజులు అనుకుంటున్న ఆ సమయంలో ఆ ఎడారిలో నిజంగా మూర్తీభవించినా మానవతా మూర్తిలా కనిపించాడు అన్ష్‌కి. నిజంగా అన్ష్ ప్రయాణం చెప్పుకోవలసిన విషయమే కదా! నేటి మనుషుల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ నవ్వులు, కృత్రిమత్వానికి దూరంగా తాను ఆనందాన్ని పొందుతూ ఇతరులకు సంతోషాన్ని పంచుతూ మంచి అనుభవాలు, అనుభూతులను సొంతం చేసుకుంటున్న అన్ష్‌మిశ్రా దేశాటన ప్రయాణం సఫలీకృతమయినట్టేగా!

"ఈ పర్యటనలో నాకు దక్కినవన్నీ అందమైన జ్ఞాపకాలే, ఏ ఒక్కరూ నన్ను బాధించలేదు. ఆహారం, ఆశ్రయం నుంచి డబ్బులు ఇవ్వడం వరకూ అందరూ నాకు సహకరించినవారే. వెళ్ళిన ప్రతిచోటా కొత్త భాషను ఎంతోకొంత నేర్చుకున్నాను. స్థానికుల నుంచి అవసరమైన పదాలను తెలుసుకున్నాను. ఆతిథ్య రంగం మీద దృష్టి పెట్టాలన్నదే ఇప్పుడు నా ముందున్న లక్ష్యం. డబ్బు లేకపోయినా పర్యటనలు చేయాలనుకునేవారికి రిసార్టులు ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. అపరిచితులు అందరి నుంచి నేను అందుకున్న ప్రేమాభిమానాలే నన్ను ఈ పనికి ప్రేరేపిస్తున్నాయి. నా జీవితంలో ఇవే అత్యుత్తమమైన రోజులు. ఈ ప్రయాణంలో నేను కలుసుకున్న ఏ ఒక్కరినీ మర్చిపోలేను. ఇదే వాతావరణంలో జీవితాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాను. మనచుట్టూ ఎలాంటి వాతావరణం ఉన్నా బాధలకు తావులేకుండా సంతోషంగా జీవించగలగాలి" అంటాడు అన్ష్. అతని మాదిరిగా చుట్టూ ఉన్న ముషల్లో మంచితనాన్ని, సానుకూల దృక్పథాన్ని చూడగలిగితే అందరి జీవితాలు నందనమయమే కదా!


-ఎన్ఎస్

"రూపాయి కూడా లేకుండా అన్ని రాష్ట్రాల్లో పర్యటించాలనుకోవడం ఊహించలేని విషయమే. ఈ పర్యటన ద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ ప్రాంతాలను చూసి రావడంతో పాటు దారిపొడవునా తారసపడే జనం నుంచి ఎంతోకొంత నేర్చుకోవాలనుకుంటున్నాను" అంటూ ఈ పర్యటనను ప్రారంభించిన అన్ష్‌మిశ్రా రెండురకాలుగానూ తాను అనుకుంటున్న ఆనందాన్ని సొంతం చేసుకుంటున్నానని వివరిస్తున్నాడు. సాటి మనుషులకు సాయం చేయడం, వారినుంచి సాయం అందుకోవడం రెండూ గొప్ప అనుభవాలను, అనుభూతులనే అందిస్తాయని, ఇది ఆ పని చేసేవారికే అర్థమవుతుందని అంటున్నాడు.



పెదవుల మీద తెల్లమచ్చలా!

పెదవుల మీద తెల్లమచ్చలు కనిపిస్తున్నాయా? వీటివల్ల అంత హాని ఏమి లేకపోయినప్పటికీ చూడడానికి మాత్రం ఇబ్బందిగానే ఉంటాయి. అందం మీద శ్రద్ధ ఉన్నవారికి ఇది మరింత ఇబ్బందిగా అనిపిస్తుంది. వీటిని పోగొట్టుకునేందుకు కొన్ని గృహ చిట్కాలు ఉన్నాయి. సహజసిద్ధమైన పదార్థాలతో మీ పెదవులకు మళ్ళీ మామూలు రూపం తీసుకురావచ్చు.



- వెల్లుల్లి రెబ్బను మెత్తగా నూరి అందులో ఆల్మండ్ అయిల్ వేసి పెదవులకు రాయండి. కొద్దిసేపాగి గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



- కొద్దిగా యాపిల్ సిడర్ వెనిగర్ తీసుకుని అందులో చిన్న దూది ఉండను వేసి నానబెట్టండి. దీంతో పెదవుల మీద రాయండి. పది నిముషాలు తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే వేగంగా ఫలితం వస్తుంది.
- మజ్జిగలో దూదిని ముంచి మచ్చలున్న చోట రాయండి. పావుగంట తర్వాత వేడినీళ్ళతో శుభ్రం చేసుకోండి. ఈ చిట్కాను వారంలో నాలుగైదు సార్లు ఉపయోగించుకోవచ్చు.
- రెండు లేదా మూడు చుక్కల జోజోబా ఆయిల్ తీసుకుని అందులో విటమిన్ ఈ ఆయిల్ కలపండి. దీనిని పెదవులకు రాసి పదినిముషాలు తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికోసారి దీనిని రాసుకోవచ్చు.
- రాత్రిపూట పడుకునేముందు పెదవులకు శుభ్రంగా కొబ్బరినూనె రాయండి. రాత్రంతా అలాగే ఉంచేసి ఉదయాన్నే గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. ఈ పని రోజూ చేయవచ్చు.
- ఆలివ్ ఆయిల్‌ను పెదవులకు రాసి గంట సేపు ఉంచండి. తర్వాత వేడినీళ్ళతో శుభ్రం చేసుకోండి. రెండువారాలపాటు రోజుకి రెండు లేదా మూడుసార్లు ఇలా చేస్తే పెదవుల మీద తెల్లమచ్చలు మాయం అవుతాయి.
- మూడు, నాలుగు చుక్కల ఆర్గాన్ ఆయిల్ తీసుకుని ఇందులో ఒక టీస్పూన్ అలోవెరా జెల్ కలిపి తెల్లమచ్చలు ఉన్న పెదవుల మీద రాయండి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికోసారి ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

Dwaraka

నో క్లెయిమ్ బోనస్ పొందే విధానం



ఏదైనా ప్రమాదంలో మన వాహనం దెబ్బతింటే పరిహారం పొందాలనే ఉద్దేశంతో బీమా చేయిస్తాం. కానీ నిర్ణీత కాలవ్యవధిలో ప్రమాదాల బారిన పడకుండా.. ఎలాంటి పరి హారం తీసుకోకుండా ఉంటే బీమా కంపెనీ వాహన యజమానికి కొంతమొత్తం రాయితీ ఇస్తుంది. దీన్నే నో క్లెయిమ్ బోనస్ (ఎన్ సీబీ) అంటారు. కాంప్రెహెన్సివ్ లేదా బీ పాలసీ తీసుకున్నవారు దీనికి అర్హులు. ఎన్‌సీబీ గరిష్టంగా యాభైశాతం వరకు పొందవచ్చు. ఉదాహరణకు బైక్ లేదా కారు ఓనరు ఏడాదికి పదివేల రూపాయల బీమా ప్రీమియం చెల్లిస్తుంటే ఎన్‌సీబీకి అర్హుడైన తర్వాత ప్రీమియంలో ఐదువేలు మాత్రమే చెల్లించొచ్చు. అది యజమాని కొత్త వాహనం కొనుక్కుంటే దానికి బదలాయించుకోవచ్చు. అప్పుడు పాత వాహనానికి ఖరీదు కట్టే మొత్తం విలువను బట్టి ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది.

పాలసీ ఏదైనా మనం తీసుకునే రోజు నుంచి మరుసటి సంవత్సరం అదే రోజుకు ముందురోజు రాత్రి 12 గంటలకు ఒక సెకను ముందు ముగుస్తుంది. కాబట్టి బీమా పాలసీ పునరుద్ధరించాలనుకుంటే కొద్దిరోజులు ముందే ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయించుకుంటే ఎటువంటి ఆటంకాలు ఉండవు. కొత్త పాలసీ అయినా, కాలపరిమితి ముగిసిన తర్వాత తీసుకున్న పాలసీ అయినా తీసుకున్న సమయం నుంచే అమలులోకి వస్తుంది. అమల్లోకి వచ్చే ముందు జరిగే ఏ నష్టానికీ బీమా కంపెనీ బాధ్యత వహించదు. ముఖ్యంగా బీ పాలసీ ఉన్న వాహన యజమానులు ఏ కారణంతో అయినా రెన్యువల్ ఆలస్యంగా చేస్తే అప్పటివరకు పొందిన ఎన్‌సీబీ సౌకర్యం కోల్పోతారు.





అతడు-ఆమె



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

"శాస్త్రిగారూ! ఎన్నికలలో నిలబడ్డం గురించి యేం నిర్ణయించారు? నేను మాపక్షం వారితో మాట్లాడేను. ఖర్చులు మావాళ్ళే భరాయించేటట్టు వ్రాయించి తీసుకు వచ్చా. ఒక్కమాట మాత్రం మీతో చెప్పాలి" అని దగ్గర కొచ్చి నా చెవిలో "తవాప్యర్థం; మమాప్యర్థం ఇక మీరు సంయంటే సంయే!" అంది ఊర్వశి. అన్నయ్య సలహా జ్ఞప్తికి తెచ్చుకున్నా. తర్వాత లెక్కపెట్టా... ఈవేళ ఉత్తరాషాఢ! ఓహో మనకి విపత్తార. అందులోనూ ప్రథమ పాదం. చిత్తినీ జాతి స్త్రీ ఘోరవిపత్తు మూడేటట్టుంది! ఇప్పుడు మనం ముందుజాగ్రత్త యెంత పడ్డా మనచేతి డబ్బు వదలక మానదు. తనవంతుకి మొదటే నా దగ్గిర అణా ముక్కమీద వ్రాయించుకుంటుందేమో కూడాను! అసలు నేను ఎన్నికలలో నిలబడతాననడమే శాంతానికి ఆగ్రహ కారణం అయింది. శాంతం సలహాలే ఉత్తమం.

(నిన్నటి సంచిక తరువాయి)

"ఊర్వశిగారూ! క్షమించండి. ఎన్నికలలో నిలబడనని నిశ్చయం చేసేశా!" అన్నాను.

"పోనీలెండి దానికేం! బల్లమీద వున్నది తెల్లగుర్రమా? పెద్ద ఉగ్గుగుల్లడున్నూ, చిన్న షోడాన్నూ మిశ్రమం చేసి ఇలా ఇవ్వండి" అని పుచ్చుకుని తన కారెక్కి వెళ్ళిపోయింది...

శాంతం దగ్గరినుంచి కాశీ వెళ్ళాక కబురులేదు. నేను ఎన్నికలలో నిలబడడం లేదు అని తనకి తెలిస్తే ఇంటికి తక్షణమే వచ్చేస్తుంది అని నాకు ధైర్యం వుంది. కాని - ఎక్కడికని టెలిగ్రాం చేసేది? అయ్యో!

... నేను లండనులో వుండే రోజుల్లో - సర్ జాషువా రెయినాల్డ్సు "సబ్బుబుడగల" చిత్రం మీద - పాటపాడే వారందరూ. ఆ పాట జ్ఞాపకం వస్తుంది:

"నిరంతరము నే పూదెడు బుడగలు
రమ్యసుందరమైన నీటిబుగ్గలు
చేపట్టును ఆకాశ మార్గము
చేరజాలవు స్వర్గద్వారము
అవని వీధుల అంతర్ధానము
నే కన్న కలలు నేస్సృష్టించెడి బుడగలు
మిధ్యలు - మాయలు - మృగతృష్ణలు!"

85 ఆమె

గుల్మార్గ్ - కాశ్మీరు : ఢిల్లీలో రెండురోజులు. లాహోరులో రెండురోజులు వున్నాను కాని కాశ్మీరు వచ్చేవరకు తోచలేదు. వచ్చి పదిరోజులైంది.

ఈ తెల్లని మంచుకొండలు - నల్లటి ఈ దేవదారు అడవులు - ప్రశాంతమైన ఈ వితిష్టానది - అద్దంలా మెరిసిపోతున్న యీ సరస్సులు - వీటిని చూసేవరకు నాకు ఉండబట్టలేదు. చూశాక మనస్సుకి నెమ్మది కలిగింది. వెచ్చటి ఎండలో హిమగిరి పాదాల దగ్గర పడుకుంటే - వెనకటి తేనెవెన్నెల రోజులే జ్ఞాపకం వస్తాయి. పార్వతీ పరమేశ్వరులు భూసంచారం చేయడానికి ఇక్కడికే వస్తారంటారు మనవాళ్ళు. పదేళ్లకిందట - శాస్త్రీ నేను - నూతన దంపతులం - ఇక్కడికే వచ్చాం. ఒకరి నొకరం ఇక్కడే తెలుసుకున్నాం:

పదేళ్ళు : పదేళ్ళంటే ఎంత? అసలు మన ఆయుష్షెంత?

అనంతరంలో చిటికె - సృష్టికల్పంలో ఒక లిప్త. అనంత కోటి శక్తులలోనుంచి వచ్చాం మనం. అవన్నీ మనందరిలోనూ - శాస్త్రిలోనూ - నాలోనూ- పాపాయిలోనూ - ఇమిడి వున్నాయి. ఆ శక్తులను మనం ప్రజ్వలింపజేయాలి. ఎలాగు అన్నదే ప్రశ్న. అంతేకాదు - వ్యక్తిగతంగా నేను - ఎలాగు చేయగలను - అన్నది మరీ ముఖ్యమైన ప్రశ్న.

పాపాయి, సుభ సరదాగా ఆడుకుంటున్నారు.

ఈ ప్రశాంతంలో ఈ జిజ్ఞాస మర్చిపోదాం అని వుంది.

...శాస్త్రి కూడా ఈ విషయాలే ఆలోచిస్తున్నాడేమో? కాని - లౌక్యం - స్వార్థం - ఆ గడుసుదనంలో - అంతా సరిగ్గానే కనిపిస్తుంది అతనికి. స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీంమహీశాః గోబ్రాహ్మణేభ్య శుభమస్తు నిత్యలోకాస్సమస్తాస్సుఖినోభవంతు - కాలే వర్షతి పర్జన్యః - పృథ్వీ సస్యశాలినీ - దేశోయం క్షోభరహితో - బ్రాహ్మణాస్సంతు నిర్భయం - అపుత్రా పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః - అధనాస్పదనాస్సంతు జీవంతు అక్షరాల - తను కంఠతా పట్టిన మాంచెస్టరు లిబరలిజం!



ఈ దేశంలో పాడిపంటలు లేవు- పండితులకి ఆదరణ లేదు. బీదలకి డబ్బులేదు- పిల్లలకీ చదువుల్లేవు - యువకులకి ఉద్యోగాల్లేవు - తల్లిదండ్రులకి సౌఖ్యంలేదు.

ఎంచేత అనే ప్రశ్నకి జవాబే చెప్పడు.

శ్రీనగరం : నాలుగురోజులై ఇక్కడి కొచ్చానని శాస్త్రి పేర టెలిగ్రాం వేశా.. డాల్ సరస్సులో పడవ మీద పడుకుని ఆకాశంవేపు - మంచు కొండలవేపు - చూస్తుంటే - ఇది వేరే ప్రపంచం అనిపిస్తుంది. మళ్ళీ - యీ ప్రజ - వీళ్ళ దరిద్రం - వీళ్ళ అధోగతి చూస్తే దిగ్భ్రమ కలుగుతుంది. వేలకొలది ధనవంతులు ప్రపంచం నాలుగుమూలలనుంచి యేటా వచ్చి నీళ్ళలాగు డబ్బు ఇక్కడ వెదజల్లిపోతున్నారు. మహారాజేమో స్వర్గసుఖాలతో తులతూగుతున్నాడు. ఈ గడ్డిమీద పుట్టి ఈ గడ్డమీద గిట్టే వీళ్ళు - అనాధలుగా వున్నారు.

చెన్నపట్నంలో హరిజనసేవ చేసేటప్పుడు ఆ చేరీలు చూసి గుండె జల్లుమనేది. కలకత్తాలో బస్తీలు చూస్తే భయం హడలు పుట్టింది. ఢిల్లీలో మొహల్లాలు చూస్తే మతిపోయింది. పోనీ - అక్కడంటే పారిశ్రామిక నాగరికత అనుకుందాం. ఇక్కడేం లేదే! నేలని గీచి జీవిస్తున్నారే వీళ్ళు- వీళ్ళ గతీ అలాగే నిరర్థకంగా వుందే!

ఆగర్భ శ్రీమంతులు అలాగు - ధాత్రీ పుత్రులు ఇలాగు! దున్నిన వాడిదే భూమి - పండించినవాడికే ఆహారం - కష్టించినవాడికే ధనం- అని యెందుకనకూడదు? ఇందుకు జవాబు ఏ ఆర్థికశాస్త్రమూ చెప్పదే!

మన జీవితంలో-మానసికం, రాజకీయం, ఆర్థికం - అంతా మిళితం చెయ్యాలి. మన స్వతంత్రానికి - మన స్వరాజ్యానికి - అప్పుడు కాని అర్థం వుండదు. గాంధీగారి రామ రాజ్యంలో అచ్చంగా యెలాగుంటుందో యెవ్వరం - చెప్పలేకపోయినా - ఇప్పటి మటుకు ఆయన నాయకత్వం క్రింద వెళితేనే మనకి స్వతంత్రం - సోషలిజం - ఒక్కమాటే సంపాదించడానికి అవకాశం వుంటుందేమో?

ఈరెండింటిలో - యేది లక్ష్యం - యేది సాధన? సోషలిజం లక్ష్యం - స్వతంత్రం అందుకు సాధనం - అని తోస్తోంది నాకు. మన దేశ సాంప్రదాయం మన సంస్కృతి - వీటిని అనుసరించే సాధనాలు తయారుచేసి ఉపయోగించారు గాంధీగారు. కాని - ఈ ఎన్నికల రభస చూస్తే, అరచేతి మోక్షంలాగుంది! ఇప్పటిలాగే - యీ తరువాత కూడా అసలు రాజ్యాధికారం చలాయించేవారు - ఏకొద్దిమంది లెక్కవాళ్ళో అవుతారని అనిపిస్తుంది నాకు. తెల్లవాడు మసిపూసి మారేడుకాయ చేస్తాడు. మాయదారి సోషలిజమూ- కల్లబొల్లి స్వతంత్రం - కాకుండా గాంధీగారు చూడాలి. అయినా మహాత్ముడు వున్నంతకాలం ఆ భయం ఉండకూడదు మరి.

శాస్త్రిని లాలన పాలనమీదనే మెల్లిగా నావేపు తిప్పుకోవాలి! స్వరాజ్యం అంటే ఇప్పుడిప్పుడు ముఖం తిప్పడం పెదిమె విరపడం మానేస్తున్నాడు కాని - సోషలిజం అంటే బెదురుతాడు! చమటోడ్చి కష్టించే వాడికి రాజకీయం యెందుకంటాడు. "ఇంగ్లాండులో కార్మికుల గవర్నమెంటే రైళ్ళని గాని - బొగ్గు గనులని టీరా - ఉక్కు ఇనుము పరిశ్రమలను గాని- విద్యుచ్ఛక్తి ఉత్పత్తిగాని - నూలు పరిశ్రమని గాని జాతీయం చెయ్యలేదు - మూలధనంమీద పన్ను వెయ్యలేదు - జమిందారీలని రద్దు చెయ్యలేదు. రాజకుటుంబానికి స్వస్తి చెప్పలేదు కదా - ఇంగ్లీషు కార్మికవర్గానికే సోషలిజం పనికిరాకపోతే - మనదేశానికా పనికొస్తుంది? కందకి లేని దురద బచ్చలికేల?" అంటాడు.

ఈమధ్య మరొకటి మొదలెట్టాడు - "మనదేశంలో కూడా హిట్లరంటూ వొకడు బయలుదేరితే బాగుండును" అని. "అటువంటి వాడికింద నాజీ సోషలిజం వస్తే నాకు అభ్యంతరం లేదు" అంటాడు. నాజీ-నాజీ - అని శాస్త్రికి ఇదొక ఊతపదం అయిపోయింది. నాతోటి సత్యాగ్రహులే ఎంతోమంది హిట్లరుని దేవుడిగా చూస్తూ నిత్యం పూజచేస్తున్నారు! అతడు చేస్తున్న దౌర్జన్యాలు చదువుతుంటేనే భయానకంగా వుంది! మనం ఉద్యమంలో పడ్డ బాధలు వాటిముందు ఎంత? అబ్బబ్బ!

శాస్త్రితో తొందరపడి లాభం లేదు. అతనికి ఇంగ్లీషువాళ్ళపై వుండే భక్తి - నాపై వుండే ప్రేమ - యీ రెండింటిమీదనే అతన్ని జాతీయ ప్రవాహంలో నడిపించి లాగాలి! ఇద్దరం కలిసే ఈ ప్రవాహంలోకి దిగాలి.

ఈవేళకి అప్పుడే మూడువారాలైంది శాస్త్రిని చూసి. అతన్ని వొక్కమాటు చూస్తేనేకాని తోచడం లేదు. శాస్త్రి నాదగ్గిర లేకపోతే నాకంతా శూన్యం - నా హృదయం మేఘావృతం - కళ్ళముందు కారుమబ్బులు...

రమ్మని టెలిగ్రాం వేద్దునా? రాకపోతే?

తాజా : ఇలాగు అనుకుంటూనే వున్నా - పాపాయి పరుగెత్తుకుంటూ వచ్చి : "అమ్మా నీకీ వుత్తరం ఇమ్మని ఇచ్చాడే - హోటేలు బంట్రోతు" - అంటూ టెలిగ్రాం నాచేతికిచ్చింది. ఆ పచ్చని కవరు చూడగానే నా గుండెలో రాయి పడింది. తప్పకుండా శాస్త్రి దగ్గరనుంచే అని అనుకున్నాను. "శ్రీమతి వి.శాంతా శాస్త్రి - మెడోస్ హోటేలు - శ్రీనగరం-" అని వుంది! నా చిరునామా శాస్త్రికి ఎలా తెలిసింది? నేను తెలియజెయ్యలేదే! తేనె వెన్నెల రోజులు అతనికింకా బాగా జ్ఞాపకం వున్నాయన్న మాట. అప్పుడు యీ హోటేల్లోనే దిగాం అన్నమాట మర్చిపోలేదు. నేనంటే ఎంత ప్రేమ!

టెలిగ్రాం విప్పడానికి భయం వేస్తుంది. పాపాయిని దగ్గరకి పిలిచి వళ్ళో కూర్చోబెట్టుకున్నా, కవరు చించి చదివేను.

"మల్లేశ్వరం జమీను రైతుల తరపున ప్రీవీ కౌన్సిలుకు వకాల్తీ పుచ్చుకున్నాను. ఫీజుకాని ఖర్చులుకాని పుచ్చుకోవడం లేదు. పదిరోజుల్లో బొంబాయినుంచి లండనుకు బయలుదేరాలి. మన ముగ్గురికీ సుభకీ స్టీమరు టిక్కెట్లు కొన్నాను. మిగతా అన్ని ఏర్పాట్లూ చేశాను.

- ఇంకా వుంది.

ఒక పదానికి అనేక అర్థాలు ఉండటాన్ని ఏమంటారు ?



ఏపీ టెట్
తెలుగు ఆబ్జెక్టివ్ బిట్స్

1. కిందివాటిలో 'కోరిక' అనే పదానికి పర్యాయ పదం ఏమిటి ?
1. గాలి 2. బాణం
3. ఈప్సితం 4. సంతోషం

2. 'మబ్బుకు మనసే కరిగి నీరవుతుంది మనసుకు మబ్బే ముసిరితే అది కన్నీరవుతుంది' ఈ వాక్యాలు సి.నా.రె. రచించిన ఏ గ్రంథంలోనివి ?
1. సమ దర్శనం 2. ప్రపంచ పదులు
3. గజళ్లు 4. విశ్వంభర

3. బోయి భీమన్న రచించిన ఏ గ్రంథానికి 'కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం' లభించింది ?
1. పాలేరు నాటకం 2. రాగ వైశాఖి
3. గుడిసెలు కాలిపోతున్నాయి 4. ధర్మం కోసం పోరాటం

4. 'అజంతా చిత్రాలు కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి' అనే వాక్యంలో 'కళ్లకు కట్టినట్లు' అనే జాతీయానికి అర్థం ?
1. కళ్లు చెదిరేటట్లు 2. కళ్లకు కట్టుకున్నట్లు
3. కళ్లముందు నిజంగా ఉన్నట్లు 4. కలలో తేలినట్లు

5. 'ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదు' అనేది ఏ వర్గానికి చెందిన సామెత ?
1. ప్రశ్నార్థక సామెత 2. ఉపమాన రూప సామెత
3. వైద్యశాస్త్ర సంబంధ సామెత 4. వ్యవసాయ సామెత

6. కిందివాటిలో గగనం, వస్త్రం, శూన్యం అనే నానార్థాలు ఉన్న పదం ఏది ?
1. వాన 2. చక్రం 3. అంబరం 4. అంబ

7. 'పున్నామ నరకం నుంచి రక్షించువాడు' అనే అర్థం ఉన్న పదం ఏది ?
1. సుతుడు 2. తనయుడు
3. పుత్రుడు 4. నందనుడు

8. 'బాలల్లారా ! వినరండి. ఏమవుతుందో చెప్పండి.' పాఠ్యభాగం నాళం కృష్ణారావు రచించిన ఏ గ్రంథం నుంచి గ్రహించారు ?
1. మీగడ తరగలు 2. గోరుముద్దలు
3. వెన్న బుడగలు 4. గుజ్జన గూళ్లు

9. హరిశ్చంద్రుడి తండ్రి ఎవరు ?
1. విశ్వామిత్రుడు 2. వశిష్టుడు
3. త్రిశంకుడు 4. సురేంద్రుడు

10. మానవుడి నిత్య జీవిత అనుభవ సారాన్ని ఇతరులకు అల్పాక్షరాల్లో, అనల్ప భావాన్ని సందేశ రూపంలో అందించేది ఏది ?
1. నానుడి 2. జాతీయం
3. సామెత 4.. పొడుపు కథ

11. 'భారత కోకిల' అనేది ఏ కవయిత్రి బిరుదు?
1. దుర్గాబాయి దేశ్‌ముఖ్ 2. సరోజిని నాయుడు
2. బండారు అచ్చమాంబ 4. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ

12. డాక్టర్ సి.నారాయణరెడ్డి రచించిన 'నాగార్జున సాగరం', 'రామప్ప', 'విశ్వంభర' అనేవి వరుసగా ఏయే ప్రక్రియలకు చెందిన రచనలు ?
1. పద్య కావ్యం, గేయ రూపకం, గేయ కావ్యం
2. గేయ కావ్యం, గేయ రూపకం, వచన కావ్యం
3. గేయ కావ్యం, గేయ నాటిక, పద్య కావ్యం
4. గేయ కావ్యం, నాటకం, విమర్శ గ్రంథం

13. 'భారతి చిరు పెదవులపై / పరవశించు నవ్వులం.. విశ్వమెల్ల వెన్నెలను / వెదజల్లే నవ్వులం' అనే గేయ పంక్తులు ఉన్న 'తొలకరి చిరుజల్లులు' పాఠ్యభాగ రచయిత ఎవరు ?
1. కరుణశ్రీ 2. బాలబంధు బి.వి.నరసింహారావు
3. జంధ్యాల వెంకటేశ్వరశాస్త్రి 4. జంధ్యాల మహతీశంకర్

14. మన దేశంలో తొలి మహిళా గవర్నర్ ఎవరు ?
1. విజయలక్ష్మి పండిట్ 2. పద్మజా నాయుడు
3. సరోజినీ నాయుడు 4. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్

15. 'అందదు, ఆగదు, అరగదు ఎవరతడు' అనే పొడుపు కథకు అర్థం ?
1. చంద్రుడు 2. తారక
3. సూర్యుడు 4. మేఘుడు

16. సుధ, జలం, నెయ్యి, యజ్ఞం అనే వాటికి కిందివాటిలో సరైన నానార్థం ?
1. విషం 2. హాలాహలం 3. అమృతం 4. వేడుక

17. కిందివాటిలో 'హిమగిరి'కి పర్యాయపదం ఏది ?
1. వేదాద్రి 2. భద్రాద్రి
3. వేంకటాద్రి 4. శీతాద్రి

18. 'మధుర కవి' అని ఎవరి బిరుదు ?
1. కరుణశ్రీ 2. నాళం కృష్ణారావు
3. బి.వి.నరసింహారావు 4. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి

19. కొండపల్లి శేషగిరిరావు ఏ కళలో నిష్ణాతులు ?
1. సంగీతం 2. చిత్రకళ 3. విగ్రహ శిల్పం 4. సాహిత్యం

20. కిందివాటిలో సామెతకు పర్యాయ పదాలు ఏవి ?
1. నానుడి 2. జనశ్రుతి- సుద్దు
3. శాస్త్రాలు-సాటువలు 4. పైవన్నీ

21. కిందివాటిలో 'సాధువుల హృదయమున శయనించి ఉండేవాడు' అనే వ్యుత్పత్త్యర్థం ఉన్న పదం ఏది ?
1. విష్ణువు 2. శివుడు
3. బ్రహ్మ 4. మహేశ్వరుడు

22. 'పాలేరు నుంచి పద్మశ్రీ వరకు' అనేది ఎవరి స్వీయ చరిత్ర ?
1. ఎస్.టి.జ్ఞానానంద కవి 2. బోయి భీమన్న
3. కొలకలూరి ఇనాక్ 4. గుర్రం జాషువా

23. 'గౌతమీ కోకిల' అనేది ఏ కవి బిరుదు ?
1. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 2. నాళం కృష్ణారావు
3. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 4. వేదుల సత్యనారాయణ శాస్త్రి

24. ఒక పద్యానికి సంబంధించిన పుట్టుక, నేపథ్యం, దాని అర్థం మొదలైన వాటిని తెలియజేసేవి ?
1. పర్యాయ పదాలు 2. వ్యుత్పత్త్యర్థాలు
3. ఐతిహాసికార్థాలు 4. నానుడులు

25. 'నెత్తిమీద రాయి నోట్లో వేలు' దీని అర్థం ?
1. నాగరం 2. వంకీ 3. ఉంగరం 4. గడియారం

26. 'సంతసము' పదానికి ప్రకృతి పదం ఏది ?
1. ఆనందం 2. సంతోషం 3. ఆహ్లాదం 4. ఉత్సాహం

27. కిందివాటిలో 'మనసు'కు పర్యాయ పదమేది ?
1. ఉల్లం 2. చిత్తం
3. హృదయం 4. పైవన్నీ

28. కిందివాటిలో బోయి భీమన్నకు లభించని పురస్కారం ఏది ?
1. పద్మశ్రీ 2. కళాప్రపూర్ణ
3. పద్మవిభూషణ్ 4. పద్మభూషణ్

29. ఒక పదానికి అనేక అర్థాలు ఉండటాన్ని ఏమంటారు ?
1. పర్యాయ పదాలు 2 అనేకార్థాలు
3. నానార్థాలు 4. వ్యుత్పత్త్యర్థాలు

30. 'అక్కాచెల్లెళ్లు ఏడుస్తారు. అయితే దగ్గరకు చేరరు' అనే పొడుపు కథకు అర్థం ?
1. కాళ్లు 2. చెవులు
3. పెదాలు 4. కళ్లు



31. 'గుణం' అనే పదానికి కిందివాటిలో సరైన పర్యాయ పదాలు ఏవి ?
1. గోరు గున్న 2. స్వభావం, గొనము
3. చిన్న, చిగురు 4. వ్యాధి, అంతిమం

32. 'ది గోల్డెన్ త్రెషోల్డ్' అనే ఆంగ్ల కవితా సంపుటికర్త ఎవరు ?
1. రవీంద్రనాథ్ ఠాగూర్ 2. ఆర్.కె.నారాయణ్
3. సరోజిని నాయుడు 4. సావిత్రిబాయి పూలే

33. పొడుపు కథకు పర్యాయ పదం?
1. అద్దుకథ 2. మారుతక- తట్టు ప్రశ్న
3. ప్రహేళిక 4. పైవన్నీ

34. కిందివాటిలో కొండపల్లి శేషగిరిరావు చిత్రించిన అద్భుత చిత్రం ఏది ?
1. తెలుగు తల్లి చిత్రం 2. గోదాదేవి చిత్రం
3. బేస్తవారి చిత్రం- కలువకొలను లచ్చి చిత్రం 4. పైవన్నీ

35. గోరంత మాటల్లో కొండంత అర్థాన్ని నిక్షిప్తం చేసేది ఏది ?
1. సామెత 2. జాతీయం 3. లోకోక్తి 4. పొడుపు కథ

36. 'జాతీయ జానపద గీతిక జాతికి జీవనాళిక' అని చెప్పిన రచయిత ?
1. నేదునూరి గంగాధరం 2. శ్రీశ్రీ
3. ఆర్.ఎస్.సుందరం 4. ఎస్.గంగప్ప

37. జానపద గేయాలను ఇంగ్లిష్‌లో ఏమని పిలుస్తారు ?
1. ఫోక్‌లోర్ 2. ఫోక్ లిటరేచర్
3. ఫోక్‌సాంగ్స్ 4. ఫోక్ టేల్స్

38. 'పేదవాని కోపం పెదవికి చేటు' అనేది ఏ రకానికి సంబంధించిన సామెత ?
1. పౌరాణిక సామెత 2. నీతిబోధక సామెత
3. హాస్యస్ఫోరక సామెత 4. వ్యవసాయ సామెత

39. కిందివారిలో 'షట్చక్రవర్తుల్లో' లేని వారు ఎవరు ?
1. హరిశ్చంద్రుడు, నలుడు 2. పురూరవుడు, పురుకుత్సుడు
3. దశరథుడు, శ్రీరాముడు 4. సగరుడు, కార్తవీర్యార్జునుడు

40. 'సామెత' అనే పదం ఏ పదం నుంచి ఉద్భవించింది ?
1. ఆంగ్లంలో ప్రొవెర్బ్ 2. సంస్కృతంలో సామెత
3. కన్నడంలో నాణ్నుడి 4. తమిళంలో పళమళి

41. గురజాడ రచించిన 'కన్యక' ఏ రూపంలో ఉంటుంది ?
1. ద్విపద 2. వచన కవిత
3. ముత్యాల సరాలు 4. గద్యం

42. 'పాదాలచే నడువనిది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం ఏది ?
1. పాదంగం 2. పన్నగం
3. పాదవం 4. పాదజం

43. ఒక పద్యం లేదా పదబంధం లేదా అర్థపాదం మకుటంగా ఉండే ప్రక్రియను ఏమని అంటారు ?
1. ద్విపద 2. ప్రబంధం 3. వచన పద్యం 4. శతకం

44. 'మసిపూసి మారేడు కాయ' చేయడం అనేది ఒక ?
1. సామెత 2. జాతీయం
3. నానుడి 4. వ్యంగ్యం

45. 'తీర్థం' అనే పదానికి నానార్థాలు?
1. పుణ్య నది, ఉపాధ్యాయుడు, కాంతి 2. పుణ్యవనం, మార్గం, శిఖరం
3. పుణ్యోదకం, యజ్ఞం, శాస్త్రం 4. పుణ్యక్షేత్రం, జలం, తీరం

46. 'సవిత మంత్రసాని జలరాశియే తల్లి పాకశాసనుండు పరమగురుడు నరులనాల్కలెక్కి నర్తించి మెప్పిందు' ఈ పొడుపు కథకు అర్థం ?
1. ఉప్పు 2. వెన్న 3. సరస్వతి 4. ఎండ

47. 'అద్భుతం' అనే పదానికి వికృతి రూపం?
1. అబ్బురం 2. అదుబుతం 3. అబ్బుతం 4. అబుతం

48. 'కలాపం' అనే మాటకు నానార్థాలు ?
1. సొమ్ము, లేఖిని 2. కళ్లం, మరక
3. నెమలిపురి, గుంపు 4. అమ్ములపొది, లత్తుక

49. 'కుంచెం' అనే పదానికి సాధారణ వ్యావహారిక రూపం?
1. కొంచెం 2. సుంత 3. కుంచె 4. కుంచము

50. 'అంబుదము' అనే పదానికి పర్యాయ పదం ?
1. ఆకాశం 2. నీరు 3. పద్మం 4. మేఘం

51. ధనుస్సు అనే పదానికి పర్యాయ పదం ?
1. విరిని, కోదండం, శరాసనం 2. చాపం, కార్ముకం, సింగిణి
3. కార్ముకం, వల్లరి, ద్యుమ్నం 4. విల్లు, స్వాపతేయం, దండడి

52. 'హృదయం' అనే ప్రకృతి పదానికి వికృతి రూపం ?
1. దానం 2. దయ 3. ఎద 4. హ్రదము

53. 'పురం' అనే పదానికి సంబంధించిన నానార్థాల్లో సరైంది ఏది ?
1. సంపూర్ణం 2. పూర్వం 3. రంధ్రం 4. శరీరం

54. 'అడుగులకు మడుగులొత్తడం' అనే జాతీయానికి అర్థం ?
1. కాళ్లు కడగడం 2. తిరగబడటం
3. మిక్కిలి గౌరవించడం 4. అవమానించడం

55. 'ఏనుగుపాడి' జాతీయానికి అర్థం ?
1. ఎంతో ఎక్కువ 2. చాలా తక్కువ
3. ఏనుగు న్యాయం 4. అంతంత మాత్రం

56. 'శశ విషాణం' అనే జాతీయానికి అర్థం ?
1. చంద్రునిమీది పాషాణం 2. కుందేటి కొమ్ము
3. చంద్రుడిలో మచ్చ 4. చంద్రుడి వెన్నెల

సమాధానాలు

1. 2	2. 3	3. 3	4. 3	5. 3	6. 3
7. 3	8. 2	9. 3	10. 3	11. 2	12. 2
13. 3	14. 3	15. 3	16. 3	17. 4	18. 2
19. 2	20. 4	21. 2	22. 2	23. 4	24. 2
25. 3	26. 2	27. 4	28. 3	29. 3	30. 4
31. 2	32. 3	33. 4	34. 4	35. 4	36. 2
37. 3	38. 2	39. 3	40. 2	41. 3	42. 2
43. 4	44. 2	45. 4	46. 1	47. 1	48. 3
49. 4	50. 4	51. 2	52. 3	53. 4	54. 3
55. 1	56. 2				

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సులు

ప్రవేశాలు

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ.. 2018-19 సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో (బీఏ/ బీకామ్/ బీఎస్సీ) ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు : ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు కాని (ఫెయిలైన) వారు అర్హులు.

వయస్సు : 2018, జనవరి 1 నాటికి వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి.



ఎంపిక విధానం : ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

దరఖాస్తు రుసుం : రూ.300 (డెబిట్/క్రెడిట్ కార్డ్)/ రూ.310 (టీఎస్/ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు).

రిజిస్ట్రేషన్ చివరి తేది : ఫిబ్రవరి 28, 2018

పరీక్ష తేది : మార్చి 11, 2018

వెబ్‌సైట్ : www.braouonline.in

ఎస్వీయూలో దూర విద్య కోర్సుల్లో ప్రవేశాలు

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) దూర విద్య విభాగం.. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఓపెన్ యూనివర్సిటీ సిస్టమ్(ఓయూఎస్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు : డిగ్రీ కోర్సులకు ఇంటర్‌బీ పీజీ, పీజీ డిప్లొమా కోర్సులకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓయూఎస్‌లోని బీఏ, బీకామ్ కోర్సుల్లో చేరడానికి ఏ విద్యార్హతా లేకున్నా 18 ఏళ్లు నిండి, ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైతే చాలు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది : ఫిబ్రవరి 28, 2018

అపరాధ రుసుంతో దరఖాసు ఫీజు : రూ.500 అపరాధ రుసుంతో మార్చి 12 వరకు, రూ.1,000తో మార్చి 19 వరకు, రూ.2,000 అపరాధ రుసుంతో మార్చి 31 వరకు గడువు ఉంది.

వెబ్‌సైట్ : www.svuniversity.edu.in



Dwaraka

విశాలాంధ్ర బిజినెస్

330.45 ▲ సెన్సెక్స్ 34,413.16	100.15 ▲ నిఫ్టీ 10,576.85	-250 ▼ బంగారం (విజయవాడ) 28,550 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 28,870 ప్రొద్దుటూరు 28,600 22 క్యారట్లు, 10 గ్రాములు	-300 ▼ వెండి (విజయవాడ) 38,900 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,400 ప్రొద్దుటూరు 41,547 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.26

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	583.40	6.32
రెడ్డీ ల్యాబ్స్	2,178.95	3.18
ఎస్‌బీఐ	301.45	2.97
ఇన్ఫోసిస్	1,145.00	2.33
యాక్సిస్ బ్యాంక్	576.90	1.75

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	374.85	-0.70
ఎన్‌టీపీసీ	163.65	-0.70
ఓఎన్‌జీసీ	188.55	-0.66
అదానీపోర్ట్స్	415.00	-0.43
ఐటీసీ	276.90	-0.40

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి. ముగింపు	రూ.విలువ ప్ర. ముగింపు
డాలర్	64.12	64.26
యూరో	79.39	78.49
పౌండ్	89.34	89.83
ఆస్ట్రేలియా డాలర్	50.49	50.08
సింగపూర్ డాలర్	48.64	48.29

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,600	30,588
చెన్నై	28,580	30,566
బెంగళూరు	28,050	30,588
ముంబై	29,690	31,754
విజయవాడ	28,550	30,900
విశాఖపట్నం	28,870	31,494
ప్రొద్దుటూరు	28,600	30,030
ముడి చమురు		65.51

మేధోసంపత్తిలో మనది వెనుకడుగే!



వాషింగ్టన్: ప్రపంచ దేశాలతో పోలిస్తే మేధో సంపత్తిలో భారత్ ఇంకా వెనుకబడే ఉంది. అంతర్జాతీయ మేధో సంపత్తి సూచీని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ తాజాగా విడుదల చేసింది. మొత్తం 50 దేశాలతో ఈ జాబితాను తయారుచేయగా.. ఇందులో భారత్ అట్టడుగున 44వ స్థానంలో ఉంది. అయితే గతేడాదితో పోలిస్తే భారత్ స్కోరు కాస్త మెరుగుపడింది. గతేడాది 45 దేశాలతో జాబితాను రూపొందించగా.. అందులో భారత్ 43వ స్థానంలో ఉండటం గమనార్హం. 2017లో భారత స్కోరు 8.4 పాయింట్లు కాగా.. ఇప్పుడు అది 12.03పాయింట్లకు పెరిగింది. ఇక 37.98 పాయింట్లతో ఈ జాబితాలో అమెరికా తొలిస్థానంలో ఉంది. రెండో స్థానంలో యూకే(37.97 పాయింట్లు), మూడో స్థానంలో స్వీడన్(37.03 పాయింట్లు) ఉన్నాయి. కంప్యూటర్ ద్వారా చేసే ఆవిష్కరణల్లో సానుకూల సంస్కరణలు తీసుకురావడంతో పాటు మేధో సంపత్తిపై అవగాహన సదస్సులు నిర్వహించడం, సాంకేతికంగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం వల్ల భారత స్కోరు మెరుగుపడిందని నివేదిక చెబుతోంది. అయితే భవిష్యత్‌లో ఇలాంటివి భారత్ మరిన్ని చేయాల్సిన అవసరముందని పేర్కొంది. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లోని గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్(జీఐపీసీ) ఈ జాబితాను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని సృజనాత్మక అభివృద్ధి, ట్రేడ్ మార్క్, కాపీరైట్, వాణిజ్య రంగ భద్రత తదితర 40 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను తయారుచేశారు.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

330 పాయింట్ల లాభంలో సెన్సెక్స్

లాభాల్లో ఐటి,ఫార్మా, రియాల్టీ షేర్లు



న్యూఢిల్లీ: వరుసగా ఏడు సెషన్లనుండి 2000 పాయింట్లు నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి. డొమెస్టిక్ ఫండ్స్ వరుస కొనుగోళ్లు, రూపాయి పుంజుకోవడంతో ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిసాయి. ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్నట్టు ప్రకటించడంతో గురువారం రియాల్టీ, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ సహా బ్యాంకింగ్ స్టాక్‌లు దూసుకెళ్లాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే దాదాపు 450 పాయింట్ల మేర ఎగిసిన సెన్సెక్స్... ట్రేడింగ్ ముగిసే సమయానికి కొద్దిగా నెమ్మదించి 330.45 పాయింట్ల లాభంతో 34,413.16 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 100.15 పాయింట్ల లాభంతో (0.95 శాతం) మేర లాభపడి 10,576.85 వద్ద నిలిచింది. మధ్యాహ్న ట్రేడింగ్ నుండి సెన్సెక్స్ లాభాల్లో పయనించింది. ఒకానొకదశలో 482 పాయింట్లు దాటింది. మరోవైపు బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఆరువారాల కనిష్టానికి దిగజారి బ్యారెల్ 65.16 డాలర్లకు చేరింది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమేనని చెప్ప వచ్చు. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పులేదని ప్రకటించడంతో గత సెషన్‌లో ఇండెక్స్ 113.23 పాయింట్లు నష్టపోయింది. విదేశీ మదుపరులు రూ.1022.50 కోట్ల విలువగల షేర్లను కొనుగోలు చేయగా దేశీయ మదుపరులు రూ.461.19కోట్లు షేర్లనుకొనుగోలు చేసినట్లు నమోదైంది. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు ఇతర ఆసియా మార్కెట్లలో మిశ్రమ ధోరణి మార్కెట్‌ను మెరుగుపరచింది. బీఎస్ఇ స్మాల్‌కాప్, మిడ్‌కాప్ సూచీలు 2.33శాతం పెరిగాయి. బిఎస్‌ఇ ట్రేడింగ్‌లో సెక్టరల్ సూచీలు విస్తృతంగా లాభపడ్డాయి. రియాల్టీ, ఐటి, బ్యాంకింగ్, ఆటో, ఫార్మా స్టాక్స్ 3.11శాతం లాభాల్లో ముగిసాయి. ప్రధాన లబ్ధిదారులుగా డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్, టీసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్, హింద్ యూనిలివర్, ఎల్‌అండ్‌టి, మారుతి సుజుకి, ఎమ్‌అండ్‌ఎమ్, ఆర్‌ఐఎల్, 3.57 శాతం లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంకు, పిఎన్‌బి,ఫెడరల్ బ్యాంకు, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యస్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు 2.70 శాతం పెరిగాయి. సిప్లా షేర్లు 6.85 శాతం పెరిగాయి. దేశీయ నాలుగవ అతిపెద్ద డ్రగ్‌మేకర్ అయిన సిప్లా త్రైమాసిక లాభాలు 7శాతం నమోదు చేసాయి. దేశవాళీ సంస్థాగత మదుపరులు కొనుగోళ్లకు పోటీపడడంతో పాటు... ఆసియా మార్కెట్లలో కొనసాగుతున్న జోరు, మార్కెట్ సెంటిమెంటుకు ఊపునిచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.


అంతర్జాతీయ మార్కెట్లు: టోక్యో నిక్కీ 225 ఇండెక్స్ 1.1శాతం పెరిగి 21,890.86 వద్ద ముగిసింది. కానీ బెంచ్‌మార్కుకి మాత్రం 4శాతం తక్కువగానే ఉంది. దక్షిణ కొరియా కాస్పి 0.5శాతం లాభపడి 2407.62 వద్ద నమోదైంది. హాంగ్ కాంగ్ హాంగ్‌సాంగ్ సూచీ 0.4శాతం పెరిగి 30,451.27 వద్ద నమోదైంది. షాంఘై కాంపోజిట్ సూచీ 1.4శాతం తగ్గి 3262.05 వద్ద నమోదైంది. ఆస్ట్రేలియా ఎస్ అండ్ పి 200 0.2శాతంతో 5890.70 వద్ద నమోదైంది. తైవాన్ స్టాక్స్ మరింతతగ్గి తూర్పు దక్షిణాసియా మార్కెట్లు మిశ్రమ ఫలితాలను నమోదు చేశాయి. యూరోపియన్ మార్కెట్లు ప్రారంభంలో నిదానంగా ప్రారంభమైనా బ్రిటన్ ఎఫ్‌టిఎస్ఇ 0.5శాతం నష్టంతో 7243.02 వద్ద ముగిసింది. ఫ్రాన్స్ సిఏసి-40 0.3శాతంతో 5238.50 మార్కుల వద్ద నమోదైంది. జర్మనీ డిఏఎక్స్ 0.7శాతం తగ్గి 12,506.55 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పి ఫ్యూచర్స్ 0.2శాతం, డౌ ఫ్యూచర్స్ 0.3శాతం పెరిగాయి.

విజ్ఞానం



భూమికి సమీపంలో ఆస్టరాయిడ్స్..!

శుక్రవారం భూమికి సమీపంలో ఆస్టరాయిడ్స్ (చిన్న గ్రహ శకలాలు) పయనించనున్నాయి. ఇవి భూమికి 64,000 కిలోమీటర్ల దూరంలో పయనిస్తాయని నాసా వెల్లడించింది. 15 నుండి 30 మీటర్ల సైజులో ఉన్న గ్రహ శకలాలను ఆస్టరాయిడ్ 2018సిబి భూమికి సుమారు శనివారం తెల్లవారుజాము సుమారు 4గంటల సమయంలో పయనించడం జరుగుతుంది. వీటి పరిమాణం చిన్నవైనప్పటికీ 2013లో రష్యాలో చెలియబిన్స్క్ వద్ద వాతావరణంలో కనిపించిన ఆస్టరాయిడ్స్‌కన్నా పెద్దవేనని చెప్పవచ్చునని నాసా శాస్త్రవేత్త పాల్ చోడాస్ వెల్లడించారు. ఇటువంటి ఆస్టరాయిడ్స్ మన గ్రహానికి చేరువలోకి సాధారణంగా రావు. అతి అరుదుగా ఏడాదికి ఒకసారి రావచ్చునని తెలుస్తోంది. ఈ ఆస్టరాయిడ్‌ను ఫిబ్రవరి4న నాసా-అరిజానాలోని కెటలినా స్కై సర్వే ఆస్ట్రోనమర్ వెల్లడించారు.



ఎలక్ట్రిక్ పల్స్‌తో మెదడుకు పదును

మెదడుకు ఎలక్ట్రిక్ పల్సస్ పంపడం ద్వారా 15శాతం జ్ఞాపకశక్తిని మెరుగుపరచవచ్చునని అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ వెల్లడించింది. మెదడుకు సంకేతాలను ఎలక్ట్రిక్ ఇంపల్స్ ద్వారా మెదడు పనితీరును మెరుగుపరచవచ్చునని తెలుస్తోంది. మెదడు లోని ఎడమభాగం జ్ఞాపకశక్తికి, నూతన విషయాలు నేర్చుకునేందుకు కేంద్రగా ఉంటుంది. దీనికి పరిమితి సమయంలో ఎలక్ట్రిక్ స్టిమ్యులేషన్ కలిగించడం ద్వారా 15శాతం సంబంధిత మెదడు పనితీరును మెరుగుపరచుకోవచ్చునని శాస్త్రజ్ఞులు వెల్లడించారు. 25 మంది న్యూరోసర్జికల్ రోగులపై ఎపిలెప్సి చికిత్సలో భాగంగా లెఫ్ట్ టెంపొరల్ కార్టెక్స్‌ను ప్రేరణచేయడంతో మెదడులోని 15శాతం మెరుగుపడినట్లు గ్రహించారు.



బంగారం, వెండి ధరల్లో భారీ తగ్గింపు

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. బంగారం ధరలు గురువారం ఏకంగా రూ.600 తగ్గి 10గ్రాములు బంగారం ధర మూడు వారాల కనిష్టానికి దిగజారి రూ.30,950లు పలికింది. అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ తగ్గడం స్థానిక ఆభరణాల వర్తకుల నుండి డిమాండ్ తగ్గడం ప్రధాన కారణంగా ఉంది. వెండి ధర కూడా రూ.450లు తగ్గి కేజీ వెండి 39వేల మార్కుకు దిగువన నమోదై రూ.38,900 పలికింది. అమెరికా వడ్డీరేట్లు పెంపు అంచనాలతో విలువైన లోహాల ధరలు నాలుగు వారాల కనిష్టానికి దిగజారాయి. అంతర్జాతీయంగా బంగారం ధర 0.61శాతం తగ్గి ఔన్స్ 1310.10 డాలర్లుకు చేరింది. వెండి 0.37 శాతం తగ్గి ఔన్స్ 16.28 డాలర్లకు చేరింది.

లాభాల్లో ఫార్మా షేర్లు

న్యూఢిల్లీ: ఫార్మా కంపెనీల షేర్లు గురువారం గణనీయంగా పెరిగాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 4శాతం లాభాన్ని నమోదు చేసింది. సిప్లా,కాడిలా, హెల్త్‌కేర్ షేర్లు డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో లాభాలనమోదుచేశాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 3.6శాతం లాభంతో సెక్టరల్ సూచీల్లో ప్రధాన లబ్ధిదారుగా నమోదైంది. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్‌లో సిప్లా, సన్ ఫార్మా ఇండస్ట్రీస్ 5శాతం కన్నా ఎక్కువ లబ్ధిపొందాయి. కేడిలా హెల్త్‌కేర్ డాక్టర్ రెడ్డీస్,దివీస్ నేషనల్ స్టాక్ ఎక్స్‌చేంజిలో 2 నుండి 4శాతం లాభాన్ని నమోదుచేశాయి. నాన్ ఇండెక్స్ స్టాక్స్‌లో ఎఫ్‌డిసి, మార్‌పెన్ లాబ్స్ 10శాతం కన్నా ఎక్కువగానే ర్యాలీ నమోదు చేశాయి. బిఎస్ఇలో సన్‌ఫార్మా అడ్వాన్స్‌డ్ రీసెర్చి కంపెనీ, హెస్టర్ బయోసైన్సెస్, హికాల్, అజంతాఫార్మా, బయోకాన్, ఇప్కా లాబ్స్ 4 నుండి 7శాతం లాభపడ్డాయి.

భారత్‌లో తొలి 'ఓలా' పడవ!

గౌహతి: యాప్ ఆధారిత ట్యాక్సీ సేవల సంస్థ ఓలా భారత్‌లో తొలిసారి పడవ సర్వీసును ప్రారంభించింది. అసోం రాజధాని గౌహతి నగరంలో ఈ ఓలా పడవ ప్రారంభమైంది. నగరంలో ఫ్యాన్సీ బజార్ మార్కెట్ ప్రాంతం లోని లచిత్ ఘాట్ నుంచి గువహటి అంత ర్జాతీయ విమానాశ్రయానికి ఓలా 'రివర్ ట్యాక్సీ' సర్వీసును ప్రారంభించింది. ఈ మార్గంలో విమానాశ్రయానికి పడవలో పదిహేను నిమిషాల సమయం పడుతుంది. రాష్ట్ర ముఖ్య మంత్రి సోనోవాల్ పడవ సర్వీసును ప్రారం భించి అందులో ప్రయాణించారు. మెషీన్‌తో నడిచే బోట్లను ఇందుకోసం ఉపయోగిస్తు న్నారు. గంటకు 30కిలోమీటర్ల వేగంతో వెళ్తా యి. వర్షాకాలంలో ఓలా ఈ పడవ సేవలను నిలిపేస్తుంది. అలాగే మచ్‌కోవా ఘాట్ నుంచి గువహటి ఉత్తర ప్రాంతానికి ఓలా హైస్పీడ్ బోట్లను నడపనుంది. దీంతో ప్రయాణ సమయం బాగా తగ్గనుంది. స్టీమ్ బోట్లలో 45 నిమిషాలు పడుతుండగా హైస్పీడ్ బోట్‌లో పది నిమిషాలు పడుతుంది. ఇటీవల అసోం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో రాష్ట్ర రవాణా మంత్రి చంద్రమోహన్ పటోవారీ, ఓలా ఆపరేషనల్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ ఘుడ్గే రివర్ ట్యాక్సీ సేవల ఒప్పందంపై సంతకం చేశారు.

దేశీయ తొలి ఎలక్ట్రిక్ సూపర్ బైక్!

● స్పీడు గంటకు 200 కిలోమీటర్లు ● ధర రూ.5.5లక్షల నుంచి రూ. 6లక్షలు



గ్రేటర్ నొయిడా: భారత వాహన ప్రదర్శన (ఆటో ఎక్స్‌పో 2018) ప్రీ ఓపెన్ ఈవెంట్ అట్టహాసంగా సాగుతోంది. దేశ విదేశాలకు చెందిన ఆటోమొబైల్ సంస్థలు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా బెంగళూరుకు చెందిన స్టార్టప్ కంపెనీ ఎమ్‌ఫ్లక్స్ మోటార్స్ దేశంలోనే తొలి ఎలక్ట్రిక్ సూపర్‌బైక్‌ను ఆవిష్కరించింది. ఎమ్‌ఫ్లక్స్ వన్ పేరుతో ఈ బైక్‌ను రూపొందించింది. గంటకు 200 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ఈ బైక్ ప్రయాణిస్తుంది. త్వరలోనే దీన్ని మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జులైలో ఈ సూపర్‌బైక్ ప్రీఆర్డర్లు ప్రారంభం కానున్నాయి. 2019 ఏప్రిల్ నుంచి తొలి డెలివరీని మొదలు పెట్టనున్నారు. దీని ధర రూ.5.5లక్షల నుంచి రూ. 6లక్షల వరకూ ఉండదనుందట. ఈ బైక్‌లను ఆన్‌లైన్ ద్వారానే విక్రయించనున్నట్లు సంస్థ ఈ సందర్భంగా పేర్కొంది. అంతేగాక.. పేమెంట్‌ను కూడా డిజిటల్‌గానే స్వీకరిస్తుందట. త్వరలోనే ఎమ్‌ఫ్లక్స్ టు బైక్‌ను విడుదల చేసేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. 2018 ఆటో ఎక్స్‌పో ప్రీ ఓపెన్ ఈవెంట్ బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రీ ఓపెన్‌లో మీడియా, వాణిజ్య ప్రముఖులను మాత్రమే ప్రదర్శనకు అనుమతిస్తారు. రేపటి నుంచి పూర్తి స్థాయిలో మొదలవుతుంది.

ఈ నెల 14 వరకు ప్రజల సందర్శనకు అనుమతి స్తారు. ఇప్పటికే మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రా లాంటి దేశీయ కంపెనీలతో పాటు, కియా మోటార్స్, బెంజ్, టయోటా, కవాసకీ లాంటి విదేశీ సంస్థలు కూడా కొత్తకొత్త మోడళ్లను ఇక్కడ ప్రదర్శనకు ఉంచాయి.

జీఎస్టీ ఎగవేతలు 6 కోట్లు!



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం ఐదు నెలల వ్యవధిలోనే 16 కేసుల్లో దాదాపు రూ.6 కోట్ల జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) ఎగవేతలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఒకే విధమైన పన్నుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్థానిక పన్నులు, ఎక్సైజ్, సేవా పన్నులు సహా దజనుకు పైగా పన్నులను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి గత ఏడాది జూలై 1వ తేదీ నుంచి జీఎస్టీని అమల్లోకి తెచ్చిన విషయం విదితమే. అయితే 2017 జూలై నుంచి నవంబర్ మధ్య 16 కేసుల్లో రూ.5.70 కోట్ల జీఎస్టీ ఎగవేతలు జరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి మంగళవారం రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. అలాగే 2017 ఏప్రిల్-డిసెంబర్ మధ్య మొత్తం 2,938 కేసుల్లో రూ.9,660 కోట్ల సేవా పన్ను ఎగవేతలు, 614 కేసుల్లో రూ.7,242 కోట్ల సెంట్రల్ ఎక్సైజ్ పన్ను ఎగవేతలు, 26,969 కేసుల్లో రూ.3,987 కోట్ల కస్టమ్స్ సుంకం ఎగవేతలు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించిందని ఆయన వెల్లడిస్తూ.. పన్ను ఎగవేతదారులపై సంబంధిత విభాగం తగిన చర్యలు చేపడుతుందని చెప్పారు.

884 కంపెనీలపై దర్యాప్తు

ఇదిలావుంటే, మనీ లాండరింగ్‌కు సంబంధించిన వేర్వేరు కేసుల్లో దాదాపు 884 కంపెనీలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారని, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) చట్టం కింద చేపట్టిన దర్యాప్తులో భాగంగా రూ.5,066 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేయడం జరిగిందని చౌదరి వెల్లడించారు. అయితే మనీ లాండరింగ్ అభియోగాలతో ఇప్పటివరకూ దేశంలో ఒక్క కంపెనీ రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు (డీరిజిస్టర్) చేయలేదని ఆయన రాజ్యసభకు తెలిపారు.



ఎన్‌ఆర్ గ్రూప్ మీట్ అండ్ గ్రీట్‌లో బిగ్‌బీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఎన్‌ఆర్ గ్రూప్ అగర్బత్తి బ్రాండ్ సైకిల్ ప్యూర్, తన కస్టమర్ల కోసం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్‌లో అమితాబ్ బచ్చన్ పాల్గొన్నారు. ఎన్‌ఆర్ గ్రూప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న అయన ముంబైలో జరిగిన 'మీట్ ది లెజండ్' కార్యక్రమంలో తన అభిమానులను పలకరించారు. గతేడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు సంస్థ నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 550 మంది విజేతలకు బిగ్‌బీని కలిసే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాన్ని తమ ట్రేడ్ పార్టనర్ల కోసం సైకిల్ ప్యూర్ అగర్బత్తి నిర్వహించింది.

రూ.525కోట్లు చెల్లించాలని ఫ్యాబ్ ఇండియాపై కేసు

ఢిల్లీ: అక్రమంగా తమ ట్రేడ్‌మార్క్ చరఖాను ఉపయోగించుకుంటున్నారని, దుస్తులను ఖాదీ ట్యాగ్‌తో అమ్ముతున్నారని ఆరోపిస్తూ ఖాదీ, గ్రామ వ్యాపార కమిషన్(కేవీఐసీ) ఫ్యాబ్ ఇండియాకు నోటీసులు పంపించింది. నష్టపరిహారంగా రూ.525కోట్లు చెల్లించాలని ఖాదీ కమిషన్ డిమాండ్ చేసింది. తమ ట్రేడ్ మార్క్ మాదిరిగా ఉన్న చిహ్నాన్ని ప్రదర్శించడం ఆపకపోతే చట్టపరంగా చర్యలు ప్రారంభిస్తామని ఖాదీ కమిషన్ లీగల్ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఫ్యాబ్ ఇండియా తమకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, చరఖా ప్రదర్శించడాన్ని ఆపేయాలని, అలాగే ఖాదీ ట్రేడ్‌మార్క్‌తో ఏవీ అమ్మకూడదని, ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని డిమాండ్ చేసింది. కాగా ఖాదీ కమిషన్ ఆరోపణలను ఫ్యాబ్ ఇండియా అధికార ప్రతినిధి కొట్టిపడేశారు. ఇవి ఆధారంలేని ఆరోపణలని పేర్కొన్నారు. చట్టపరంగా ముందుకెళ్తే తమను తాము కాపాడుకోగలమని వెల్లడించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ మంత్రిత్వ శాఖ కింద ఉన్న ఖాదీ కమిషన్ ఏడు రోజుల్లోగా ఫ్యాబ్ ఇండియా నుంచి సమాధానం కోరుతూ జనవరి 29న నోటీసులు పంపించింది.


'త్వరలో బిట్‌కాయిన్ విలువ జీరో'



ముంబై: బిట్‌కాయిన్ విలువ త్వరలో సున్నాకు చేరుకుంటుందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాచస్ పరిశోధన విభాగం అధిపతి స్టీవ్ స్ట్రాంగిన్ తెలిపారు. క్రిప్టోకరెన్సీలు విలువ కోల్పోవడం వల్ల దాదాపు 500 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైపోతుందని అన్నారు. ప్రస్తుత రూపంలో ఉన్న డిజిటల్ కరెన్సీలు బతికి బట్టకట్టడం కష్టమని ఆయన అభిప్రాయ పడ్డారు. వీటికి ప్రత్యామ్నాయాలు వచ్చిన వెంటనే క్రిప్టోకరెన్సీలు కనుమరుగై పోతాయని అన్నారు. క్రిప్టోకరెన్సీల అదృశ్యానికి కచ్చితంగా గడువు చెప్పలేమని స్టీవ్ పేర్కొన్నారు. అకారణంగా పెరిగిన విలువను ఇప్పుడు కోల్పోతున్నాయని అన్నారు. అన్ని రకాల క్రిప్టోకరెన్సీలు ఒకే రకంగా విలువ కోల్పోతుండటం ఆందోళనకరమన్నారు. ఇవన్నీ పూర్తిగా విలువ కోల్పోయే దిశగా అడుగులు వేస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న క్రిప్టోకరెన్సీలు దీర్ఘకాలం మన్నే సామర్థ్యం లేదన్నారు. ట్రాన్సాక్షన్స్ నెమ్మదిగా నడవడం, నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉండటం, భద్రతాపరమైన సవాళ్లు పెరిగిపోవడం వీటికి సమస్యగా మారిందని అన్నారు. ఒక వేళ వీటి విలువ మళ్ల పుంజుకొని పెరిగినా గత వైభవం మాత్రం దక్కదని అన్నారు. ప్రస్తుతం ఉన్న బుడగ బయటపడటానికి ఈ పెరుగుదల ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ 15 కంపెనీలకు

హెచ్1బీ వీసాలు రద్దు!



వాషింగ్టన్: హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసు కోవడానికి వీల్లేని 15 సంస్థలను పేర్లను విడుదల చేసింది అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్. ఈ లిస్ట్‌ను ఇండియాతోపాటు ప్రపం చంలోని చాలా దేశాలు జాగ్రత్తగా పరిశీలిస్తాయి. కావాలని ఉల్లంఘనలకు పాల్పడిన కంపెనీలుగా అమెరికా వీటిని గుర్తించింది. ఈ కంపెనీలపై ఇప్పుడు విచారణ జరుపుతారు. విదేశీ ఉద్యోగులను తీసుకునే క్రమంలో కావాలని నిబంధనలు ఉల్లంఘించడం లేదా వివరాలు తప్పుగా సమర్పించిన కంపెనీలను ఈ జాబితాలో ఉంచుతామని అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. హెచ్ -1బీ అనేది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా. దీని కింద ప్రత్యేక నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగులను అమెరికా కంపెనీలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఏటా లాటరీ పద్ధతిలో 65 వేల వరకూ హెచ్-1బీ వీసాలను జారీ చేస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్-1బీ వీసాల జారీపై ఎన్నో ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే.

ఆ 15 కంపెనీలు ఇవే..

1. ఏజెల్ టెక్నాలజీస్, న్యూజెర్సీ
2. అమికా టెక్నాలజీ, కెంట్, వాషింగ్టన్
3. క్లిన్నార్ ఎల్ఎల్‌సీ, షికాగో, ఇలినాయిస్
4. డెల్టా సెర్చ్ ల్యాబ్స్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్
5. ఫోస్కామ్ డిజిటల్, హూస్టన్, టెక్సాస్
6. జీ హెల్త్‌కేర్ ఎల్ఎల్‌సీ, శాన్ జోస్, కాలిఫోర్నియా
7. ఇన్‌కాన్ కార్పొరేషన్, సన్నీవేల్, కాలిఫోర్నియా
8. మాక్రో నెట్‌వర్క్స్, న్యూఆర్క్, కాలిఫోర్నియా
9. ఎండీ2 సిస్టమ్స్, వర్జీనియా
10. నిషె సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, హూస్టన్, టెక్సాస్
11. నార్తర్న్ కాలిఫోర్నియా యూనివర్సల్ ఎంటర్‌ప్రైజ్ కార్పొరేషన్, శాన్ జోస్, కాలిఫోర్నియా
12. ఎన్‌వైసీ హెల్త్‌కేర్ స్టాఫింగ్, న్యూయార్క్
13. రీడ్‌స్ట్రా డైరీ లిమిటెడ్, మెన్‌డాన్, మిషిగాన్
14. టెలవా నెట్‌వర్క్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా
15. టెక్‌వైజ్ సొల్యూషన్స్, జెర్సీ సిటీ, న్యూజెర్సీ

Dwaraka

టీవీఎస్ నుంచి

స్మార్ట్ స్కూటర్ ఎన్‌టార్క్!

హైదరాబాద్: దేశీయ వాహన తయారీ సంస్థ టీవీఎస్ భారతవిపణిలోకి మరో సరికొత్త స్కూటర్‌ను ప్రవేశపెట్టింది. ఎన్‌టార్క్ 125 పేరుతో తీసు వచ్చిన ఈ ద్విచక్ర వాహనం ధర రూ.58,790(ఎక్స్ షోరూమ్ న్యూఢిల్లీ). 2016 ఆటోఎక్స్‌పోలో ఈ కాన్సెప్ట్‌తో స్కూటర్‌ను విడుదల చేస్తు న్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. జనరేషన్ జెడ్ లక్ష్యంగా దీనిని తీసుకు వచ్చింది. మరీ ముఖ్యంగా 18-24 ఏళ్ల యువతను ఎన్‌టార్క్ విశేషంగా ఆకట్టుకుంటుందని చెబుతోంది. స్మార్ట్ కనెక్ట్‌గా పేర్కొంటున్న ఎన్‌టార్క్‌ను బ్లూటూత్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు ఎన్‌టార్క్ మొబైల్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా దీనికి కనెక్ట్ కావచ్చు. ఇక 124.79సీసీ సామర్థ్యం కలిగిన ఇంజిన్.. సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్, 3 వాల్వ్ ఎయిర్‌కూల్డ్ ప్రత్యేకతలను కలిగి ఉంది. 7,500 ఆర్‌పీఎం వద్ద 9.3 బీహెచ్‌పీ శక్తి, 10.5 టార్క్‌ను విడుదల చేస్తుంది. గంటకు 95 కి.మీ. వేగంతో ప్రయాణించవచ్చు. దీనికి డిజిటల్ స్పీడో మీటర్‌ను అమర్చారు.


సరైన పదాన్ని కనుక్కోండి



thumb
rabbit
binder
recycle
rainbow
cricket
teacher
sandals

s	r	e	h	c	a	e	t	i
v	b	m	v	y	w	p	m	u
w	e	l	c	y	c	e	r	a
o	p	b	m	u	h	t	v	k
b	t	e	k	c	i	r	c	t
n	u	v	t	i	b	b	a	r
i	u	l	e	t	i	n	k	q
a	s	l	a	d	n	a	s	q
r	v	k	b	i	n	d	e	r

తిరుగుబాటు



కుంతలరాజు విక్రమసేనునకు రాజ్యకాంక్ష ఎక్కువ. చిన్నచిన్న రాజ్యాలను జయించి తన రాజ్యంలో కలుపుకుని ఆధిపత్యం చలాయించేవాడు. ఆ రాజులను తన క్రింద సామంతులుగా చేసుకుని పరిపాలన చేసేవాడు. తను జయించిన రాజ్యాలకు చెందిన ప్రజలను ఎంతగానో బాధలకు గురిచేసేవాడు.

ఒకసారి విక్రమసేనుడు మాళవరాజ్యంపై దండెత్తి ఆ రాజును ఓడించి మాళవ రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. రాజును చెరసాలలో బంధించి తను సింహాసనాన్ని అధిష్టించి పరిపాలించసాగాడు. ప్రతీ వస్తువుపైనా పన్నులు విధించి పన్నులు చెల్లించలేని వారినందరినీ చెరసాలలో బంధించి వారిచేత వెట్టిచాకిరీ చేయించేవాడు, ఆ వెట్టి చాకిరీ చేయలేక చాలామంది ప్రాణాలు కోల్పోయేవారు.

ఈ వెట్టిచాకిరీ నుండి తమను ఎవరు బయటపడేస్తారా అని బందీలు ఎదురుచూడసాగారు. ఒకరోజున ప్రసేనుడు అనే వ్యక్తి పన్నులు కట్టలేక ఖైదీగా వారి మధ్యకు వచ్చాడు. ప్రసేనుడికి తెలివితేటలు ఎక్కువ. అతని మాటల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న తోటి ఖైదీలు ప్రసేనునకు తమ బాధలను చెప్పుకుని తమ వెట్టి ఎలా రద్దు అవుతుందో చెప్పమన్నారు. 'మీరు ఒక్కొక్కరు ఒక్కో బంగారునాణెం నాకిస్తే ఉపాయం చెబుతాను' అన్నాడు. వెట్టి చేసేవాళ్ళకి బంగారు నాణాలు ఎలా వస్తాయి? అయినాసరే అందరూ కలిసి కష్టపడి ఏదోలా బంగారునాణాలను సేకరించి ప్రసేనునకు ఇచ్చారు. ప్రసేనుడు ఆ బంగారునాణాలను తీసుకుని వారికి ఏ ఉపాయం చెప్పలేదు. దీంతో ఆగ్రహించిన వాళ్ళంతా వెట్టి నుండి బయటపడే ఉపాయం చెబుతానని మా అందరి దగ్గర బంగారు నాణాలను తీసుకున్నావు కదా. ఆ ఉపాయం ఏమిటో చెప్పు అంటూ నిలదీశారు.

ప్రసేనుడు వారితో నాకు ఏ ఉపాయం తెలీదు ఈ విధంగా చెప్పి మీ దగ్గర నుండి వసూలు చేసిన బంగారు నాణాలను నేను కట్టవలసిన పన్ను చెల్లించి ఈ చెరసాల నుండి బయటపడతాను అన్నాడు. ప్రసేనుని మాటలు వినగానే అందరికీ విపరీతమైన కోపం వచ్చింది. అందరూ ఒక్కసారిగా ప్రసేనునిపై తిరగబడ్డారు. అప్పుడు ప్రసేనుడు వారిని వారించి 'మీరిప్పుడు ఏం చేశారో అదేవిధంగా రాజుపై తిరగబడండి, మీవెట్టి తొలిగిపోతుంది' అన్నాడు.

అంతే, బందీలందరూ రాజుపై తిరుగుబాటు చేశారు. ఒక్కుమ్మడిగా తిరుగుబాటు చేయడంతో రాజు రహస్యమార్గం గుండా పారిపోయాడు. స్వార్థం, రాజ్యకాంక్ష ఎలాంటి చిక్కులను తెచ్చిపెడుతుందో స్వయంగా తెలుసుకున్న రాజు ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చేయకూడదనుకున్నారు. బందీగా ఉన్న మాళవరాజును ప్రజలే విడిపించారు. ఎప్పటివలే మాళవరాజు జనరంజకంగా పరిపాలన చేశాడు.

- ఎం. సోమశేఖరాచార్యులు

గోల్కొండ కోట

హైదరాబాద్‌కు పశ్చిమంగా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చారిత్రక దుర్గం గోల్కొండ. 1518-1687 మధ్య ఈ ప్రాంతాన్ని ఏలిన కుతుబ్‌షాహీ రాజవంశీయులకు రాజప్రాసాదంగా ఉపయోగపడిన ఈ కోట గ్రానైట్ రాతి నిర్మాణం. కోట చుట్టుకొలత 11కిలోమీటర్లు, 8 ద్వారాలు, 70 బురుజులు ఉండి, ఎత్తయిన కొండపై రాజమహల్ ఉంది. ఈ కోట నిర్మాణంలో ఇమిడి ఉన్న ప్రతిధ్వని సూత్రం విశిష్టమైంది. కింద ప్రధాన గోపుర ద్వారం వద్ద నిలబడి చప్పట్లు కొడితే అవి సుమారు 60 మీటర్ల ఎత్తున ఉన్న రాజమహల్లోకి వినబడతాయి. అక్కడక్కడ ధ్వనితరంగాల్ని గ్రహించి మరలా ప్రతిధ్వనించే సున్నిత స్ఫటికాలు పొదిగినట్లు చెబుతారు. మట్టి గొట్టాల ద్వారా పర్షియన్ చక్రాలు ఉపయోగించి నీటిని రాజమహల్‌కు ఎత్తిపోస్తూ శీతలీకరణం(ఎయిర్ కండీషనింగ్) కూడా ఏర్పాటు చేశారు. రామదాసును తానీషా బంధించి ఉంచిన బందిఖానాను భక్తులైన యాత్రికులు ఎక్కువగా దర్శించుకుంటారు.





ప్రప్రథమం

మోటారు సైకిల్‌ను మొట్టమొదటిసారిగా 1885లో జర్మనీకి చెందిన గాటివిచ్ డీమ్లర్ అనే ఆయన రూపొందించాడు. ఆ తర్వాత క్రమంగా మార్పులు చెందుతూ నేటి రూపు తీసుకుంది.

గోడకు చెవుడు



నాన్న.. గోడకు చెవుడు రాదా!?

గోడకు చెవుడు ఎందుకు వస్తుందిరా.. ఇదేమి ప్రశ్న అని విసుక్కున్నాడు తండ్రి.

కాదు నాన్న.. అమ్మ గోడకు చెవులుంటాయని అంటుంది గదా!

వివేకవంతులకు జీవితం ఒక పండగలాంటిది.


- ఎమర్సన్



చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



కార్తీక చిత్ర టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు వి వి వినాయక్



బేబీ అవంతిక ఆర్ట్స్ సమర్పణలో నిర్మాత మచెందర్ నట్టాల నిర్మిస్తున్న చిత్రం కార్తీక. విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రియాంక శర్మ, సింధు హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను వి వి వినాయక్ చేతుల మీదుగా ఇటీవలే విడుదలై ప్రశంసలు అందుకుంటోన్న సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ సుభాష్ ఆనంద్, లిరిక్స్ రైటర్ హరీష్ రావు, కో ప్రొడ్యూసర్ వంశిధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాత మచెందార్ మాట్లాడుతూ మా ఈ కార్తీక చిత్ర టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు వినాయక్ గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నా... సుభాష్ మ్యూజిక్ అద్భుతంగా అందించారు.. సినిమా కోసం అందరూ కష్టపడ్డారు.. బాగొచ్చింది. త్వరలో ఆడియో వేడుకతో ప్రేక్షకుల ముందుకు వస్తాము.. అని తెలిపారు.. డైరెక్టర్ కొత్త పరశురాం మాట్లాడుతూ వినాయక్ గారి సపోర్టును మరవలేను. టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది.. కెమెరా, డైలాగ్స్, మ్యూజిక్ ఇలా అన్నీ బాగొచ్చాయి.. చెప్పిన కథ చెప్పినట్టుగా చేసాను..కొత్త డైరెక్టర్ అని కాకుండా అందరూ బాగా సపోర్ట్ చేశారు నాకు.. నిర్మాత అయితే నాకేం కావాలో అది ఇచ్చి ప్రోత్సహించారు.. ఈ చిత్రంలో ప్రధానంగా ఒక చిన్న పిల్ల పాత్ర ఉంటుంది. బేబీ వెన్నెల అద్భుతంగా నటించింది. ఆమెకు అవార్డ్ కూడా వచ్చే అవకాశం ఉంది. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేస్తున్నా అన్నారు... ఇక హీరోయిన్ ప్రియాంక మాట్లాడుతూ అవకాశం ఇచ్చినందుకు దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. నన్ను చాలా బాగా చూసుకున్నారు... సినిమాలో పనిచేసిన వారందరికీ తప్పకుండా మంచి పేరు వస్తుందని నమ్ముతున్నా అన్నారు.. హీరో విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సినిమా చాలా బాగొచ్చింది... ముఖ్యంగా బేబీ వెన్నెల హైలెట్ అవుతుంది. ఇందులో ఉన్న 4సాంగ్స్ అందరినీ అలరిస్తాయి.. నటీనటులందరికీ మంచి పేరొచ్చే సినిమా అవుతుందని ఆశిస్తున్నా అన్నారు.

ఎ విజయ భాస్కరెడ్డి, ప్రియాంక శర్మ, సింధు, బేబీ వెన్నెల, అజయ్ ఘోష్, రోలర్ రఘు తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ-స్క్రీన్ ప్లే-డైరెక్షన్ : కొత్త పరశురాం, డైలాగ్స్ : చింత శ్రీను, డి ఓ పి: వాలి ఎస్ కె. యాక్షన్ : దేవరాజ్ నూనె, నందు, రియల్ సతీష్, ఎడిటర్‌బీ బి. మహేందర్ నాథ్, లిరిక్స్: చింత శ్రీనివాస్, రామారావు.

కేటిఆర్ విడుదల చేయనున్న జువ్వ ఆడియో



రంజిత్, పాలక్ లల్వానీ హీరో, హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం జువ్వ. ఎస్. వి. రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పై డా. భరత్ సోమి నిర్మిస్తోన్న ఈ సినిమాను త్రికోటి దర్శకత్వం వహిస్తున్నాడు. దిక్కులు చూడకు రామయ్య సినిమా తరువాత త్రికోటి దర్శకత్వం వహిస్తోన్న సినిమా ఇదే. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈ నెల 11న ఈ చిత్ర ఆడియోను గ్రాండ్‌గా విడుదల చెయ్యబోతున్నారు. ఈ వేడుకకి కేటిఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించగా కోటగిరి వెంకటేశ్వర్ రావ్ ఎడిటర్‌గా పనిచేసారు. అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా తెరకెక్కింది.

కృష్ణవంశీ దర్శకత్వంలో రానా



విలక్షణమైన పాత్రలు, విభిన్నమైన సినిమాలు చేస్తున్న యువ కథానాయకుడు రానా.. ఇప్పుడు '1945' సినిమాతో పాటు రాజా మార్తాండ వర్మ అనే మలయాళ సినిమా.. అలాగే హాథీ మేరే సాథీ సినిమా రీమేక్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమాలు పూర్తి కాక ముందే కొత్త కథలను వింటున్నాడు. అందులో భాగంగా క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి రెడీ అవుతున్నాడట. ఆసక్తికరమైన విషయమేమంటే.. ఇదొక మల్టీస్టారర్ రానాతో పాటు ఇద్దరు హీరోలు ఇందులో నటించబోతున్నారని సమాచారం. అందులో మాధవన్ ఒకరు కాగా మరో హీరో ఎవరనదేది తెలియాల్సి ఉంది

స్టార్ హీరోస్ సరసన పూజా హెగ్డే

2018 ఏడాది పూజా హెగ్డేకు బాగానే కలిసొచ్చినట్లు కనపడుతుంది. ఎందుకంటే ఈ ఏడాది ముగ్గురు స్టార్ హీరోస్ సరసన నటించే అవకాశాన్ని పూజా హెగ్డే అందుకోనుంది. సూపర్‌స్టార్ మహేష్ 25వ చిత్రం వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మహేష్ సరసన పూజా హెగ్డే నటించనుంది. అలాగే ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమాలో కూడా పూజా హెగ్డే నటించనుంది. కాగా ఇప్పుడు జిల్ ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా చేయబోయే సినిమా కోసం పూజా హెగ్డేతో యూనిట్ వర్గాలు సంప్రదింపులు చేస్తున్నారట. అన్నీ ఓకే అయితే పూజా బాహుబలికి జంటగా నటిస్తుందన్నమాట.



చెన్నైలో సన్నీ లియోనీ రెగ్యులర్ షూటింగ్



బాలీవుడ్ నటి సన్నీ లియోనీకి తెలుగునాట కూడా భారీ క్రేజ్ ఉంది. ఇప్పటికే పలు సినిమాల్లో స్పెషల్ పాటలతో తెలుగు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆమె ఇప్పుడు పూర్తి స్థాయి కథానాయకిగా దక్షిణాది పరిశ్రమకు ఎంట్రీ ఇవ్వనున్నారు. సుమారు.150 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో మొదలైంది. ఈ సినిమా కోసం సన్నీ లియోనీ 150 రోజుల కాల్ షీట్లను కేటాయించించారట. 'వీరమాదేవి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసిన ఈ చిత్రం చారిత్రిక నైపథ్యంలో ఉండనుంది. విసి. వడివుడియన్ డైరెక్ట్ చేయనున్న ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో రూపొందిస్తున్నారు. ఇందులో సన్నీ వారియర్ క్వీన్‌గా కనబడనుంది. 2019 వేసవికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

గోపీచంద్ పంతం మే 18న



గోపీచంద్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా 'పంతం'. బలుపు, పవర్, జై లవకుశ లాంటి భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్ స్క్రీన్‌ప్లే రాసిన కె. చక్రవర్తి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాని మే 18న రిలీజ్ చేసే ప్రాసెస్‌లో ఉన్నారు ఫిల్మ్ మేకర్స్. ఇప్పటికే ఒక సాంగ్‌తో పాటు సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను సక్సెస్ ఫుల్‌గా తెరకెక్కించిన సినిమా యూనిట్, ప్రస్తుతం ఇంటర్వెల్ బ్యాంగ్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్సెని అల్యూమినియం ఫ్యాక్టరీలో తెరకెక్కిస్తుంది. గోపీచంద్‌కి ఇది 25 వ సినిమా కావడం విశేషం. గోపీచంద్ సరసన మెహరీన్ కౌర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి గోపీ సుందర్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నాడు. కె.కె. రాధా మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది.

బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్‌తో రష్మిక



ప్రస్తుతం గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న విజయ్ దేవరకొండ సినిమా ఫాస్ట్ పేజ్‌లో ప్రీ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. పరశురామ్ డైరెక్షన్‌లో తెరకెక్కనున్న ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మండన్న హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ సినిమా తరవాత ఇమ్మీడియట్‌గా సెట్స్‌పైకి రానున్న విజయ్ నెక్స్ట్ సినిమాలోను హీరోయిన్ చాన్స్ కొట్టేసింది రష్మిక. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో తెరకెక్కనున్న ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో భరత్ కమ్మ డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ కానున్నాడు. అయితే ఈ సినిమాలో విజయ్ ఈస్ట్ గోదావరి యాసలో మాట్లాడే కాలేజ్ స్టూడెంట్‌లా కనిపించనున్నాడు. ఛలో సినిమాతో యూత్‌లో ఇంట్రెస్టింగ్ క్రేజ్‌ని క్రియేట్ చేసుకున్న రష్మిక బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్‌తో బిజీగా ఉంది. అర్జున్ రెడ్డి లాంటి సెన్సేషనల్ హిట్ తరవాత వస్తున్న ఈ కాంబినేషన్ ఏ రేంజ్‌లో రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



రోబో కంటే ముందు రానున్న కాలా

భారీతనం, భారీ విజువల్స్‌తో తెరకెక్కుతున్న సినిమా రోబో. శంకర్ దర్శకత్వంలో రజినీకాంత్, అక్షయ్ కుమార్, అమీ జాక్సన్ నటిస్తోన్న ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కానుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. తాజా సమాచారం మేరకు ఈ సినిమా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ సినిమా స్థానంలో రజినీకాంత్ నటించిన కాలా సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రోబో సినిమా స్థానంలో కాలా రావడం విశేషం. దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న కాలా సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రజినీకాంత్ డిఫరెంట్ లుక్‌లో అభిమానుల్ని అలరించబోతున్నాడు.

Dwaraka

అయోధ్య అంశం 'అచ్చమైన భూవివాదం'

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

మార్చి 14కు కేసు వాయిదా

న్యూఢిల్లీ : బాబ్రీ మసీదు-రామ జన్మభూమి అంశాన్ని ఒక 'అచ్చమైన భూవివాదం'గా వ్యవహరించనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. ఈ కేసును గురువారం విచారించింది. ఈ సమయంలో కొత్తగా పిటిషన్లను స్వీకరించేది లేదని స్పష్టం చేసింది. ఈ కేసులోని పార్టీలు తమ తమ పత్రాలను ఆంగ్లంలోకి అనువదించి సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 14న జరుగుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం తెలిపింది. రోజువారీ విచారణ జరపాలనే ఉద్దేశం ధర్మాసనానికి లేదని పేర్కొంది. ఈ ప్రత్యేక ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాతోపాటు న్యాయమూర్తులు అశోక్ భూషణ్, ఎస్.ఎ.నజీర్ ఉన్నారు. ఈ వివాదంలో అలహాబాద్ హైకోర్టులో పార్టీలు కానివారి పిటిషన్లను తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం చెప్పింది. గురువారం నాటి నుంచి రెండు వారాల్లోగా ఈ కేసుకు సంబంధించిన పుస్తకాల సారాంశాన్ని, ఆంగ్ల అనువాదాలను సమర్పించాలని, హైకోర్టు రికార్డుల్లో ఉన్న వీడియో క్యాసెట్ల కాపీలను కూడా సమర్పించాలని రిజిస్ట్రీని ఆదేశించింది.



నాలుగు సివిల్ దావాలపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 14 అపీళ్లను సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారిస్తున్న సంగతి తెలిసిందే. దాఖలైన నాలుగు సివిల్ దావాలపై హైకోర్టు తీర్పుపై దాఖలైన మొత్తం 14 అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత 2018, జూలైలో సున్నిత అంశమైన రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంలో అప్పీళ్లను విచారించాలని సున్నీ వక్ఫ్ బోర్డు చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు గత ఏడాది డిసెంబరులో తిరస్కరించింది.



'ఉపాధి' కార్మికులకు

వేసవిలో అదనపు భత్యం

- ఫిబ్రవరి, జూన్‌లో 20 శాతం
- మార్చిలో 25 శాతం
- ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం
- జూన్ వరకు అమలు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న కార్మికులకు వేసవిలో అదనపు భత్యం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రోజు వారీ వేతనానికి 20 శాతం నుంచి 30 శాతం అదనంగా చెల్లిస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల పని చేసే ఉపాధి కార్మికులలో అలసట ఎక్కువగా పెరుగుతుందని, దీనివల్ల పని విలువ తగ్గుతుందని పంచాయతీరాజ్‌శాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద గరిష్ట రోజు వారీ వేతనం లభించేలా చేసేందుకు వేసవిలో అదనపు భత్యం చెల్లించాలని ప్రతిపాదించగా, అందుకు ప్రభుత్వం అంగీకరించింది. గత ఏడాది కూడా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కార్మికలకు అదనపు భత్యాన్ని ప్రభుత్వం చెల్లించింది. అదనపు భత్యం చెల్లింపు ఈ నెల నుంచే అమలులోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఫిబ్రవరి, జూన్ నెలలో పని విలువకు చెల్లించే ఉపాధి వేతనాలను 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం పెంచి చెల్లించనున్నారు. పెంచిన ఉపాధి వేసవి భత్యాల పెంపుదలకు జిల్లా కలెక్టర్లు, ఉపాధి పథకం జిల్లా కో ఆర్డినేటర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులలో ఆదేశించింది.

రాహుల్ నాకూ బాసే



మోడీ ప్రసంగం అహంకారానికి నిదర్శనం

మా పథకాలకు కొత్త రంగులు

రాహుల్‌కూ సహకరించండి

సీపీపీ సమావేశంలో సోనియాగాంధీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తనకూ బాసేనని మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చెప్పారు. పార్టీ పటిష్టత కోసం ఇంతకాలం తనతో కలిసి పనిచేశారని, ఇక నుంచి రాహుల్‌తో పనిచేయాలని పార్టీ నాయకులకు సోనియా విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణ, నిబద్ధతతో అంతా పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ అధ్యక్షతన గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. సోనియా ప్రసంగిస్తూ నరేంద్రమోడీ ప్రభుత్వానికి ప్రచారార్భాటం తప్ప ఆచరణ ఏమీ లేదని నిందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం పార్లమెంటులో చేసిన ప్రసంగం తన అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కొత్త ఆరోగ్య బీమా పథకం సహా పాత పథకాలకు కొత్త రంగు వేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సోనియా ఆరోపించారు. మోడీ ఓ రాజకీయ నేతగా కాకుండా ఇంద్రజాలికుడిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీలో రెండు అధికార కేంద్రాలకు తావు లేదని పార్టీ నాయకులకు స్పష్టంచేశారు. 'పార్టీ పటిష్టంగా తయారు కావాలి. గ్రూపు రాజకీయాలకు తావు లేదు. అందరికీ రాహుల్ బాస్. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మీరు, నేను అందరం కలిసి రాహుల్‌ను కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకున్నాం. రాహుల్‌కు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయన నాకు కూడా బాసే.ఈ విషయంలో ఎవరికీ...ఎలాంటి అనుమానాలకు తావులేదు. నిబద్ధతతో ఇంతకాలం నాతో కలిసి పనిచేశారు. అదే విధంగా ఇక నుంచి రాహుల్‌తోనూ పనిచేయండి. నా పట్ల చూపిన విశ్వాసం, ప్రేమ, అంకిత భావం రాహుల్‌పైనా చూపండి' అని సోనియా హితవు పలికారు. తాను పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతానని, అధ్యక్షుడితో కలిసి పనిచేస్తానని సోనియా చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి భావసారూప్యత గల పార్టీలతోనూ కలసి పనిచేద్దామని ఆమె తెలిపారు. మోడీ ప్రభుత్వంపై సోనియా విమర్శలు గుప్పించారు. తాము కొత్త పథకాలు, కార్యక్రమాలు చేపట్టామని మోడీ ప్రభుత్వం పదేపదే చెప్పుకుంటున్నదని, అదంతా కేవలం మాయేనని అన్నారు. వాస్తవంగా యూపీఏ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన కార్యక్రమాలు, పథకాలనే అటూ ఇటూగా మార్చి చెప్పుకుంటున్నదని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం చెప్పుకుంటున్న పథకాల పేర్లు చెప్పుకోవడానికి తెలిగ్గానూ, రంగురంగులుగా ఉండవచ్చు, అవన్నీ తమ హయాంలో తీసుకొచ్చిన కార్యక్రమాలేనన్నారు. మోడీ ప్రభుత్వం చేసేది తక్కువ... చెప్పుకునేది ఎక్కువని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు, మోసాలతో నడుస్తోందని అన్నారు. మోడీ మాటల్లోనూ, చేతల్లోనూ నిజాయతీ లేదు. అంతా అహంకారమే. వాస్తవాలకు దూరంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. అంతా సొంత ప్రచారమే. లోక్‌సభలో మోడీ ప్రసంగమే ఇందుకు తాజా ఉదాహరణ అని సోనియా నిప్పులు చెరిగారు. వ్యవసాయం సంక్షోభంలో పడింది. నిరుద్యోగం పెరిగింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడుతున్నాయి. మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తుల ఆగడాలు, దాడుల కారణంగా దళితులు, మైనారిటీలు భయంతో జీవిస్తున్నారని సోనియా నిశితంగా విమర్శించారు. ఇలాంటి విభజన ప్రజాస్వామ్యంలో నేరపూరితమని వ్యాఖ్యానించారు. రాఫెల్ ఒప్పందంపై మోడీ ప్రభుత్వం మౌనాన్ని సోనియా సూటిగా ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులకు సోనియా పిలుపునిచ్చారు. గుజరాత్ ఎన్నికల ఫలితాలు, ఇటీవల జరిగిన రాజస్థాన్ ఉపఎన్నికల్లో పార్టీ గెలుపును ఆమె ప్రశంసించారు.

కర్ణాటక ఎన్నికల్లో కలిసి పోటీచేస్తాం...

బీఎస్పీ, జేడీ(ఎస్) ప్రకటన

న్యూఢిల్లీ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీచేస్తామని బీఎస్పీ, జేడీ(ఎస్) ప్రకటించాయి. తమ కూటమి 2019, లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగుతుం దని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నేత సతీష్ చంద్ర మిశ్రా, జనతా దళ్ (సెక్యులర్) నేత దానిష్ అలీ వెల్లడించారు. మేనెలతో కర్ణాటక అసెంబ్లీ పదవీకాలం ముగియనున్న విషయం తెలిసిందే. ఇద్దరు నేతలు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 14 జిల్లాలకు సంబంధించి ఎనిమిది రిజర్వ్, 12 సార్వత్రిక అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి బీఎస్పీ పోటీ చేయనుందని, మిగతా 204 స్థానాల్లో జేడీ(ఎస్) పోటీ చేయనున్నట్లు తెలిపారు. జేడీ(ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తు న్నట్లు వెల్లడించారు. రెండు పార్టీల జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవగౌడ, మాయావతీలు ఈనెల17 నుంచి బెంగళూరులో ఉమ్మడిగా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. బీఎస్పీ, జేడీ(ఎస్) కూటమి గొప్ప ముంద డుగని, దేశ రాజకీయాలపై దీని ప్రభావం ఉంటుందని అలీ అన్నారు. ప్రాంతీయ పార్టీలను ఒంటరి చేసే రెండు ప్రధాన జాతీయ పార్టీల యత్నా లను తిప్పికొడుతుందని ఆయన చెప్పారు. మా విజ్ఞప్తి మేరకే మాయావతి పొత్తుకు అంగీకారం తెలిపారన్నారు. రాష్ట్రంలో బీఎస్పీకి గట్టి పట్టు ఉందని, 22శాతం ఎస్టీ ఓట్లు పార్టీ సొంతమని అలీ చెప్పారు. కర్ణాటకలో బీఎస్పీ పట్టుపై ప్రశ్నకు మిశ్రా స్పందిస్తూ వివిధ నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేసినప్పటికీ పార్టీకి భారీగానే ఓట్లు పోలయ్యాయని తెలిపారు. 1999లోనే రాష్ట్రంలో బీఎస్పీ ప్రాతినిధ్యం ఉందని, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లోనూ పార్టీ మెరుగైన ప్రదర్శన ఇచ్చిందని చెప్పారు.

ట్రిపుల్ తలాక్ బిల్లు తప్పులతడక

దోషాల సవరణకు కృషిచేస్తాం : ఆలిండియా ముస్లిం లా బోర్డు

హైదరాబాద్ : మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ బిల్లు తప్పులతడకని, అందులోని దోషాలను సవరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) పేర్కొంది. తప్పులభరిత బిల్లును అమలు చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించింది. 'యావత్ ప్రపంచంలోనే ఇలాంటి చట్టం ఎక్కడా లేదు.. తప్పులభరితమైన ఈ బిల్లును ఆమోదింపజేసేందుకు యత్నిస్తున్నారు. ఇందులోని తప్పులన్నింటినీ సవరించేంత వరకు ముస్లిం లా బోర్డు విరమించదు' అని బోర్డు అధికార ప్రతినిధి మౌలానా ఖలీల్ ఉర్ రెహమాన్ సజ్జద్ నౌమానీ అన్నారు. హైదరాబాద్‌లో మూడ్రోజుల పాటు నిర్వహించే బోర్డు 26వ వార్షిక సదస్సు సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. లా బోర్డు ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. దానిలో తప్పులను సవరించాల్సిందిగా కోరుతోందని తెలిపారు. ఈనేపథ్యంలో దీన్ని ఆమోదించాలా లేదా అన్నది పరిశీలించాలని ఆయన విపక్షాలను కోరారు. ఈ బిల్లు తలాక్ విధానాన్నే నిషేధించే విధంగా ఉందని నౌమానీ తెలిపారు. 'ట్రిపుల్ తలాక్ విధానాన్ని నిలిపివేసేందుకే అని చెప్పి.. తలాక్ విధానాన్నే పూర్తిగా నిషేధించే విధంగా దీన్ని రూపొందించారు. అంతేకాకుండా. ఎవ్వరైనా సరే విడాకుల నెపంతో ముస్లింలపై ఫిర్యాదు చేసే విధంగా తయారుచేశారు' అంటూ ఆయన తెలిపారు. వార్షిక సదస్సులో ట్రిపుల్ తలాక్, అయోధ్య వ్యవహారాలలో భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు. ట్రిపుల్‌తలాక్ బిల్లుకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదించగా రాజ్యసభ ఆమోదించాల్సి ఉంది.

1.10 లక్షల పంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ

న్యూఢిల్లీ : భారత్ నెట్ ప్రాజెక్టు కింద 1.10 లక్షల గ్రామపంచాయతీలలో ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ కల్పించినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. దేశంలోని అన్ని గ్రామపంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ కల్పించాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వెల్లడించింది. అన్ని పంచాయతీలలో ఇంటర్నెట్/ఈ-పంచాయత్ సదుపాయం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ లోక్‌సభలో చెప్పారు. భారత్ నెట్ ప్రాజెక్టు మొదటి దశ కింద 2018 జనవరి 21 నాటికి 2,58,635 కిలోమీటర్ల మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను అమర్చడం ద్వారా 1,10,848 గ్రామపంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ కల్పించామని, 1,01,936 గ్రామపంచాయతీలకు సర్వీసులు అందించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి వివరించారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి ఈ మేరకు సమాధానం చెప్పారు. రెండోదశలో మిగిలిన 1.5 లక్షల గ్రామపంచాయతీలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ అందిస్తామన్నారు. 2019 మార్చి నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు.

కట్నం కోసం నా కిడ్నీ దొంగతనం

పశ్చిమ బెంగాల్‌లో ఓ భర్త దురాగతం



కోల్‌కతా: కట్నం కోసం తన భర్త కిడ్నీ దొంగిలించాడంటూ ఓ మహిళ పోలీసులతో మొరపెట్టుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కోల్‌కతాకు చెందిన ఓ రీటా అనే యువతికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో వరుడి తల్లిదండ్రులు భారీగానే కట్నం అడిగారు. దాంతో పెళ్లికి ముందు కొంత కట్నం ఇచ్చారు. మిగతాది తర్వాత ఇస్తామని చెప్పారు. పెళ్లై ఏడాది గడుస్తున్నా మిగిలిన కట్నం ఇవ్వలేదని అత్తింటివారు రీటాను వేధించేవారు. ఈ నేపథ్యంలో 2016లో రీటాకు తీవ్రంగా కడుపు నొప్పి వచ్చింది. పరీక్షల నిమిత్తం వైద్యులను సంప్రదించగా అపెండిసైటిస్ సర్జరీ చేయాలని చెప్పారు. ఆ తరువాత మాటిమాటికీ అనారోగ్యం పాలవుతుండడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంది. అక్కడి వైద్యులు రీటాకు ఒకే కిడ్నీ ఉందని తెలిసి షాకయ్యారు. 2016లో అపెండిసైటిస్ సర్జరీ చేసినప్పుడు రీటా భర్తే వైద్యులకు డబ్బు ఇచ్చి కిడ్నీ తొలగించేలా చేసినట్లు తెలిసింది. 'కడుపు నొప్పి వచ్చినప్పుడు నా భర్త కోల్‌కతాలోని ఓ నర్సింగ్ హోంకు తీసుకువెళ్లాడు. అక్కడ వైద్యులు నాకు అపెండిసైటిస్ సర్జరీ చేస్తే అంతా బాగైపోతుందని చెప్పారు. కానీ సర్జరీ పేరు చెప్పి నా కిడ్నీ తొలగించారు. ఆ విషయం నాకు అప్పుడు తెలియలేదు. సర్జరీ అయ్యాక ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దని నా భర్త కోరాడు. కొన్ని నెలల తరువాత అనారోగ్యం పాలవడంతో మళ్లీ వైద్యుల వద్దకు వెళ్లాను. వారు స్కానింగ్ నిర్వహించగా ఒకే కిడ్నీ ఉన్నట్లు తెలిసింది. అప్పుడే తెలిసింది కట్నం బాకీ తీర్చలేదన్న కారణంగా నా భర్త కిడ్నీ అమ్ముకున్నాడని' అని పోలీసులకు తెలిపింది. దాంతో పోలీసులు రీటా భర్తను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

సమయమే నిర్ణయిస్తుంది...

రజనీతో పొత్తుపై కమల్

చెన్నై : తమిళనాడు స్టార్‌హీరో కమల్‌హాసన్, తలైవా రజినీకాంత్ త్వరలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారు. ఇద్దరూ కలిసికట్టుగా ముందుకు సాగుతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ కలిస్తే తాము మద్దతిస్తామని సినీరంగ ప్రముఖులు పలువురు ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలో కమల్‌హాసన్ స్పందిస్తూ 'కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీచేస్తారా అని మమల్ని పదేపదే ప్రశ్నిస్తున్నారు. రాజకీయపరంగా మా సిద్ధాంతాలు, ఆలోచనలు కలుస్తాయో లేదో చూసుకోవాలి. ఇద్దరం కూర్చొని, చర్చించి దీనిపై ఓ నిర్ణయానికి రావాలి. దీనిపై సమయమే నిర్ణయిస్తుందని రజినీసార్ చెప్పారు. నా అభిప్రాయం కూడా అదే. నిజమే! సమయమే నిర్ణయిస్తుంది' అని తమిళ మ్యాగజైన్ 'నందా వికాతన్'తో కమల్ అన్నారు. వీటన్నింటికన్నా ముందు తామిద్దరం తమ పార్టీలను అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని కమల్ చెప్పారు. తామిద్దరూ కలిసి పోటీ చేయడంపై ఇప్పుడే నిర్ణయించడం తొందరపాటే అవుతుందన్న అభిప్రాయాన్ని కమల్ వ్యక్తం చేశారు. ఇదేదో సినిమా కోసం కాస్టింగ్ చేయడం కాదని, దీనిపై నిశితంగా చర్చించాల్సి ఉందని చెప్పారు. ఈనెల 21న తన రాజకీయ పర్యటనకు శ్రీకారం చుట్టనున్న ఆయన త్వరలోనే రాజకీయ పార్టీ పేరునూ ప్రకటించనున్నారు. తన రాజకీయ ప్రయాణానికి మద్దతివ్వాలంటూ కమల్ గతనెలలో ప్రజలను కోరారు. 'మన దేశంతోపాటు రాష్ట్ర సాధికారత కోసం నాతో కలిసి రండి' అంటూ ఆయన పిలుపునిచ్చారు. జయలలిత ఆకస్మిక మరణం నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొనడంతో ఈ ఇద్దరు స్టార్ హీరోల రాజకీయ ఎంట్రీపై ఉత్కంఠ నెలకొంది.

మలయాళ మనోరమ ఎడిటర్‌కు ఊరట

కిందికోర్టు తీర్పుపై హైకోర్టు స్టే

కోచి : ఎమ్మెల్యే కుమారుడి మోసంపై పత్రికలో ప్రచురించరాదని మలయాళ మనోరమ ఎడిటర్‌కు కింది కోర్టు జారీ చేసిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. పత్రికలను వార్తలు నుంచి మినహాయించడం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమంటూ, తీర్పుపై స్టే విధించారని మలయాళ మనోరమ చీఫ్ ఎడిటర్ మమ్మెన్ మాథ్యూ బుధవారం తెలిపారు. కురునాగపల్లి ఎమ్మెల్యే విజయన్ పిల్లై కుమారుడు శ్రీజిత్‌పై పరువుకు భంగం కలిగించే విధంగా వార్తలు ప్రచురించరాదని జనవరి 3న సబ్‌కోర్టు జడ్జి కరునాగపల్లి తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. హైకోర్టు న్యాయమూర్తి కమల్ పాషా కింది కోర్టు తీర్పుపై మంగళవారం స్టే విధించగా, ఎమ్మెల్యే కుమారుడి ఆర్థిక [illegible] వార్తలు ప్రచురించరాదని కోర్టు వెల్లడి[illegible] విషయమని, రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు స్పష్టం చేసింది. హక్కులను పరిరక్షించేందుకే కోర్టులు పనిచేస్తున్నాయని మాథ్యూ అభినందించగా, మాజీ లోక్‌సభ ఎంపీ, మీడియా విశ్లేషకుడు సబాస్టియన్ పాల్ హైకోర్టు తీర్పును స్వాగతించారు. రాష్ట్రంలో జర్నలిస్టులు - లాయర్లకు మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని నివారించడంలో హైకోర్టు త్వరగా స్పందించడం ఆనందకరమన్నారు. నేర కేసుల్లో తన పేరును తప్పుగా ఉపయోగిస్తున్నారని శ్రీజిత్ కోర్టుకు వెల్లడించడంతో కింది కోర్టు అతనికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దుబాయ్‌కు చెందిన జాస్ టూరిజం కంపెనీ యజమాని హసన్ ఇస్మాయిల్ అబ్దుల్లా అల్‌మార్జూకీ తిరువనంత పురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేరళ సీపీఎం కార్యదర్శి కొడియెరి బాలకృష్ణన్ కుమారుడు బినయ్ కొడియెరి రూ. 13 కోట్లు మోసం చేశాడని ఆరోపించడంతో మలయాళం మనోరమ ఆవార్తలను ప్రచురించింది.

మణిపూర్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రొబీంద్రో

ఇంఫాల్ : మణిపూర్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కొంగాఖం రోబింద్రో గురువారం ఎన్నికయ్యారు. బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో మూజు వాణి ఓటు ద్వారా ఆయన ఎన్నికయ్యారు. రోబింద్రో మయాంగ్ ఇంఫాల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రమాణాలననుసరించి ఆయన తన విధులను నిర్వహిస్తారని ఆశిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎన్ బీరన్ సింగ్ అన్నారు.

ఆసియాలో 100వ స్థానంలో తేజ్‌పూర్ వర్సిటీ

తేజ్‌పూర్ : ఈ వార్షిక సంవత్సరంలో మెరుగైన ఫలితాలు కనబరిచిన ఆసియా ఖండంలోని యూనివర్సిటీల్లో అస్సోంలోని తేజ్‌పూర్ విశ్వవిద్యాలయం 100వ స్థానంలో నిలిచిందని వర్సిటీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2017లో 131-140 స్థానాల మధ్య నిలిచిన విశ్వవిద్యాలయం మెరుగైన ఫలితాలతో మరింత ముందుకెళ్లినట్టు తెలిపింది. అలాగే 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్' ప్రకారం దేశంలోని ఉన్నత విద్యాసంస్థలన్నింటిలో సెంట్రల్ యూనివర్సిటీ ఏడవ స్థానంలో , బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆసియాలో 29వ స్థానంలో ఉన్నట్టు ప్రకటనలో పేర్కొంది.

ఎన్‌కౌంటర్‌లో నక్సల్ కమాండర్ మృతి

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నక్సల్ కమాండర్ మృతిచెందినట్టు పోలీసులు గురువారం తెలిపారు. కిర్నాదౌల్ పోలీసు స్టేషను పరిధిలోని డోక్పారా అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి ప్రత్యేక టాస్క్ బృందం (ఎస్‌టీఎఫ్), జిల్లా రిజర్వ్‌గార్డ్ (డీఆర్‌జీ) సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టింది. ఈ క్రమంలో నక్సలైట్లకు పోలీసులకు మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగాయని తెలిపారు.

పర్యాటక కేంద్రంగా తంపర సరస్సు

బర్హంపూర్ : ఒడిశాలోని గంజాం జిల్లాలో చాత్రాపూర్ సమీపంలోని తంపర సరస్సును త్వరలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి కానుందని, ఇందుకుగాను రూ.33.43 కోట్లు ఇటీవల కేంద్రం మంజూరు చేసిందని అధికారవర్గాలు గురువారం తెలిపాయి. 2013లో ఒడిశాలో పైలిన్ తుపాన్ ప్రభావానికి 16 వ నెంబరు జాతీయ రహదారి నుంచి 2 కి.మీ. ల దూరంలో ఉన్న తంపర బాగా దెబ్బ తిందన్నారు. స్వదేశ్ దర్శన్ కేంద్ర పథకం కింద ఈ సరస్సును ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుందని చెప్పారు.

'మహాగయ' ప్రచారాన్ని ప్రారంభించిన గడ్కరీ

న్యూఢిల్లీ : వచ్చే నెల న్యూఢిల్లీలోని ఎర్రకోట మైదానంలో 'రాష్ట్ర రక్ష మహాగయ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.'మహాగయ'పై అవగాహనకు ప్రచార కార్యక్రమాన్ని గురువారం ఆయన నివాసంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాగయ వివరాలను ఫోన్ చేసి మిస్డ్‌కాల్ ద్వారా తెలుసుకునేందుకు కార్యక్రమ నిర్వాహకులు ఒక ఫోన్ నెంబరును వెల్లడించారు. వచ్చే నెల జరగనున్న మహాగయ కార్యక్రమంలో భాగంగా మహిళలను గౌరవించాలి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలి, పర్యావరణాన్ని రక్షించాలి వంటి ఎనిమిది ప్రతిజ్ఞలు చేస్తారని తెలిపారు.

కేరళలో 12 శాతం పెరిగిన ఎన్ఆర్ఐల డిపాజిట్లు

తిరువనంతపురం : కేరళలో 2016-17 వార్షిక కాలంలో ఎన్ఆర్ఐల డిపాజిట్లు 12 పెరిగినట్టు 2017 ఆర్థిక సర్వేలో వెల్లడైంది. 2017 మార్చిలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం రూ.83,855 కోట్లు, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో రూ.68,493 కోట్లు డిపాజిట్ అయినట్లు సర్వేలో తేలింది. 2016 మార్చిలో రూ.1,35,609 కోట్లు డిపాజిట్ అయినట్టు పేర్కొంది.

వరుడుపై హత్య కేసు

బదౌన్ : చెప్పులు దొంగలించాడన్న అనుమానంతో వివాహ కార్యక్రమంలో ఓ వ్యక్తిని వరుడు, ఆయన స్నేహితులు చితకబాదడంతో ఆ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో నూరజ్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుందని పోలీసులు గురువారం తెలిపారు. వివాహ వేడుకలో వరుడు సురేంద్ర తన చెప్పులు కన్పించకపోవడంతో ఆయన తన నలుగురు స్నేహితులతో కలిసి రామసరన్ (42)పై దాడిచేశాడని తెలిపారు. తీవ్రంగా గాయపడిన రామసరన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని చెప్పారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేంద్ర, ఆయన నలుగురు స్నేహితులపై కేసు నమోదు చేశామన్నారు.

జమ్మూ శాసనసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

జమ్మూ : హర్యానాలోని యూనివర్సిటీలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులపై దాడి జరిగిన ఘటనకు నిరసనగా జమ్మూ, కాశ్మీర్ శాసనసభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. గురువారం ఉదయం సభ ప్రారంభం కాగానే సీపీఐ (ఎం) ఎమ్మెల్యే ఎంవై తరిగామి, ఎన్‌సీ ఎమ్మెల్యే అలీ మొహమ్మద్ సాగర్ విద్యార్థులపై దాడి అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై బదులివ్వాలంటూ డిమాండు చేశారు. కాశ్మీర్ విద్యార్థులపై పలుమార్లు దాడులు జరుగు తున్నాయని అయినప్పటికీ ప్రభుత్వం ఈ దాడులను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఏడుగురు భారత జాలర్లు అరెస్టు

రామేశ్వరం : కట్చదీవు సమీపంలో చేపలు పడుతున్న తమిళనాడు జాలర్లలో ఏడుగురిని శ్రీలంక నావికాదళం గురువారం అరెస్టు చేసిందని మత్స్య విభాగ అసిస్టెంట్ డైరక్టర్ ఎస్ మణికందన్ తెలిపారు. జాలర్లకు సంబంధించిన వలలు, ఇతర వస్తువులును నావికా సిబ్బంది స్వాధీనం చేసుకుందని చెప్పారు. జాలర్లను అరెస్టు చేసి తలైమన్నార్‌కు తరలించారని, మిగిలిన జాలర్లు గురువారం ఒడ్డుకు తిరిగి వచ్చారని చెప్పారు. భారత్-శ్రీలంకల మధ్య 1947-1976 ఒప్పందాల ప్రకారం కట్చదీవులో భారత జాలర్లు చేపలు పట్టుకునేందుకు అనుమతి ఉందని జాలర్ల అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు.

'జంక్‌ఫుడ్' ప్రసారాలపై నిషేధాలు లేవు : కేంద్రం

న్యూఢిల్లీ : టెలివిజన్‌లో జంక్‌ఫుడ్‌పై వచ్చే ప్రసార మధ్యమాలను నిషేధించాలన్న ప్రతిపాదనేమీ చేయలేదని కేంద్ర ప్రభుత్వ గురువారం స్పష్టంచేసింది. చిన్నారులు తీసుకునే చిరుతిండి విషయంలో ప్రసారమధ్యమాల ప్రభావం పడుతుందన్న ఆందోళనతో ఎఫ్ఐఏ ఇప్పటికే స్వచ్ఛందంగా వాటిపై ఆంక్షలు విధించాలని నిర్ణయించిందని సమాచార, ప్రసారాల శాఖ సహాయ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ లోక్‌సభ దీనికి సంబంధించిన ప్రశ్నపై బదులిచ్చారు. అయితే జంక్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్‌లపై టెలివిజన్‌లో ప్రసారాలపై నిషేధం విధించాలా లేదా అన్న దానిపై ప్రస్తుతానికి ప్రభుత్వం ఏ ప్రతిపాదన చేయలేదని తెలిపారు.

జెట్ విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

చెన్నై : చెన్నై నుంచి ఢిల్లీ వెళుతున్న స్పైస్ జెట్ విమానానికి గురువారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్ వే నుంచి టేకాఫ్ అవుతుండగా విమానం టైరు పేలినట్టు సిబ్బంది గుర్తించారు. అప్రమత్తమైన పైలట్ విమానాన్ని సురక్షితంగా తిరిగి చెన్నై విమానాశ్రయంలో దించారు. విమానంలోని ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించి, తిరిగి టెర్మినల్ బిల్డింగ్‌లోకి తీసుకెళ్లారు. టైర్ పేలిన ఘటనతో రన్ వేను సాయంత్రం 6 గంట వరకు మూసివేశారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టిన కారు - నలుగురు మృతి

అహ్మదాబాద్ : ప్రయాణికులతో వెళ్తున్న ఓ కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గుజరాత్‌లోని బార్వాలా-బోతాడ్ హైవే జరిగింది. లింబిడి గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు పెళ్లికి హాజరై తిరుగుప్రయాణంలో దేవాలయాన్ని దర్శించుకోవడానికి సాలంగపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.గాయపడినవారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగమంచుతో విమానాలకు అంతరాయం

చెన్నై : చెన్నై నగరాన్ని పొగమంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచు కారణంగా పలు విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.విమానాశ్రయంలో పొగమంచు భారీగా పేరుకుపోవడంతో అధికారులు, 12 విమానాలను దారి మళ్లించారు. అలాగే చెన్నై విమానాశ్రయం నుంచి బయల్దేరాల్సిన మరో 30 విమానాలు ఆలస్యంగా వెళ్లనున్నాయి. విమానాలు బయలుదేరడానికి కనీసం 400 మీటర్ల మేర విజిబులిటీ ఉండాలని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం పొగమంచు కారణంగా 50 మీటర్ల విజిబులిటీ మాత్రమే ఉండటంతో విమానాలు ఆలస్యంగా బయలుదేరనున్నాయని వెల్లడించారు.

Dwaraka



రోబోలతో పెనుమార్పులు

విశాలాంధ్ర - భీమవరం : సాంకేతికరంగంలో రోబోల వినియోగం తర్వాత ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని ఆంధ్రప్రదేశ్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.చంద్రశేఖర్‌వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే సంకేతా-2కె18 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌వర్మ మాట్లాడుతూ మోడీ మేకిన్ ఇండియా నినాదంతో దేశవ్యాప్తంగా సాంకేతికంగా ఎంతో మార్పు కారణంగా కొత్త టెక్నాలజీలతో కొత్త ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నప్పటికీ బహుళ నైపుణ్యాలున్న వారు మాత్రమే అవకాశాలు అందుకోగల్గుతున్నారన్నారు. శ్రీసిటీలో ఇప్పటికి 25 దేశాలకు చెందిన 165 పరిశ్రమలు నెలకొల్పాయన్నారు. ఐఐటీల నుండి వచ్చిన వారికి 40 శాతం ఉపాధి అవకాశాలు వస్తుండగా, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి బయటకొచ్చే వారు 15 శాతం మించి అవకాశాలు పొందలేకపోతున్నారన్నారు. మెకానికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డా॥కె.బ్రహ్మరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ కరస్పాండెంట్ సాగి విఠల్‌రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ఎన్.రాజు, ప్రొఫెసర్ వి.కె.విశ్వనాథరాజు, విద్యార్థి ప్రతినిధులు శ్రీరామ్, కిషోర్ పాల్గొన్నారు.

రైతులు నేరుగా అమ్ముకునేందుకు ప్రత్యేక ప్లాట్‌ఫామ్

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : రైతులు తమ పంటను ఎగుమతి దారులకు నేరుగా అమ్ముకునేలా గుంటూరు మార్కెట్ యార్డులో ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. మిర్చి యార్డు పాలకవర్గ సభ్యులు, వ్యాపారులు గురువారం మార్కెటింగ్ కమిషనర్ శ్యామ్యూల్ ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా శ్యామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ మార్కెటింగ్ వ్యవస్థలో లోపాలను సరిదిద్దడంతోపాటు దళారుల ద్వారా రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు. మార్చి ఒకటో తేదీ నుండి ఈ-నామ్ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. మిర్చియార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ ఈ-నామ్ అమలుకు యార్డు పాలకవర్గం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో యార్డు వైస్ ఛైర్మన్ కొత్తూరి వెంకట్, కార్యదర్శి శ్రీనివాసరావు, అసోసియేషన్ నాయకులు, యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి



విశాలాంధ్ర - చింతూరు : ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బేనగపల్ గ్రామ వద్ద హీరోలీ అడవిలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. బుధవారం రాత్రి జరిగిన కాల్పుల్లో లక్ష రూపాయల రివార్డు ఉన్న మావోయిస్టు దళ కమాండర్ మృతిచెందాడు. అతని వద్ద 315 నాటు తుపాకీ, మెడికల్ కిట్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ క్యాంప్‌పై దాడికి యత్నించిన మావోయిస్టుల పన్నాగాన్ని పసిగట్టి ఎదురుకాల్పులకు దిగడంతో తట్టుకోలేక పరారైనట్టు ఏఎస్‌ఎస్పీ జీహెచ్ భగయేల్ తెలిపారు.

ఏపీ రాజధానిలో తెలంగాణ పోలీసులు



విశాలాంధ్ర - తుళ్ళూరు : కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై గురువారం వామపక్ష పార్టీల బంద్ పిలుపుతో రాజధాని ప్రాంతంలో భద్రతా చర్యలకు మొత్తం ముందస్తుగా పోలీస్ బలగాలను మోహరించారు. వెలగపూడి చెక్‌పోస్టు నుంచి సచివాలయం ద్వారం వరకు అడుగడుగునా పోలీసుల నిఘా పెట్టారు. వీరందరూ అందరూ తెలంగాణ పోలీసులు కావడం గమనార్హం. మందడం, మల్కాపురం వెంకటపాలెం, ముఖ్యమంత్రి నివాసం ప్రధాన రహదారిపై అంతటా తెలంగాణా పోలీసులే బందోబస్తు నిర్వహించారు. సొంత రాజధాని భద్రత కోసం తెలంగాణ పోలీసులను రప్పించడం విమర్శలకు దారితీసింది.

స్వచ్ఛాంధ్ర సాధిద్దాం : మురళీధర్‌రెడ్డి



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్వచ్ఛాంధ్ర సాధన వరకు మరింత కృషిచేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి సూచించారు. కర్నూలు నగరంలో మరుగుదొడ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో స్వీపింగ్ మిషన్లను చూశారు. ఏ క్యాంపులోని మున్సిపల్ హైస్కూల్, రైతు బజార్ వద్ద సాలిడ్ వేస్ట్ కన్వర్టర్ సెంటర్‌ను పరిశీలించారు. ఎరువుల తయారీపై కమిషనర్ హరినాథరెడ్డి నుంచి వివరాలు సేకరించారు. వ్యర్థాల నుంచి ఎరువు తయారీ పద్ధతి బాగుందని కితాబు ఇచ్చారు. దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. మురళీధర్‌రెడ్డితోపాటు ఎంఈ రాజశేఖర్, డీఈ రసూల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉస్మాన్‌అలీఖాన్, ఏఈ సరేష్, దినేష్ పాల్గొన్నారు.

జాడలేని సాగర్ జలాలు

- ఎండిపోతున్న మిర్చి పంట
- కృష్ణా జిల్లా మెట్ట రైతుల గగ్గోలు



విశాలాంధ్ర - నందిగామ : కృష్ణాజిల్లా నందిగామ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు సాగునీరందక గగ్గోలు పెడుతున్నారు. నాగార్జున సాగర్ జలాల జాడ కానరాకపోవడంతో పంటకు నీటితడులు అందటం లేదు. మిర్చిపంట నిలువునా ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పంటకు మెట్ట ప్రాంతాల రైతులు సాగర్ జలాలపైనే ఎక్కువ ఆశలు పెట్టుకుంటారు. దామలూరు, సాగర్‌కాలువ నీరే ఆధారం. సకాలంలో సాగర్ జలాలు రాకపోవటంతో పూత, పిందె కాపుదశలోనే పంట ఎండిపోతుంది. ఇప్పటికే ఎకరాకు రూ. 80 వేల పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతామని ఆందోళన చెందుతున్నారు. పూర్తి మెట్ట ప్రాంతాలైన నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఈ ఏడాది 20 వేల ఎకరాలకు పైగా మిర్చి సాగుచేశారు. వర్షాలు లేకపోవటంతోపాటు సకాలంలో సాగర్ జలాలు అందకపోవడం, ఎత్తిపోతల పథకాలు సక్రమంగా పనిచేయకపోవటంతో నీరందక పంట ఎదుగుదల లోపించింది. నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో 10 వేల ఎకరాల్లో మిర్చి సాగుచేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మరో 13 వేల ఎకరాల్లో మిర్చి ఉంది. వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని సాగర్ మూడవ జోన్ పరిధిలో కాలువలకు ఇప్పటి వరకు చుక్కనీరు సరఫరా కాక మేజర్ కాలువ బీటలు వారి చిట్టడవులను తలపిస్తున్నది. రెండవ జోన్ పరిధిలోని మిగిలిన ప్రాంతాలకు అరకొరగా సాగునీరు అందటంతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఈ ఏడాది సాగు ఖర్చులు కూడా బాగా పెరిగాయి. ప్రస్తుతం మిర్చిపంటకు నీటితడులు అత్యంత అవసరం. నెల రోజులకుపైగా వర్షాలు లేకపోవడం, సాగర్ జలాలు ఎండమావులుగా మారటంతో మిర్చిపంట పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే రెండు, మూడు తడుల నీరు పెట్టాల్సి ఉన్నప్పటికీ అందకపోవడంతో పంట దిగుబడులు తగ్గిపోతాయని రైతులు అంటున్నారు. దీంతోపాటు రకాల తెగుళ్ళు చుట్టుముడతాయని, తెగుళ్ళ నివారణకు మందుల పిచికారీతో పెట్టుబడి మరింత పెరిగిపోతుందంటున్నారు. ఇప్పటికే కాయ, పిందె చీడపీడల బారినపడి దెబ్బతింటుందని వాపోతున్నారు. నైరుతీ రుతుపవనాలు దెబ్బతీసినా ఈశాన్య రుతుపవనాలైనా ఆదుకుంటాయని ఆశపడ్డ రైతులకు తీవ్ర నిరాశే మిగులుతుంది.

మిర్చి పంటను కంటికి రెప్పలాగా కాపాడుకోవాలి. మిగతా పంటలతో పోలిస్తే ఖర్చు కూడా ఎక్కువే. సాధారణ పరిస్థితుల్లో ఎకరానికి లక్షరూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఆ ఖర్చు ప్రస్తుతం మరో ముప్పై వేలకు పెరుగుతుంది. పంట రక్షణకు దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చుకోవాలంటే మరింత భారమే. ఒక్కో తడికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు అదనపు ఖర్చు అవుతుంది. ఇలా రెండు తడులు పెట్టినా చిన్న రైతులకు తలకు మించిన భారమే. మిర్చి సాగుదారుల్లో కౌలురైతులే అధికం. కౌలు ధరలు, కూలీల ఖర్చులు, పురుగుమందుల ఖర్చులు పెరిగి పెనుభారంగా మారాయి. ఈ స్థితిలో వాతావరణ పరిస్థితులు రైతును మరింత కుంగదీస్తున్నాయి. మామూలుగా ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ళ వరకు మిర్చి దిగుబడులు వస్తాయి. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో 40 శాతం వరకు పంట దిగుబడులు తగ్గిపోతున్నాయని, ఎకరానికి 15 క్వింటాళ్ళు కూడా దిగుబడులు రాని పరిస్థితులు నెలకొన్నాయని మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. పాలకుల అసమర్థ విధానాలతోనే సాగర్ జలాలు రాక, కాలవలు బీటలువారాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించి ఆదుకోవాలని కోరినా ప్రయోజనం కానరాలేదంటున్నారు. అయినాకూడా మంత్రివర్యులు తమ గోడును పట్టించుకోకపోవటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు అర్థం చేసుకుని ఇప్పటికైనా సాగర్ జలాలు అందించి తమను ఆదుకోవాలని, లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆ గ్రామాల రైతులు వాపోతున్నారు. రైతుల అవస్థలు అర్థం చేసుకుని మంత్రివర్యులు, అధికారులు తక్షణమే స్పందించి ఎండిపోతున్న పంటలకు నీరు అందించి ఆదుకోవాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.



నేటి నుంచి రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడాపోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించనున్నట్టు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. మూడు రోజులు కొనసాగే పోటీల వివరాలను గురువారం కాకినాడ రెవెన్యూ సంఘ భవనంలో ఆయన విలేకరులకు వివరించారు. 34 ఈవెంట్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు రాష్ట్ర రాజధాని సీసీఎల్ఏ యూనిట్‌తో పాటు 13 జిల్లాల నుంచి 1500 మంది ఉద్యోగులు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులకు 8,9,12 తేదీలు ప్రత్యేక సెలవు, 10,11 తేదీలు సెలవు రోజులు కావడంతో పర్మిషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్రీడా పోటీలకు నోడల్ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా వ్యవహరిస్తారని, నిర్వహణా కమిటీ ఛైర్మన్‌గా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్.దివాకర్, కన్వీనర్‌గా అసోసియేషన్ క్రీడా, సాంస్కృతిక విభాగ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.కృష్ణమూర్తి వ్యవహరిస్తారన్నారు. తొలి రోజు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, 11వ తేదీ ముగింపు సభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు కేఈ, చినరాజప్ప, ఆర్థికమంత్రి యనమల హాజరవుతారన్నారు. సమావేశంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంజిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్.దివాకర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పితాని త్రినాథ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ట్రాయ్ కార్మికుల తిరుగుబాటు



విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీట్ పనుల నిర్వహణకు నవయుగ కంపెనీ కి అన్ని సిద్ధం చేసుక్ను సమయంలో ట్రాన్స్‌ట్రాయ్‌లో పని చేస్తున్న కార్మికులు జీతాల బకాయిలు చెల్లించే వరకు పనులు జరగనివ్వబోమని గురువారం నిరసనకు దిగారు. జీతాలు చెల్లించాలంటూ ట్రాన్స్‌ట్రాయ్‌లోని డ్రైవర్లు, ఆపరేటర్లు, ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌ఛార్జీలు పెద్ద ఎత్తున స్పిల్‌వే ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలవరం ఎస్ఐ కె శ్రీహరిరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని నిరసనకారులతో బ్లాచింగ్ ప్లాంట్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈలోపు ఘటనా స్థలికి వచ్చిన ఇరిగేషన్ ఎస్ఈ వీఎస్ రమేష్ బాబు ప్రాజెక్టులోకి వస్తే కాళ్లు విరగగొట్టండి అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడటంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొండపై ఉన్న ట్రాన్స్‌ట్రాయ్ కార్యాలయాన్ని 1000 మంది వరకు వచ్చి ముట్టడించారు. తమ ఆవేదనను విలేకర్ల వద్ద వెళ్లబోసుకున్నారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీలోని డ్రైవర్లకు, ఆపరేట్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌ఛార్జిలకు ఐదు నెలల జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. సుమారు 3,500 మంది కూలీలను 36 మంది లేబర్ కాంట్రాక్టర్లు తీసుకువచ్చారు. బీహార్ నుంచి వచ్చిన లేబర్ కాంట్రాక్టర్ హరిరామసింగ్ మాట్లాడుతూ కూలీలకు డబ్బు ఇవ్వకుండా ఇంటికి వెళితే తలవంపులతో ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందన్నారు. కార్మికులు, ఇంజనీర్లు, జేపీ గుప్తా, ఆదిశేష తదితరులు మాట్లాడుతూ నెలలు తరబడి జీతాలు ఇవ్వనప్పటికీ ఎంతో కష్టపడి పనులు చేశామని, కానీ మా కష్టాన్ని కంపెనీ దోచుకోవాలని చూస్తుందన్నా రు. కొత్త కంపెనీ పనులు ప్రారంభించడానికి పూనుకోవడంతో మా పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. మా జీతాల నుంచి పీఎఫ్ కటింగ్ చేస్తున్నప్పటికీ నెంబరుగానీ, రశీదుగానీ ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదన్నారు. మాకు నీరు లాంటి సాంబరుతో అన్నంపెట్టినా ఆలోచించకుండా తిని కష్టపడ్డామన్నారు. మాపై కక్షతో తమ నివాసాలకు కరెంటు, మంచినీరు నిలిపివేశారన్నారు. లేబర్ కాంట్రాక్టర్‌కు ఇచ్చిన చెక్కులు బ్యాంకులో చెల్లుబాటు కాలేదని తెలిపారు. పోలవరం డీఎస్పీ ఏటీవీ రవికుమార్, సీఐ ఎం రమేష్‌బాబు, ఎస్సై కె శ్రీహరిరావు కలిసి ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ ఉపాధ్యక్షులు కావేజూఊరి తిరుమలేశ్వరరావుతో చర్చించారు. సమస్య ఒక కొలిక్కి రాలేదు. మా కంపెనీ ఎండీతో చర్చించి జీతాలు సమస్య పరిష్కరిస్తానని తిరుమలేశుని తెలిపారు. కార్మికులు మాత్రం నిరసన విరమించబోమని స్పష్టం చేశారు.

మావోయిస్ట్ లొంగుబాటు

విశాలాంధ్ర-కాకినాడ: ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన మావోయిస్ట్ ముత్తా రాయి అలియాస్ భీరయ్య గురువారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విశాల్‌గున్ని వివరాలను వెల్లడించారు. ఆంధ్రా ఒడిశా జోనల్ కమిటీ పరిధి మల్కాన్‌గిరిలోని ఆర్‌పీసీ దళంలో 2004లో చేరి ఎస్‌జెడ్‌సీ సభ్యులు దామోదర్‌కు గన్‌మెన్‌గా సంవత్సరకాలం పనిచేశాడన్నారు. 2012లో ఏరియా కమిటీ సభ్యుడి హోదాకు చేరిన తర్వాత సిద్ధాంతాలు నచ్చక బయటకు వచ్చి చెన్నైలో వెల్డర్‌గా పనిచేశాడన్నారు. పోలీసుల వేటను గుర్తించి స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు తెలిపారు. ముత్తా రాయికి తక్షణ ఆర్థిక సహాయం క్రింద రూ.20వేలు అందజేసేందుకు, పునరావాస ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు, ఏలూరు వారి ఉత్తర్వులు

ఆర్.ఓ.సి.నెం.ఇ-808972/2017/ఆర్ & ఆర్ తేది : 8-2-2018

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టమునకు రూపొందించబడిన సెక్షన్ ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్‌రూల్ (1) ననుసరించి ఇయ్యబడిన రూఢి ప్రకటనకు చేర్పులు)

అడెండం రూఢి ప్రకటన

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు వలన కుక్కునూర్ మరియు వేలేరుపాడు గ్రామములలో ముంపుకు గురి అగుచున్న భూములకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు ఇండ్ల స్థలములు మంజూరు చేయుటకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఏలూరు వారిచే భూసేకరణ చట్టం 2013నకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిర్దేశించిన 19(1) నిబంధనల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఏలూరు వారి ఉత్తర్వులు ఇ-808972/2017/ఆర్&ఆర్, తేది : 12.12.2017 దాఖలా ప్రచురణ చేయబడి ఆంధ్రప్రదేశ్ గెజిట్ అసాధారణము ఇష్యూ నెం. 122, తేది : 19.1.2017 నందు మరియు దినపత్రికలలో ప్రచురితమైన నోటిఫికేషనకు చేర్పులు చేయుచూ ఇవ్వబడిన రూఢి ప్రకటన.

షెడ్యూలు

మండలం : జంగారెడ్డిగూడెం గ్రామము : తాడువాయి

క్రమ సంఖ్య	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం (య.సెం.)	భూసేకరణ క్రింద విస్తీర్ణం (య.సెం.)	భూమి తరగతి (స్వభావం)	అనుభవదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	కట్టడములు/ చెట్లు
1	12/1C2	8.02	8.02	మెట్ట	పోతు రామకృష్ణ తండ్రి. గంగరాజు	13	15	18	8	పామాయిల్, కోకో, బిరన్-2, బోరు-2, కొబ్బరి-50, టేకు-40, వేప-50
2				మెట్ట	పోతు రాంబాబు తండ్రి. గంగరాజు					పామాయిల్, కోకో, బిరన్-2, బోరు-2, కొబ్బరి-70, టేకు-45, వేప-60
3	20/1A	0.18	0.18	మెట్ట	మల్లపర్తి వీరవెంకట సుబ్బారావు తండ్రి. వెంకటరావు	18	20/2	15	9	పామాయిల్ పైప్ లైను, డ్రిప
4	99/1	0.95	0.95	మెట్ట	శ్రీపాద శ్రీనివాస బాబి తండ్రి. పుల్లా రావు	98	100	97	89	
5	99/2	0.95	0.95	మెట్ట	శ్రీపాద పుల్లా రావు తండ్రి. మల్లయ్య					
6	99/3	0.95	0.95	మెట్ట	శ్రీపాద శ్రీనివాస బాబి తండ్రి. పుల్లా రావు					
7	99/4	0.95	0.95	మెట్ట	మహాదేవి విష్ణు కవిత భర్త. నరసింహా బాబి					
8	99/5	0.95	0.95	మెట్ట	వేదురి శ్రీదేవి భర్త. రమణ					
9	99/6	0.95	0.95	మెట్ట	శ్రీపాద నరేష్ తండ్రి. పుల్లా రావు					
10	116/3	5.97	5.97	మెట్ట	గూడూరి నాగవాణి	115	118	116/2	116/4	
11				మెట్ట	గూడూరి భూషయ్య					
12	356/2B	1.89	1.89	మెట్ట	శ్రీపాద బాలనాగమ్మ భర్త. పుల్లా రావు	356/1	354	356/3	360	పామాయిల్, బోరు-1, పైప లైను, కొబ్బరి-50
మొత్తం విస్తీర్ణం		21.76	21.76							

ఈ భూముల ప్లాను శ్రీ ఆర్ & ఆర్ అధికారి మరియు పథక నిర్వహణ అధికారి ఐ.టి.డి.ఏ.కే.ఆర్. పురం వారి కార్యాలయములో ఉంచడం అయినది. దానిని ఈ కార్యాలయపు పనివేళలో ఏ సమయములో అయిన తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన వారు ఎవ్వరును లేరు.

బొగ్గగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూములలోకాని లేదా ఒక ప్రత్యేక భాగములో కాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వటగాని తొలగించుట గాని చేయవలెను.

సం/- భాస్కర్ కాటంనేని, ఐ.ఎ.ఎస్.
జిల్లా కలెక్టరు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
అటవీ శాఖ

లేఖ సంఖ్య.1558/2017/ఏ1, వేలము ప్రకటన తేది : 06-02-2018

కృష్ణాజిల్లా ఫారెస్టు డివిజన్ పరిధిలో గల జీడి మామిడి ప్లాంటేషన్ల నుండి లభ్యమగు జీడి మామిడి ఫలసాయం 2017-18 సంవత్సరమునకు బహిరంగ వేలము వేయబడును. వేలము తేది : 22.2.2018 ఉ॥ 11గం.లకు. వేలము జరుగు ప్రదేశం : డివిజనల్ అటవీశాఖాధికారి వారి కార్యాలయము, గ్రీన్‌హౌస్, కస్తూరిబాయిపేట, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ. 22.2.2018 తేదీనాడు అమ్మకము కాని జీడి మామిడి ఫలసాయమును ది.3.3.2018, 13.3.2018, 21.3.2018 తేదీలలో పైన పేర్కొనబడిన సమయము నందు మరియు ప్రదేశమునందు తిరిగి నిర్వహించబడును. ఏ కారణము చేతనయినా పై తేదీలు ప్రభుత్వ సెలవు దినమైనచో తదుపరి వచ్చు పనిదినము నాడు వేలము నిర్వహించబడునని గమనించవలెను. ఇతర వివరములకు ఈ కార్యాలయమును సంప్రదించగలరు. ఫోన్ నెం. 0866-2474832.

సం/- డివిజనల్ అటవీశాఖాధికారి, కృష్ణా డివిజను, విజయవాడ

DIPR/3354/CL/ADVT-1/1/17-18 Dt. 08-02-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్

నిట్ నెం.379/డిఏ/2017-18 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది : 3-2-2018

తూర్పుగోదావరి జిల్లా పర్యవేక్షక ఇంజనీరు పంచాయతీరాజ్ శాఖలో 1 పనులు చేయుట. అంచనా విలువ : రూ.28.00 లక్షలు. టెండర్లు ఆహ్వానించడమైనది. డాక్యుమెంట్లు 9.2.2018, సా.4.30గం. నుండి ఇ-మార్కెట్‌ప్లేస్ https://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఫోన్ : 0884-2386992.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, కాకినాడ

DIPR/3347/CL/ADVT-1/1/17-18 Dt. 08-02-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.17/92 నుండి 94/ఇఇ/ఆర్&బి/కెఎస్‌జి/టిఓ/2017-18 తేదీ : 05-02-2018
పనుల సంఖ్య : 3. మొత్తం పనుల వ్యయం : రూ.14.60 లక్షలు. డౌన్‌లోడ్ కొరకు తేదీ & సమయం : 10-2-2018, సా.4 గం.ల నుండి 17-2-2018, మ.3 గం.లు వరకు. సమర్పణకు చివరి తేదీ : 10-2-2018, సా.4 గం.ల నుండి 17-2-18, సా.3.30 గం.ల వరకు. తెరుచు తేదీ : 17-2-2018, సా.4 గం.లు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా http://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఫోన్ : 272758

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, కనిగిరి

డిఐపిఆర్:3340/సిఎల్/ఎడివిటి-1/1/17-18, తేదీ : 08/02/2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
స్వల్పకాలిక చిట్ టెండరు ప్రకటన

నెం.6//ఇఇ/ఆర్&బి/కెఎస్‌జి/టిఓ/2017-18 తేదీ : 05-02-2018
పనుల సంఖ్య : 3. అంచనా వ్యయం : 2 పనులకు రూ.2.00 లక్షలు. దరఖాస్తుల స్వీకరణ మరియు టెండరు షెడ్యూళ్ల జారీ కొరకు తేదీ : 10.2.2018, సా.3.30 గం.ల నుండి 17-2-2018, సా.5 గం.లవరకు. టెండర్ల స్వీకరణ తేదీ : 10-2-2018, సా.3.30 గం.ల నుండి 18-2-2018, సా.3.30 గం.ల వరకు. టెండర్లు తెరుచు తేదీ : 18-2-2018, సా.4 గం.లు. ఫోన్ : 272758

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, కనిగిరి

డిఐపిఆర్:3349/సిఎల్/ఎడివిటి-1/1/17-18, తేదీ : 08/02/2018

హార్సీ హిల్స్‌లో అత్యాధునిక క్రీడా శిక్షణ కేంద్రం

- కొటావూరులో 3.74 ఎకరాల భూమి
- శాప్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర - బీ కొత్తకోట : చిత్తూరు జిల్లా బీ కొత్తకోట మండలం కొటావూరులో హార్సీ హిల్స్ అత్యాధునిక క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కానుంది. కొటావూరులో సర్వే నంబరు 571/1లో దీనికి 3.74 ఎకరాల భూమిని జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఆ భూమిలో రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ (శాప్) హార్సీ హిల్స్ అత్యాధునిక క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనుంది. కొటావూరులోని భూమిని శాప్‌కు అప్పగించాలంటూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సూచిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లె ప్రాంతంలోని హార్సీ హిల్స్‌కు దేశంలోనే ప్రత్యేక పేరు ఉంది. ఈ నేపథ్యంలో హార్సీ హిల్స్ పేరుతోనే స్పోర్ట్స్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటుకు శాప్ నిర్ణయించింది. భూమి కేటాయించాలంటూ జిల్లా కలెక్టర్‌ను కోర డంతో హార్సీ హిల్స్‌కు పది కిలో మీటర్ల దూరంలోని బీ కొత్తకోట మండలం కొటావూరులోని ప్రభుత్వ భూమిని మార్కెట్ ధరకు శాప్‌కు ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించారు. స్థానికంగా క్రీడలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా కేటాయించాలంటూ శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) ఎన్.బంగారరాజు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో యువజన సర్వీసులు, క్రీడలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం రెవెన్యూశాఖతో చర్చించి స్పోర్ట్స్ ట్రెనింగ్ సెంటర్‌కు 3.74 ఎకరాలను ఉచితంగా ఇచ్చేలా అంగీకరింపజేశారు. త్వరలోనే ఆ భూమిని రెవెన్యూశాఖ నుంచి స్వాధీనం చేసుకుని క్రీడా శిక్షణ కేంద్రం నిర్మాణ పనులను చేపట్టాలని శాప్ నిర్ణయించింది.

జాతీయ నేతల విగ్రహాలు ధ్వంసం

విశాలాంధ్రబ్యూరో - శ్రీకాకుళం : సిక్కోలులో జాతీయ నేతల విగ్రహాలకు పెద్ద అవమానమే జరిగింది. గాంధీజీ విగ్రహం ముక్కు చెవులను ధ్వంసం చేసిన ఘటన శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి గ్రామంలో చోటుచేసుకుంది. గాంధీ విగ్రహంతోపాటు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఆకతాయిల చర్యగా గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని ఈ విగ్రహాలను బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

Dwaraka

విశాలాంధ్ర

అధార్ లేని పౌరులకు

సామాజిక ప్రయోజనాలు తిరస్కరించొద్దు

కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : అధార్ కలిగి లేని ఏ వ్యక్తికీ సామాజిక ప్రయోజనాలను నిరాకరించరాదని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు గురువారం స్పష్టం చేసింది. గుర్తింపునకు సంబంధించిన ఇతర రూపాల ఆధారంగా వారికి సామాజిక ప్రయోజనాలను కొనసాగించాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.కె.సిక్రీ, ఎ.ఎం.ఖనవిల్కర్, డి.వై.చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్‌కు చెప్పింది. అధార్ కలిగి లేని వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు ఈ రోజుకీ తిరస్కరించబడుతున్నాయంటూ పిటీషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదించిన తర్వాత ధర్మాసనం పై విధంగా వ్యాఖ్యానించింది. ఏజీ మాట్లాడుతూ ఏ ఒక్కరికీ ప్రయోజనాలను నిరాకరించడం లేదని, ప్రభుత్వం ఇప్పటికే అధార్ పొందేందుకు మార్చి 31 వరకు గడువును పొడిగించిందని తెలిపారు. అయితే అధార్ లేని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు వితంతు పింఛన్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పోషకాహారం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలను నిరాకరిస్తున్నట్లు వస్తున్న వార్తలను సిబాల్ ఈ సందర్భంగా ఉటంకించారు. వారికి అటువంటి ప్రయోజనాలు నిరాకరించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. ప్రజలకు అటువంటి ప్రయోజనాలు నిరాకరించకుండా మంత్రిత్వ శాఖలను, విభాగాలు ప్రత్యామ్నాయ పద్ధతులను ఉంచాలంటూ 2017, డిసెంబరు 19న కేబినెట్ కార్యదర్శి జారీ చేసిన నోట్‌ను సిబాల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. వ్యక్తి గోప్యతకు ప్రాథమిక హక్కును ఇది ఉల్లంఘించినట్లేనంటూ అధార్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సిబాల్ తన వాదనను కొనసాగించారు. రేషన్ కార్డు, ఓటరు ఐడీ కార్డు లేదా ఇతర గుర్తింపుల ఆధారంగా ఆ ప్రయోజనాలను కొనసాగించాలని అటార్నీ జనరల్, అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను జస్టిస్ చంద్రచూడ్ ఆదేశించారు.



కడపలో



నెల్లూరులో

జనాగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన గురువారం చేపట్టిన రాష్ట్ర బంద్ గ్రాండ్ సక్సెస్ అయింది. తెల్లవారుఝాము 5 గంటల నుండే సీపీఐ, సీపీఎం ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన కార్యకర్తలు ఆర్టీసీ డిపోల వద్దకు చేరుకొని బస్సులు బైటకు రాకుండా ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ప్రదర్శనలు, బైక్ ర్యాలీలతో బంద్‌ను పర్యవేక్షించారు. అయితే ప్రభుత్వమే ముందస్తు జాగ్రత్తగా బస్సుల రాకపోకలను నిలిపివేసింది. ఈబంద్‌కి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్, జనసేన పార్టీలతో పాటు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టు సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ సంఘీభావం ప్రకటించాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బ్యాంకులు పనిచేయలేదు. పెట్రోలు బంక్‌లు తెరలేదు. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. లారీ అసోసియేషన్ పిలుపుతో ఎక్కడి లారీలు అక్కడే నిలిపివేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. హెల్త్ యూనివర్శిటీ, జెఎన్‌టీయూతోపాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలు సెలవు ప్రకటించాయి. గురువారం జరిగే అన్ని రకాల పరీక్షలను వాయిదా వేశాయి. ఇంటర్ బోర్డు సెకండ్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను వాయిదా వేసింది. హోటల్స్, చిన్న పాటి బడ్డీ కొట్లు సైతం మూసేసి బంద్‌కి మద్దతు ప్రకటించారు. సినిమాహాళ్ళలో ఉదయం ఆటలు రద్దు చేశారు. కార్మిక, కర్షక, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, వృత్తిపరమైన సంఘాలన్నీ ఎవరికివారే కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. విభజన హామీలు అమలు చేయాలని నినదించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ పట్ల వహిస్తున్న పక్షపాత వైఖరిని ఎండగట్టారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు అమలు చేయకపోతే తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. కర్నూలులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ బంద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విజయవాడలో పాల్గొన్నారు. బంద్‌ని పురస్కరించుకొని ప్రజా సంకల్పయాత్రను రద్దు చేసుకున్న వైసీపీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం దంగిగం వద్ద విద్యార్థులతో కల్సిన 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అనే ప్లకార్డును ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి అనంతపురం జిల్లా హిందూపురం బంద్‌లో పాల్గొన్నారు. మరోప్రక్క తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వినూత్న తరహాలు నిరసనలు చేపట్టారు. కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గుండు గీయించుకొని నిరసన తెలిపారు. దుబాయ్ పర్యటనలో వున్న సీఎం చంద్రబాబు బంద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అడిగి తెల్సుకున్నారు. బంద్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ, ఇతర పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.మొత్తం మీద స్వల్ప ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్‌ను పురస్కరించుకొని భారీ పోలీస్ బందోబస్తు చర్యలు చేపట్టినప్పటికీ, వారివైపు నుండి కూడా ఆందోళనకారులకు సంఘీభావం కనిపించింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బంద్ సందర్భంగా మొత్తం 693 మందిని అరెస్ట్ చేసినట్లు డీజీపీ మాలకొండయ్య తెలిపారు.

కర్నూలులో

కర్నూలు నగరంలో బంద్ విజయవంతమైంది. సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ, వైసీపీ, కాంగ్రెస్, జనసేన, ప్రజాసంఘాల నేతలు ప్రదర్శనగా వీధుల్లో తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గసభ్యులు పీజే చంద్రశేఖర్‌రావు, పి.హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, పి.భీమలింగప్ప, సీపీఎం రాష్ట్ర నాయకులు షడ్రక్, జిల్లా కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తదితరులు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, అందుకు నిరసనగానే రాష్ట్ర బంద్ చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి విభజన హామీలన్నీ అమలు చేయని పక్షంలో ఢిల్లీకి వెళ్ళి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆళ్ళగడ్డలో మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ చేపట్టారు.

గుంటూరులో

గుంటూరు జిల్లావ్యాప్తంగా బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, మాజీ ఎమ్మెల్సీ పాశం రామారావు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. సుబ్బారావు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో

విశాఖపట్నంలో బంద్ పురస్కరించుకొని వామపక్షాల ఆధ్వ ర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఏజే స్టాలిన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సీహెచ్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాలో

కడప జిల్లా వ్యాప్తంగా బంద్ పూర్తి విజయవంతమైంది. కడపలో సీపీఐ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, నగర కార్యదర్శి వెంకట శివ తదితరులు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో

కృష్ణా జిల్లాలో విజయవాడ నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా బంద్ విజయవంతమైంది. విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సినీ విమర్శకుడు కత్తి మహేష్, వైసీపీ నాయకులు కొలుసు పార్థసారథి, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, సుంకర పద్మశ్రీ, సీపీఐ ఎంఎల్ నాయకులు ముప్పాళ్ళ భార్గవ్‌శ్రీ, ఏసు తదితరులు బంద్‌లో పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యాన జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించి లెనిన్‌సెంటర్‌లో మానవహారం నిర్మించారు. లారీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.వి.ఈశ్వర రావు ఆధ్వర్యాన బెంజిసర్కిల్‌లో ధర్నా చేపట్టారు. జగ్గయ్యపేటలో కృష్ణాజిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో అరెస్టులు

శ్రీకాకుళంలో బంద్‌ని పురస్కరించుకొని పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వామపక్షనేతలను ముందస్తు అరెస్టులు చేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 560 మందిని అరెస్ట్ చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సాయంత్రం వరకు వుంచారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చాపర వెంకటరమణ, బి.కృష్ణమూర్తిలతోపాటు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు, ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు తాండ్ర ప్రకాష్, నీలంరాజులను అరెస్ట్‌చేశారు.

విజయనగరంలో

విజయనగరం జిల్లాలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు, సీపీఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు యడ్ల ఆదిరాజు, వైకాపా నాయకులు మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాలో

జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతం కావడంతో జనజీవనం స్థంభించింది. జిల్లా కేంద్రంలో కృష్ణ కళామందిరం నుండి శ్రీకంఠం సర్కిల్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శులు సి.జాఫర్, నారాయణస్వామిలు పాల్గొన్నారు. పెనుకొండలో ఎమ్మెల్యే బీకే పార్థసారథి నిరసన కార్యక్రమం చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లాలో

వామపక్షాల పిలుపుమేరకు కాకినాడలో బంద్ సంపూర్ణంగా జరిగింది. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యాన నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించి కోటిపల్లి సెంటర్‌లో మానవహారం నిర్మించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో

జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతమైంది. అయితే సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్‌ను పోలీసులు తెల్లవారుఝామునే హౌస్ అరెస్ట్ చేశారు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చిత్తూరు జిల్లాలో

జిల్లాలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచే సీపీఐ, సీపీఎం కాంగ్రెస్ శ్రేణులు తిరుపతి పూర్ణకుంభం సర్కిల్ వద్ద రోడ్డుపై బైటాయించి వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్థంభించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సీపీఎం నాయకులు కుమార్‌రెడ్డి, కందారపు మురళి తదితరులు బంద్‌కి నాయకత్వం వహించారు. ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, నగరి ఎమ్మెల్యే రోజా, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మద్దతు తెలిపారు. పుత్తూరులో సీపీఐ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

నెల్లూరులో

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వామపక్షాల బంద్‌ని పురస్కరించుకొని నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అన్ని పట్టణాల్లో బంద్ చేయించారు. నెల్లూరు జిల్లా సీపీఐ కార్యదర్శి పార్థసారధిని సూళ్లూరుపేటలో పోలీసులు అరెస్ట్ చేశారు.



ఒంగోలులో



ఉయ్యూరులో గుండు గీయించుకున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



విజయవాడలో



మోడీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

బీజేపీ, టీడీపీ, టీఆర్‌ఎస్ రాజకీయ అవకాశవాదం : నారాయణ విమర్శ


విశాలాంధ్ర-వరంగల్‌బ్యూరో: ప్రధాని నరేంద్రమోడీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. గురువారం హన్మకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు బీజేపీ, టీడీపీ అంగీకరించి నేడు అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నాయని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన బీజేపీ, లేఖ ఇచ్చిన టీడీపీలు...రాష్ట్ర విభజన సరిగా జరగలేదంటూ ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నాయని నిశితంగా విమర్శించారు. విభజన సమయంలో హామీ ఇచ్చినట్టు వరంగల్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రాలేదని, ఆంధ్రకు ప్యాకేజీలు ఇవ్వలేదని అన్నారు. కేంద్రం అటు ఏపీ, ఇటు తెలంగాణను మోసం చేసిందని నారాయణ అన్నారు. బీజేపీతో పొత్తు వల్ల టీడీపీ ఎంపీలు మాట్లాడటం లేదని, తెలంగాణలో టీఆర్‌ఎస్ ఎంపీలు కూడా ఎందుకు ప్రశ్నించడం లేదని, మోడీని చూస్తే భయపడుతున్నారని అన్నారు. టీడీపీ రెండు కళ్ల సిద్ధాంతాన్ని ఇప్పుడూ కొనసాగిస్తోందని నారాయణ అన్నారు. టీడీపీ, టీఆర్‌ఎస్, వైసీపీ నేతలకు మోడీని చూస్తే వణుకుపడుతుందని విమర్శించారు. మోడీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలే ఇందుకు కారణమని అన్నారు. చివరకు వెంకయ్యనాయుడినే తనకు పోటీ కాకుండా బ్లాక్‌మెయిల్‌తో ఉప రాష్ట్రపతిని చేసిన చరిత్ర మోడీదని వ్యాఖ్యానించారు. నరేంద్రమోడీ వల్ల రాజ్యాంగానికి పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. ఢిల్లీలో 20మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులను చేశారని, అదే ఆంధ్ర, తెలంగాణ ఎమ్మెల్యేలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. ఎన్నికల కమిషన్‌ను, రాష్ట్రపతిని ప్రభావితం చేయడంతో పాటు సీబీఐని రాజకీయాలకు వాడుకుంటున్నాడని దుయ్యబట్టారు. గవర్నర్ వ్యవస్థను, న్యాయవ్యవస్థను భ్రష్టుపట్టించారని, నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రోడ్డెక్కారని అన్నారు. మోడీ పాలనలో కళాకారులకు, కళలకు, చివరకు సినిమాలకు భద్రత లేదన్నారు. జాతీయస్థాయిలో ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష ఫ్రంట్ ఏర్పాటునకు వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, ఈ సమయంలో తెలంగాణలో సీపీఎం బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం తొందరపాటు చర్య అని నారాయణ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేసీఆర్‌ను ఓడించడానికి బలమైన ప్రత్యామ్నాయం కావాలని సీపీఐ భావిస్తున్నదని, బీజేపీ, టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి సారయ్య, పార్టీ నేతలు సిరబోయిన కరుణాకర్, మేకల రవి, నేదునూరి జ్యోతి, పనాస ప్రసాద్, కర్రె భిక్షపతి, ఎస్‌కె.భాషుమియా, మోతె లింగారెడ్డి, సల్లా శ్రావణి పాల్గొన్నారు.

డీపీఆర్‌లు, యూసీలు ఎప్పుడో ఇచ్చాం : మంత్రి నారాయణ

విశాలాంధ్ర-అమరావతి : రాజధాని నిర్మాణానికి డీపీఆర్‌లు ఇవ్వలేదని బీజేపీ నేతలు చెప్పడాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఖండించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేసిందే కాకుండా తెలుగుదేశం ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయటాన్ని ఆయన తప్పుబట్టారు. గురువారం డీపీఆర్‌లకు సంబంధించిన సమగ్ర వివరాలను, కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.11,600 కోట్లు కోరుతూ డీపీఆర్ ఎప్పుడో అందజేశామని, అయితే కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు యూసీలు కూడా అందజేశామని, మరో రూ.1000 కోట్లు గుంటూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విజయవాడలో మురుగు నీరు తరలింపు పనులకు ఇచ్చారన్నారు. ఈ ప్రాజెక్టుల పూర్తికి మూడేళ్ల కాల వ్యవధిగా నిర్ణయించారన్నారు. రాష్ట్రంలో 11 కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటుకు పునర్విభజన చట్టంలో పేర్కొన్నారన్నారు. ఇందుకోసం రూ.11 వేల ఖర్చవుతుందని ఆ చట్టంలో తెలిపారన్నారు. ఇంత వరకూ కేవలం రూ.ఐదారు కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఇలా అయితే 20 ఏళ్లయినా కేంద్ర విద్యా సంస్థల భవనాల నిర్మాణం పూర్తికాదన్నారు. విశాఖ రైల్వే జోన్, కడపలో ఉక్కు పరిశ్రమ, దుగరాజ పట్నం పోర్టు, విశాఖ-చెన్నై కారిడార్ ఊసేలేదన్నారు. అదక్కుండానే బెంగళూరు మెట్రోకు రూ.15 వేల కోట్లు, ముంబయి, అహ్మదాబాద్ మెట్రోకు రూ.లక్ష కోట్లు ఇచ్చారన్నారు. విశాఖ, విజయవాడ మెట్రోకు రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలనే తమ ప్రభుత్వం కోరుతుందన్నారు. ఇందుకోసం పార్లమెంట్‌లో తమ పార్టీ ఎంపీలు పోరాడుతున్నారన్నారు.కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరగడంపై టీడీపీ ప్రభుత్వం పోరాటం చేస్తుంటే, తమ పోరాటాన్ని అడ్డుకోవడానికి యత్నిస్తున్న ప్రతిపక్ష వైసీపీ నాయకుల తీరు దురదృష్టకరమని మంత్రి నారాయణ మండిపడ్డారు.

అవినీతి కేసులో బంగ్లా మాజీ ప్రధాని

ఖలీదాజియాకు ఐదేళ్ల జైలు



ఢాకా : అవినీతి కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి ఖలీదా జియాకు గురువారం ఐదేళ్ల జైలు శిక్ష పడింది. డిసెంబరులో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా ఈ 72 ఏళ్ల ప్రధాన ప్రతిపక్ష నాయకురాలకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. తన భర్త దివంగత జియార్ రెహ్మాన్ తర్వాత జియా అనాథల ట్రస్టు కోసం విదేశీ విరాళాల్లో 21 మిలియన్ల టకా(2,50,000 మిలియన్ డాలర్లు) దుర్వినియోగం కేసులో మూడుసార్లు ప్రధాని పదవిని అలంకరించిన ఖలీదాజియాకు ఢాకా ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించింది. జియా అనాథల ట్రస్టు కేసులో గైర్హాజరయ్యేందుకు ప్రయత్నించిన జియా పెద్ద కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) సీనియర్ ఉపాధ్యక్షుడు తారిక్ రెహ్మాన్, మరో నలుగురికి కూడా న్యాయస్థానం 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. న్యాయమూర్తి మహమ్మద్ అక్తుర్‌జమన్ తీర్పును వెలువరిస్తూ, ఈ కేసులో నిందితులపై ఉన్న సందేహాలన్నీ నిరూపించబడ్డాయన్నారు. రాజకీయ ఉద్రిక్తత నడుమ తెలుపురంగు చీర ధరించిన జియా కోర్టు గదిలోకి వచ్చారు. జియాకు కఠిన శిక్ష విధించిన న్యాయమూర్తి మాట్లాడుతూ 'ఆమె ఆరోగ్యం, సామాజిక హోదా దృష్ట్యా ఈ శిక్ష స్వల్పమేనన్నారు. జడ్జి 10 నిమిషాల్లో 632 పేజీల తీర్పును సంక్షిప్తంగా చదివారు. ఈ సమయంలో బీఎన్‌పీ నాయకులు కోర్టు గదిలోనే ఉన్నారు. ఈ కేసులో నేరస్తులందరూ ఒకే పాత్ర పోషించినప్పటికీ, జియా వయస్సు, సామాజిక హోదాను దృష్టిలో పెట్టుకుని స్వల్పకాల శిక్షను విధించినట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు పేరును మార్చడం ద్వారా 35 సందర్భాల్లో డిఫెన్స్ వారు సమయం కోరుతూ కోర్టు కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని కూడా కోర్టు తెలిపింది. ఈ కేసులో ఇతర నిందితులుగా చట్టసభ మాజీ సభ్యుడు కజి సలీముల్ హుక్ కమల్, వ్యాపారవేత్త షరీఫుద్దీన్ అహ్మద్, మాజీ ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి కమల్ ఉద్దీన్ సిద్ధిఖీ, ఆమె మేనల్లుడు మోమినుర్ రెహ్మాన్‌లు ఉన్నారు. ఒక అవినీతి కేసులో దోషిగా నిర్ధారించబడిన రాజకీయ నాయకుదుర, మాజీ సైనిక నియంత హెచ్‌ఎం ఎర్షాద్ తర్వాత ప్రభుత్వ అధిపతిగా అవినీతికి పాల్పడిన రెండో వ్యక్తిగా ఖలీదాజియా నిలిచారు. న్యాయ నిపుణులు మాట్లాడుతూ అవినీతి కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఖలీదాజియాకు కోలుకోని దెబ్బ అని, డిసెంబరులో జరిగే సాధారణ ఎన్నికలతో సహా ఏ ఇతర ఎన్నికల్లో పోటీకి ఆమె అనర్హులు కావచ్చని అన్నారు. ఈ కేసులో జియా, ఇతరులపై విచారణ జరిపిన నాలుగేళ్ల తర్వాత తీర్పు వెలువడింది. కాగా హైకోర్టులో తీర్పును సవాల్ చేస్తామని జియా తరఫు న్యాయవాది ఖాండేకర్ మహబబ్ హుస్సేన్ విలేకరులకు తెలిపారు. న్యాయస్థానం తీర్పు వెలువడిన వెంటనే భద్రతా సిబ్బంది జియాను ఒక తెలుపు రంగు జీపులో ఢాకా సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే అసలు జైలును శివారులోని కెరానిగంజ్‌కు తరలించారు. అయితే మాజీ ప్రధాని సౌకర్యార్థం ఒక సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. హోం శాఖ మంత్రి అసదుజామన్ ఖాన్ మాట్లాడుతూ మూడుసార్లు దేశ ప్రధానిగా సేవలందించిన ఆమె వయస్సు, హోదాను దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఖలీదాజియాకు శిక్ష పడిన నేపథ్యంలో సాయుధ బలగాలు గట్టి పహారా ఏర్పాటు చేశాయి.

ఇక ఐక్య ఉద్యమాలు

జేపీతో పవన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల పట్ల కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆక్షేపించారు. విభజన చట్టంలోని అనేక అంశాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకుగాను ఐక్య ఉద్యమాలకు రూపకల్పన చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. అందులో భాగంగా జేపీసీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. అనేక అంశాలపై జయప్రకాష్‌తో చర్చించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. విభజన హామీలోని అంశాల సాధనే ధ్యేయంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని, అందరినీ కలుపుకుపోతామని పవన్, జేపీ చెప్పారు. కేంద్రప్రభుత్వంపై ఏ విధంగా ఒత్తిడి పెంచి విభజన హామీలు సాధించుకోవాలనే దిశగా సమాలోచనలు జరుపుతున్నట్లు వివరించారు. జేపీసీ చైర్మన్ కోసం 5-6 పేర్లను పరిశీలిస్తున్నామని, వారిలో ఒకరిని ఎన్నుకుంటామన్నారు. రెండు రాష్ట్రా ల్లో ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఏర్పడినందున కొంత కాలం వేచి చూశామన్నారు. అదే సమయంలో ప్రధాని మోడీ అనేక సందర్భాల్లో ప్రత్యేక ప్యాకేజీపై పలు రకాలుగా వ్యాఖ్యలు చేశారని, అందుకే కొంత ఆశతో అన్ని పార్టీలు వేచిచూశాయన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని, ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా అడుగులు వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామన్నారు. యూపీఏ ప్రభుత్వం చట్టం తీసుకువచ్చినా దానికి బీజేపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అందరి మద్దతుతోనే రాష్ట్ర విభజన జరిగిందన్నారు.

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు : సీఎస్

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో నేషనల్ రూర్బన్ మిషన్ కింద 2016 -2020 ఐదేళ్లలో ఎంపిక చేసిన గ్రామ పంచాయితీల్లో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఈ పథకంపై ఏర్పాటైన రాష్ట్రస్థాయి ఎంపవర్డ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అగ్రి ప్రాసెసింగ్, ఆగ్రో సర్వీసెస్, స్టోరేజి అండ్ వేర్ హౌసింగ్, పూర్తి పరికరాలతో కూడిన మొబైల్ హెల్త్ యూనిట్లు ఏర్పాటుకు, [illegible] పాఠశాలల్లో తగిన [illegible] పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు, ప్రతి ఇంటికీ కుళాయి నీరు సరఫరాకు, సాలిడ్ వేస్టు మేనేజిమెంట్‌కు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామమంతటా డిజిటల్ లిటరసీ సేవలు అందుబాటులోకి తేవాలని, సిటిజన్ సెంట్రిక్ సేవలన్నీ ఈ-గ్రామ కనెక్టివిటీ కింద పొందేందుకు వీలుగా అవసరమైన సిటిజన్ సర్వీసు సెంటర్లు (సీఎస్సీ) ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అదనపు పౌష్టికాహారాన్ని అందించేందుకు కూడా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ముఖ్యకార్యదర్శులు ఎస్‌ఎస్ రావత్, నీరబ్ కుమార్ ప్రసాద్, కెఎస్. జవహర్ రెడ్డి, పంచాయితీరాజ్ కమీషనర్ బి.రామాంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Dwaraka

అదే లేకుంటే.. నేనేం చేస్తానో..



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాపై వీరోచిత ఫామ్ కనబరుస్తున్నాడు టీమిండియా సారథి విరాట్ కోహ్లి. మూడు మ్యాచుల్లో వరుసగా రెండు శతకాలు బాదేశాడు. కేప్‌టౌన్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో అయితే అతడి ఆట అద్భుతమని చెప్పాలి. కేవలం సింగిల్స్, డబుల్స్ ద్వారానే తన 160 పరుగుల్లో 100 సాధించాడు. తన శారీరక దారుఢ్యం ఎంత బాగుందో చెప్పకనే చెప్పాడు. సఫారీలపై మూడో వన్డేలో విజయం సాధించిన తర్వాత కోహ్లి మీడియాతో మాట్లాడాడు. 'ఈ ఏడాది నేను 30వ పడిలో పడ్డాను. ఇప్పుడు ఆడినట్టే 34-35 ఏళ్లప్పుడూ ఆడాలనుకుంటున్నా. అందుకే చాలా తీవ్రంగా కసరత్తులు చేస్తున్నాను. నేను తీక్షణతో ఆడే రకాన్ని. ఆ తీక్షణత నా నుంచి పోతే మైదానంలో నేనేమి చేస్తానో నాకే తెలియదు. అందుకే నేనెప్పుడూ కసరత్తులు చేస్తూనే ఉంటాను. ఆహార అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాను. అవే ఇప్పుడు నాకు ఫలితా లను ఇస్తున్నాయి. జట్టుకు అవసరమైనప్పుడు మనం నిలబడాలి. ఒక ఆటగాడిగా ఇలాంటి రోజుల కోసం ఎదురుచూడాలి' అని కోహ్లి అన్నాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగులు చేయడం సులభం కాదు. చాలా కష్టపడాలి. బ్యాటింగ్, ఫ్లాట్ పిచ్‌లపై సులభంగా పరుగులు చేయొచ్చేమో గానీ బౌన్స్, స్వింగ్ పిచ్‌లపై అంత తేలిక కాదు. అలాంటప్పుడు పరిస్థితులకు తగినట్టు అలవాటు పడి పరుగులు సాధించాలి. మూడో వన్డేలో 30వ ఓవర్ తర్వాత పిచ్ మారింది. అలాంటప్పుడు దానికీ అలవాటు పడాలి. నేను 90 పరుగుల వద్ద ఉన్నప్పుడు పిక్కలు పట్టుకున్నాయి. వికెట్లు పడుతుండటంతో బలం లేకున్నా నిలకడగా ఆడాలని నిర్ణయించుకున్నా. పిచ్‌లో ఒకరు దూకుడుగా ఆడుతుంటే మరొకరు స్ట్రైక్ ఇవ్వాలి. నేను అలాగే చేస్తాను. ఛేదనలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. ఎప్పుడు సింగిల్స్ తీయాలి ఎప్పుడు దూకుడుగా ఆడాలి నిర్ణయించు కోవడం చాలా కష్టం. మేం సిరీస్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్నం దుకు సంతోషంగా ఉంది. ఇప్పుడు మేం సిరీస్ చేజార్చుకునే అవకాశమే లేదు. నాలుగో మ్యాచులో మేం మరింత తీక్షణతతో, పట్టుదలతో ఆడతాం' అని కోహ్లి అన్నాడు.



వీరూ.. 'ఐస్' బాదుడు..!

సెయింట్ మోర్టిజ్: రిటైర్ అయినా వీరూ పవర్ తగ్గలేదు. మామూలు మైదానంలో కాదు ఐస్ స్టేడియంలోనూ సెహ్వాగ్ చెలరేగుతున్నాడు. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ మోర్టిజ్‌లో జరుగుతున్న ఐస్ టీ20 టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో వీరూ సత్తా చాటాడు. షాహిద్ అఫ్రిది నాయకత్వంలోని రాయల్స్ ఎలెవన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెహ్వాగ్ తనదైన శైలిలో రెచ్చిపోయాడు. డైమండ్స్ ఎలెవన్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సెహ్వాగ్ 30 బంతుల్లో 60 పరుగులు బాదాడు. తనకు అలవాటైన షాట్లతో అభిమానులను అలరించాడు. సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. 200 స్ట్రైక్ రేటుతో సెహ్వాగ్ విజృంభించడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.



స్పిన్నర్ల అరుదైన ఘనత

కేప్‌టౌన్: ప్రస్తుత భారత క్రికెట్ జట్టులో స్పిన్ ద్వయంగా ముద్ర వేసుకున్న కుల్దీప్ యాదవ్, చాహల్‌లు అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూసుకుపోతున్న ఈ జంట.. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలో ఒక రికార్డును సైతం ఖాతాలో వేసుకున్నారు. వీరిద్దరూ తలో నాలుగు వికెట్లు సాధించి సఫారీల పతనాన్ని శాసించారు. తద్వారా ఒకే వన్డేలో భారత్ తరపున తొలిసారి ఇద్దరు స్పిన్నర్లు నాలుగేసి వికెట్ల చొప్పున తీసిన ఘనతను సాధించారు. బుధవారం మ్యాచ్‌లో పోటీపడి వికెట్లు తీసిన వీరి దెబ్బకు దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 179 పరుగులకే చేతులెత్తేసింది. దాంతో భారత జట్టు 124 పరుగుల తేడాతో విజయ సాధించి హ్యాట్రిక్ గెలుపును సొంతం చేసుకుంది. ఈ సిరీస్‌లో భారత స్పిన్నర్లు ఇప్పటివరకూ సాధించిన వికెట్లు 21. ఫలితంగా దక్షిణాఫ్రికాలో ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక వికెట్ల సాధించిన ఘనతను కూడా భారత్ తన పేరిట లిఖించుకుంది.

త్వరలో రిటైర్మెంట్ : మలింగ

ముంబై ఇండియన్స్ బౌలింగ్ మెంటార్‌గా నియామకం



ముంబై: త్వరలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తా అంటున్నాడు శ్రీలంక పేసర్ లసిత్ మలింగ. తాజాగా మలింగ ముంబై ఇండియన్స్ బౌలింగ్ మార్గనిర్దేశకుడిగా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'క్రికెట్‌కు దూరం అయ్యేందుకు మానసికంగా సిద్ధమవుతున్నా. భవిష్యత్తులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాలన్న దాని గురించి ఆలోచించడం లేదు. నా రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించేందుకు ప్లాన్ చేసుకుంటున్నాను. అందరూ ఏదో ఒక రోజు ఆటకు దూరం కావల్సిన వారే' అని మలింగ అన్నాడు. 'దీనిపై ఇంకా శ్రీలంక క్రికెట్ బోర్డుతో మాట్లాడలేదు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు నా శరీరం ఏ విధంగా సహకరిస్తుందో చూడాలి. ఐపీఎల్‌లోనూ నా కెరీర్ ముగిసింది. ముంబై ఇండియన్స్‌తో కలిసి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాను. మళ్లీ ఆడాలని మాత్రం అనుకోవట్లేదు. ముంబై ఇండియన్స్ నన్ను రిటెన్షన్‌లో తీసుకోలేదని నేను ఈ నిర్ణయం తీసుకోలేదు. ముంబై తరపున 10ఏళ్లు ఆడాను. ఎన్నో సాధించాను. ఈ ఏడాది ఐపీఎల్ వేలానికి ముందే యాజమాన్యం నాతో సంప్రదింపులు జరిపింది. వచ్చే మూడేళ్ల కోసం మంచి జట్టును తయారు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. యువ ఆటగాళ్లతో పోటీ పడే సామర్థ్యం నాలో తగ్గిపోయిందని నాకు అర్థమైంది. ఇప్పుడు నా వయసు 34. నేను ఏమీ యువకుడిని కాదు కదా. నేను రిటైర్మెంట్ యోచనలో ఉన్నప్పుడు ముంబై ఇండియన్స్ బౌలింగ్ మెంటార్‌గా ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉంది' అని మలింగ వివరించాడు.

'పవర్' అంబాసిడర్‌గా మంధాన



న్యూఢిల్లీ: గతేడాది జరిగిన ఐసీసీ వన్డే ప్రపంచకప్ తర్వాత భారత మహిళా క్రికెటర్లకు ఆదరణ అమాంతం పెరిగింది. హర్మన్‌ప్రీత్ కౌర్, వేద కృష్ణమూర్తి వంటి అమ్మాయిలు ఆస్ట్రేలియాలో బిగ్ బాష్ లీగులకు ఎంపికయ్యారు. చక్కని ఆటతీరుతో అదరగొట్టారు. ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన వారి ప్రదర్శనలు ఇప్పటికీ సగటు అభిమానికి గుర్తున్నాయి. వన్డే ప్రపంచకప్‌లో తొలి రెండు మ్యాచుల్లో అదరగొట్టిన ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి మంధాన గుర్తుంది కదా! ఇప్పుడు దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ దుమ్మురేపుతోంది. ఆతిథ్య జట్టుతో జరిగిన రెండు మ్యాచుల్లో పరుగుల వరద పారించింది. తాజాగా ఈ 21 ఏళ్ల క్రీడాకారిణి బాటా స్పోర్ట్ వేర్ బ్రాండ్ 'పవర్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైంది. ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. 'అత్యంత ప్రతిభగల స్మృతి యువతకు ఆదర్శంగా ఉండగలదు. ఆమె మా అంబాసిడర్‌గా ఎంపికైనందుకు చాలా ఆనందంగా ఉంది' అని బాటా ఇండియా ప్రతినిధి సందీప్ కటారియా అన్నారు.

కోహ్లి.. ఓ జీనియస్ : మియాందాద్

కరాచీ: విరాట్ కోహ్లి ఓ జీనియస్, ప్రపంచంలోనే మేటి బ్యాట్స్‌మెన్ అంటూ పాక్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో కోహ్లి 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. కోహ్లి కెప్టెన్ ఇన్నింగ్స్ యావత్తు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ నేపథ్యంలో పాక్ మాజీ ఆటగాడు జావెద్ మియాందాద్ మాట్లాడుతూ..'అతడి బ్యాటింగ్‌లో ప్రత్యేకమైన టెక్నిక్ ఉంది. అందుకే అతడు ప్రతి ఇన్నింగ్స్‌లో పరుగులు రాబట్టగలుగుతున్నాడు. ఏ బ్యాట్స్‌మెన్‌కి అయినా ఓ టెక్నిక్ ఉంటుంది. అయినప్పటికీ ఒక్కోసారి ఫెయిలవుతూ ఉంటాడు. కానీ, కోహ్లి విషయంలో అలా జరగదు. బౌలర్ల బలాలు, బలహీనతలను తెలుసుకుని వారిని సమర్థంగా ఎదుర్కొంటున్నాడు. అతడో జీనియస్. అంతేకాదు ప్రపంచంలోనే మేటి బ్యాట్స్‌మెన్' అని ప్రశంసించాడు.



కరాటేలో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆరవ జాతీయ కరాటే పోటీల్లో ఎన్టీఆర్ నగర్‌కు చెందిన అక్కా, చెల్లెల్లు అత్యంత ప్రతిభ కనబర్చి మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అక్కా, చెల్లెలు బాతరాజు రేణుక, ఉషాలు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఫైరింగ్‌లో కటాస్‌లో రేణుక రెండు గోల్డ్ మెడల్స్‌లు గెలుచుకోగా, ఆమె చెల్లి ఉషా రెండు గోల్డ్ మెడల్స్‌ను గెలుచుకుంది. కరీంనగర్‌లో జరిగిన 6వ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్-2018లో గోల్డ్‌మెడల్స్‌తో వారు విజేతలుగా నిలిచారు. ఒక వైపు విద్యాభ్యాసం చేస్తూ, మరోవైపు క్రీడల్లో రాణిస్తూ కరాటేలో సైతం అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి గోల్డ్‌మెడల్‌ను సాధించారు. కోచ్ రాము పర్యవేక్షణలో రేణుక, ఉషాలు శిక్షణ పొందుతూ కరాటేలో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. రాము మాట్లాడుతూ ఆడపిల్లలకు కరాటే చాలా ముఖ్యమని అన్నారు. బలమైన దేహం లేకపోయినా, దృఢ సంకల్పంతో, ఆత్మవిశ్వాసంతో రేణుక, ఉషాలు ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

సింధు గెలిచినా.. భారత్ ఓడింది..!



అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు గెలిచినా.. భారత్‌కు ఓటమి తప్పలేదు. గ్రూప్-డబ్ల్యూలో ఉన్న భారత మహిళల జట్టు లీగ్‌లో భాగంగా గురువారం జపాన్‌తో తలపడి 1-4 తేడాతో ఓటమి పాలైంది. మహిళల సింగిల్స్ తొలి మ్యాచ్‌లో సింధు 21-19, 21-15 తేడాతో ప్రపంచ నంబర్-2 క్రీడాకారిణి యమగూచిపై రెండు వరుస సెట్లలో విజయం సాధించి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. అనంతరం జరిగిన మరో సింగిల్స్‌లో శ్రీ కృష్ణప్రియ 12-21, 10-21 తేడాతో సయాక సాటో చేతిలో పరాజయం పాలైంది. అనంతరం జరిగిన డబుల్స్ మ్యాచుల్లో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. దీంతో 1-4 తేడాతో భారత్ జపాన్ చేతిలో ఓటమి చవిచూసింది. ఇక్కడ ఊరట కలిగించే విషయం ఏమిటంటే జపాన్ చేతిలో ఓడినప్పటికీ భారత్‌కు క్వార్టర్స్‌లో చోటు దక్కింది. ఎందుకంటే అంతకుముందు భారత్.. చైనా, హాంకాంగ్‌పై విజయం సాధించి గ్రూప్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో గ్రూప్-డబ్ల్యూ నుంచి జపాన్‌తో పాటు భారత్ క్వార్టర్స్ చేరుకుంది.

డివిలియర్స్ ఫిట్.. కలిసొస్తుంది : డుమ్మి



కేప్‌టౌన్: గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు దూరమైన మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్ శనివారం భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే నాలుగో వన్డేకు అందుబాటులో ఉండనున్నాడు. జట్టులోకి డివిలియర్స్ పునరాగమనం తమకు కలిసొచ్చే అంశమని సఫారీ ఆటగాడు జేపీ డుమిని తెలిపాడు. కేప్‌టౌన్ వన్డే అనంతరం డుమిని మాట్లాడుతూ..'ప్రపంచంలోనే గొప్ప ఆటగాళ్లలో డివిలియర్స్ ఒకడు. గాయం కారణంగా భారత్‌తో తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. శనివారం జొహానెస్‌బర్గ్‌లో ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే జరగనుంది. ఈ వన్డేకు డివిలియర్స్ అందుబాటులో ఉంటాడు. అతని పునరాగమనంతో జట్టులో ఉత్సాహం రెట్టింపవుతుంది. సిరీస్ ఇంకా భారత్ వశం కాలేదు. ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఒత్తిడి నుంచి కోలుకుని మిగతా మూడు వన్డేల్లో సత్తా చాటుతాం' అని డుమిని తెలిపాడు. అనంతరం కోహ్లిసేన గురించి మాట్లాడుతూ..'భారత జట్టు మాకంటే ఎక్కువగా పరిస్థితులను అర్థం చేసుకుంటోంది. ఎంత లెంగ్త్‌తో, వేగంతో బంతులేయాలో ప్రణాళిక ప్రకారం అమలు చేస్తోంది. అందుకే మేము పరుగులు చేయలేకపోతున్నాం. వారి బంతుల్ని మా బ్యాట్స్‌మెన్ అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నారు. ఒకసారి మేము ఫామ్‌లోకి వస్తే చాహల్, కుల్‌దీప్ యాదవ్ బంతుల్ని సులువుగా ఎదుర్కొంటాం' అని డుమిని ఆశాభావం వ్యక్తం చేశాడు.

బంద్ విజయవంతం : వామపక్షాలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై వామపక్షాలు, ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు నిర్వహించిన బంద్ విజయవంతమైందని వామపక్ష పార్టీల నాయకులు ప్రకటించారు. ప్రభుత్వాలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న నిరసనకు బంద్ ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య సహా పలువురు నేతలు మాట్లాడారు. బంద్‌కు రాజకీయపార్టీలు, ప్రజా, వర్తక, వాణిజ్య, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలన్నీ కలిసొచ్చాయన్నారు. ప్రజల ఆగ్రహం బంద్ ద్వారా తీవ్రస్థాయిలో వ్యక్తమైందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్పందన లభించిందన్నారు. పార్లమెంటులో మోడీ ప్రసంగంలోనూ విభజన చట్టంలో హామీలు అమలు చేస్తామో లేదో చెప్పకుండా కేవలం ప్రతిపక్ష కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు ఎక్కుపెట్టడం దారుణమన్నారు. లోటు బడ్జెట్ రూ. 16వేల కోట్లు ఉందని నిర్ధారించినా దానిని భర్తీ చేయలేదన్నారు. ఇప్పటికైనా బీజేపీ వెంటనే స్పందించి జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని సూచించారు. విభజన హామీల అమలుపై కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు దోబూచులాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని, పార్లమెంటులో నిరసనల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జనసేన అధినేత పవన్ జేఏసీ ప్రకటనపై స్పందిస్తూ, దానిపై స్పష్టమైన విధివిధానాలేవీ తమ దృష్టికి తీసుకురాలేదని నేతలు స్పష్టం చేశారు. ఒకవేళ పవన్ నుంచి పిలుపొస్తే ఏం చేయాలనేదీ వామపక్షాలన్నీ మాట్లాడుకొని నిర్ణయిస్తాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై వెంకటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు హరినాథ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రామారావు, పోలారి, ఎంసీపీఐయూ నాయకులు టి శివయ్య పాల్గొన్నారు.

ముద్దుకృష్ణమకు అంతిమ వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్దు కృష్ణమ నాయుడుకి గురువారం అశేష జనవాహిని ఘన నివాళులతో అంతిమ వీడ్కోలు పలికారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామపురంలో ముద్దు కృష్ణమ పార్థివ దేహానికి గురువారం సాయంత్రం 4.42 గంటలకు వారి వ్యవసాయ భూమి, మామిడి తోట వద్ద రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అంతిమ యాత్రకు రాష్ట్ర మంత్రులు అమరనాథ రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, అచ్చెంనాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, గౌనివారి శ్రీనివాసులు, బి.ఎన్.రాజసింహులు జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న, తుడ చైర్మన్ నరసింహయాదవ్, శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి, సుగుణమ్మ, తలారి ఆదిత్య, శంకర్, నారాయణ స్వామి, మాజీ ఎంపీ చింతామోహన్, కరుణాకర రెడ్డి రాజకీయాలకతీతంగా హాజరయ్యారు. ప్రముఖులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. పార్థివ దేహాన్ని చెవిరెడ్డి, కరుణాకర రెడ్డి మోశారు.

ఏపీకి డీప్ వరల్డ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆరు ఖండాలు, నలభై దేశాల్లోని నౌకాశ్రయాల్లో మెరైన్, ఇన్‌లాండ్ టెర్మినల్లను కలిగి, సప్లయ్ చైన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్యానికి మార్గం సుగమం చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న డీపీ వరల్డ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో కార్యబృందం ఏర్పాటైంది. ఈ సంయుక్త కార్య బృందంలో ఏపీ ప్రభుత్వ మౌలిక సదుపా యాల శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, డీపీవరల్డ్ సీఈవో యువరాజ్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టు బడులు పెట్టేందుకు, వివిధ అంశాలలో కలిసి పనిచేసేందుకు సీఎం చంద్రబాబు గత దుబాయ్ పర్యటనలోనే డీపీ వరల్డ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఏపీలో తమ సంస్థ కార్యకలా పాల విస్తృతికి వెంటనే ఒక బృందాన్ని పంపిస్తామని ముఖ్యమంత్రి తాజా పర్యటనలో డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ బిన్ సులేయామ్ వెల్లడించారు. సోమవారం భారత్ వస్తున్న డీపీ వరల్డ్ ప్రతినిధి, ఏపీ అధికారుల బృందాన్ని కలుసు కుని చర్చించనున్నట్టు సులేయామ్ తెలిపారు. ఏపీలో కనీసం మూడు చోట్ల లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేయా లని, ఒక పారిశ్రామిక సెజ్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిం చాలని సులేయామ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. మూడు నెలల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని సులేయామ్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. సీఎంతో భేటీలో డీపీ వరల్డ్ గ్రూపు డిప్యూటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీ సర్ రాజ్‌జిత్ సింగ్ వాలియా, కార్పొరేట్ ఫైనాన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ ఖన్నా ఉన్నారు.

విశాఖ కన్వెన్షన్ సెంటర్ ఆకృతులు సిద్ధం

విశాఖపట్నంలో లులూ గ్రూపు ఏర్పాటు చేస్తున్న కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన నిర్మాణ ఆకృతులు సిద్ధమయ్యాయి. వీటిని దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ఆ సంస్థ ప్రతినిధులు చూపించారు. మరోవైపు విశాఖలో ఈనెల 26న లులూ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది.

రాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ: కేంద్రం విభజన చట్టంలోని హామీలను అమలు చేయటం లేదంటూ వైసీపీ ఎంపీలు గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. టీడీపీకి చెందిన మంత్రులు రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు కోట్ల రూపాయలు ఆశ చూపి తమ వైపు లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతితో భేటీ తర్వాత వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ జగన్ పాదయాత్ర గురించి రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఉండి టీడీపీ మంత్రులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, రాష్ట్రపతి ప్రసంగాన్ని కేబినెట్‌లో ఆమోదించిన తర్వాత రాజ్యాంగంలోని ఆర్టికల్ 74, 75ను వారు అతిక్రమిస్తున్నారని కోవింద్‌కు వివరించామన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా ఏపీ స్పీకర్ వ్యవహరిస్తున్న తీరును రాష్ట్రపతి దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు మళ్లీ వైసీపీ ఎమ్మెల్యేలతో టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ బేరసారాలు చేస్తున్నారని, రూ.25 కోట్లు వెచ్చించి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. విభజన చట్టంలో అమలుకాని అంశాలను రాష్ట్రపతికి వివరించామని తెలిపారు. ఎంపీగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే క్రమంలో భాగంగా అందరినీ కలుస్తున్నామని, సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్న ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఈసీని కలుస్తామన్నారు. వైసీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ని కేంద్రం ఆదుకోవాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారు. ఏపీకి రాజధాని లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాబోయే కాలంలో రాజకీయ సమీకరణలు చాలా మారబోతున్నాయని అప్పుడు కేంద్రాన్ని ఏం అడగాలో అడిగి మరీ ఏపీకి న్యాయం జరిగేలా చేస్తామని మేకపాటి తెలిపారు.

'ఆప్కాబ్, డీసీసీబీ' పదవీకాలం పొడిగింపు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ఏపీ సహకార బ్యాంక్ (ఆప్కాబ్), జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ల (డీసీసీబీ) ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలపాటు ప్రభుత్వం పొడిగించింది. ప్రకాశం, అనంతపురం డీసీసీబీలు మినహా మిగిలిన 11 డీసీసీబీ, ఆప్కాబ్ పాలకవర్గాలకు ఇది వర్తిస్తుంది. ఆప్కాబ్ ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుండగా, డీసీసీబీలకు 17తో ముగియనుంది. గత నెలలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వ్యవసాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) బీ రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 31న సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాలకు ఆరు నెలలపాటు ఎక్స్‌టెన్షన్ ఇవ్వగా, తాజాగా డీసీసీబీ, ఆప్కాబ్‌కు పాలకవర్గాల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఆప్కాబ్ పదవీకాలం ఈనెల 28వ తేదీతో ముగియనుండగా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప డీసీసీబీల పదవీకాలం 17తో, గుంటూరు డీసీసీబీ పాలకవర్గం పదవీకాలం 28వ తేదీతో ముగియనుంది. ఇప్పటికే పీఏసీఎస్‌ల పాలక వర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించింది. మూడంచెల విధానంలో పీఏసీఎస్ అధ్యక్షుల నుంచే డీసీసీబీ, ఆప్కాబ్ అధ్యక్షులను ఎన్నుకోగా, వాటిలో పీఏసీఎస్ అధ్యక్షులు కొందరు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ సహకార సంఘాల చట్టం 1964లోని 115 (డీ)లోనని సబ్ సెక్షన్ 16, క్లాజ్ (ఏ) ప్రకారం పదవీకాలాన్ని పొడిగించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No. [illegible] Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

Dwaraka